RNI.No. APTEL/2014/57702 ESTD: 1999 www.voodayam.com




# వుదయం




గుంటూరు | 05-09-2026 శనివారం | సంపుటి : 13 | సంచిక : 172 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Postal Regd. No. GTR/117/2025-27 | Follow us on

# విద్యా రంగానికి పెద్దపీట

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

## డిగ్రీ కాలేజీ, రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

## నిర్మాణాల్లో నాణ్యతపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు

## ప్రభుత్వ విద్యే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి క్షేత్రస్థాయి పర్యటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (వుదయం)**

రాష్ట్రంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో రేవంత్ రెడ్డి పర్యటించి, పలు కీలక నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పరిశీలన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'ఎడ్యుకేషన్ హబ్' నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఇంజనీరింగ్, మెడికల్, వెటర్నరీ, నర్సింగ్, పీజీయోథెరపీ, పారామెడికల్ కళాశాలలతో పాటు 400 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన సముదాయాల నిర్మాణ తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను హెచ్చరించారు. వర్షపు నీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేసి, ఆ నీటిని ల్యాండ్‌స్కేపింగ్‌కు వినియోగించాలని స్పష్టం చేశారు. మద్దూరులో సాంఘిక సంక్షేమ పాఠశాల, డిగ్రీ కాలేజీ తనిఖీ నారాయణపేట జిల్లా మద్దూరులో కొత్తగా రూపుదిద్దుకుంటున్న సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. దశాబ్దం క్రితం స్థానికులు సొంత డబ్బుతో కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించిన స్థలంలో ఈ పాఠశాల నిర్మితమవుతోంది. ఈ సందర్భంగా భూములిచ్చిన రైతులను ప్రత్యేకంగా అభినందించిన సీఎం.. వారి కుటుంబాలన్నింటికీ 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మద్దూరులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేఅవుట్, డిజైన్లను పరిశీలించి పలు మార్పులు సూచించారు. నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని, కాలేజీ చుట్టూ పకడ్బందీగా ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు.






# ఇస్రో ఖాతాలో చరిత్రాత్మక విజయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (ఎఎంస్) :**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అద్భుత విజయంతో అరివీర భయంకరమైన సరిహద్దు నిఘా వ్యవస్థకు పదును పెట్టింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీఎఫ్17 (GSLVF17) ప్రయోగం విజయవంతమైంది. ఈ ఉత్కంఠభరిత ప్రయోగం ద్వారా అత్యంత కీలకమైన 'ఈవోఎస్05' (EOS05) ఇమేజింగ్ ఉపగ్రహాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా సబ్‌జీటీఓ కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. జియోసింక్రోనస్ కక్ష్యను లక్ష్యంగా చేసుకుని భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఇదే కావడం విశేషం. శత్రు దేశాలు ఎంత పకడ్బందీగా రహస్య సైనిక స్థావరాలను ఏర్పాటు చేసినా, ఈ ఉపగ్రహం అందించే అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ చిత్రాల ద్వారా వాటిని ఇట్టే పసిగట్టవచ్చు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా విపత్తుల నిర్వహణ, వాతావరణ మార్పులు, పెను తుఫానుల తీవ్రతను ముందుగానే అంచనా వేయడంలో ఈ శాటిలైట్ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.





ఈ చరిత్రాత్మక విజయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. దేశ అంతరిక్ష సాంకేతిక సత్తాకు ఇదొక మైలురాయి అని కొనియాడారు. ఇస్రో శాస్త్రవేత్తలకు, దేశీయ పరిశ్రమల భాగస్వామ్యానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# మంత్రివర్గం నుంచి కొండా సురేఖ బర్తరఫ్..

## ఫేస్‌బుక్ పోస్ట్‌పై ఆమె స్పష్టత

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (వుదయం)**

తన పేరుతో ఫేస్‌బుక్‌లో వైరల్ అవుతున్న 'బిగ్ అప్‌డేట్' పోస్ట్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ మంత్రివర్గం నుంచి తప్పుకున్న కొండా సురేఖ స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా ఆమె స్పందిస్తూ, తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని మీడియాను, ప్రజలను కోరారు. త్వరలో పెద్ద అప్డేట్ వస్తుందంటూ కొండా సురేఖ పేరిట ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ వైరల్ అయిన విషయం తెలిసిందే. కాగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సలహా మేరకు గవర్నర్ ఆదేశాల ప్రకారం కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేసినట్లు రాజ్‌భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. పార్కల్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండ సుష్మిత చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ నేపథ్యంలోనే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ నోటీసులు జారీ చేయడం, ఆ వివాదం కాంగ్రెస్ హైకమాండ్‌కు చేరడం తెలిసిందే. పార్కల్ నియోజకవర్గంలో రేవూరి ప్రకాశ్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి మద్దతు ప్రకటించడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

# రూ.42 కోట్ల సైబర్ కుంభకోణం

## ముగ్గురు నిందితుల గుర్తింపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్న డిజిటల్ మోసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (CBI) ఉక్కుపాదం మోపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీబీఐ, దేశంలోని 20 రాష్ట్రాల్లో ఒకేసారి 89 ప్రాంతాల్లో విస్తృత సోదాలు నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా డిజిటల్ అరెస్టుల పేరుతో కోట్ల రూపాయలు కాజేసిన ముగ్గురు ప్రధాన నిందితులను అరెస్టు చేసింది. వారి నుంచి కీలకమైన డిజిటల్ పరికరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. పోలీసులు, ఇతర ప్రభుత్వ అధికారులమంటూ నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు సాగిస్తున్న డిజిటల్ అరెస్టుల దందాతో బాధితులు నిలువునా మోసపోతున్నారు. ఈ తంతులో సీబీఐ దర్యాప్తు చేసిన కేవలం మూడు కేసుల్లోనే బాధితులు ఏకంగా రూ.42 కోట్లు నష్టపోయినట్లు తేలింది.

# డ్రగ్స్ మత్తులో విమానం నడిపిన పైలట్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4 (ఎఎంస్) :**




ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడిన ఎయిరిండియా విమాన ఘటనపై ఆ సంస్థ కఠిన చర్యలు చేపట్టింది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీ వస్తుండగా తీవ్ర కుదుపులకు లోనైన విమాన పైలట్ డ్రగ్స్ సేవించినట్లు నిర్ధారణ కావడంతో, అతడిని సేవ నుంచి బర్తరఫ్ చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. గత నెల ఆగస్టు 4న 145 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఎయిరిండియా విమానం, 36 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో ఒక్కసారిగా 300 అడుగుల కిందకు జారింది. ఈ హఠాత్పరిణామంతో విమానం తీవ్రంగా కుదుపులకు గురికావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (AAIB) దర్యాప్తు చేపట్టి ప్రాథమిక నివేదికను సమర్పించింది. పైలట్ సైకోయాక్టివ్ పదార్థాలు (డ్రగ్స్) తీసుకున్నట్లు ఆ పరీక్షల్లో తేలిందని, ఈ వ్యవహారంపై తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (DGCA)ను ఆ బ్యూరో కోరింది. డీజీసీఏ సూచనలు వచ్చిన గంటల వ్యవధిలోనే ఎయిరిండియా యాజమాన్యం స్పందించింది. పైలట్ తీరు సంస్థ భద్రతా ప్రమాణాలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పింది. విమాన భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేస్తూ, సదరు పైలట్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

# ఎమ్మెల్యేల రీ-ఎంట్రీ లేనట్టే

## కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా సురేఖలను పార్టీలోకి తీసుకోం

## పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ స్పష్టత

## మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్టే

**హైదరాబాద్, సెప్టెంబర్ 4 (వుదయం)**



పార్టీ ఫిరాయించి వెళ్లిన ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ, ఆ పార్టీ నేతలు మాత్రం గేట్లు మూసేసినట్లు స్పష్టం చేస్తున్నారు. మీడియాతో జరిగిన చిట్‌చాట్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి రాష్ట్ర రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీని వీడి వెళ్లిన వారిలో ఒకరిద్దరు మినహా మళ్లీ ఎవరినీ పార్టీలోకి ఆహ్వానించే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల రాకపోకలపై వస్తున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఒకవేళ కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నా పార్టీలో చేర్చుకునేది లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికలకు ముందే రాజగోపాల్‌రెడ్డి సోదరులు పార్టీలోకి వస్తామంటే అప్పట్లోనే బీఆర్ఎస్ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే అది డబ్బులకు అమ్ముడుపోవడమేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కూడా జగదీశ్‌రెడ్డి స్పందించారు. కొండా సురేఖను కూడా తమ పార్టీలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. ఆమెపై వస్తున్న ఆరోపణలు స్వయంగా కొండా సురేఖ చేసినవి కాదని, ఆమె కుమార్తె చేసినవని పేర్కొన్నారు. గడచిన కాలంలో రాజగోపాల్‌రెడ్డితో సహా పలువురు నేతలు నేరుగా బీఆర్ఎస్‌పై, కాంగ్రెస్ అధిష్ఠానంపై, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్‌లపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు.

### స్టాక్ మార్కెట్ అప్‌డేట్

76 శాతానికి పైగా ప్రీమియంతో షేర్ల లిస్టింగ్

అప్పర్ సర్క్యూట్‌ను తాకిన షేర్లు

రూ.10,500 కోట్లు దాటిన మార్కెట్ విలువ

# భారతీయ సంస్థతో ఆయుధ ఒప్పంద వివాదం


**న్యూఢిల్లీ:** ఆయుధాల కొనుగోలు ఒప్పందంలో బయటపడిన భారీ అవకతవకలు ఎస్తోనియా రక్షణ మంత్రి హన్నో పెవ్కుర్ పదవికి ఎసరు పెట్టాయి. దాదాపు రూ.768.50 కోట్ల విలువైన ఫిరంగి మందుగుండు సామగ్రి కొనుగోలు వ్యవహారంలో తీవ్ర విమర్శలు రావడంతో ఆయన నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేశారు. ఈ డీల్‌పై జరిగిన ఆడిట్‌లో అక్రమాలు వెలుగుచూడటంతో త్వరలోనే అధికారికంగా నేర విచారణ ప్రారంభంకానుంది. ఈ మొత్తం వివాదంలో భారత్‌కు చెందిన ఓ రక్షణ సంస్థ కేంద్ర బిందువుగా నిలవడం గమనార్హం. రష్యాతో భీకర యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్‌లో మందుగుండు సామగ్రికి తీవ్ర కొరత ఏర్పడింది. కీవ్‌కు ఆయుధాలు సమకూర్చే లక్ష్యంతో ఐరోపా దేశమైన ఎస్తోనియా.. 2024లో ఇటలీకి చెందిన 'డేటాసెల్ ఎస్ఆర్ఎల్' కంపెనీతో భారీ ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందే 2024 ఆరంభంలో ఈ డేటాసెల్ సంస్థను భారత్‌కు చెందిన 'నెకో డిఫెన్స్' కొనుగోలు చేసింది. ఈ మొత్తం ఒప్పందం విలువ 70 మిలియన్ యూరోలు కాగా.. ఐరోపా యూనియన్‌కు చెందిన 'యూరోపియన్ పీస్ ఫెసిలిటీ' నిధుల నుంచి ఎస్తోనియా ముందస్తుగా దశలవారీగా చెల్లింపులు జరిపింది. కొన్ని నెలల్లోనే మందుగుండు సామగ్రి ఉక్రెయిన్‌కు చేరుకుంటుందని భావించినా, సరఫరాలు పదేపదే ఆలస్యమయ్యాయి. 2025లో అందిన కొన్ని షెల్స్ పూర్తిగా లోపాలతో ఉన్నాయని, అందుకే వాటిని ఉక్రెయిన్‌కు పంపలేదని ఎస్తోనియా ఆరోపించింది.




# విషవాయువులు పీల్చి 37 మంది దుర్మరణం

**నైజీరియా :** నైజీరియాలో జరిగిన ఘోర ప్రమాదంలో ముడిచమురు దొంగిల యత్నించిన 37 మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, రివర్స్ స్టేట్ ప్రాంతంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఇండోరామా ఎలెమె పెట్రోకెమికల్ కేంద్రాల నుంచి పోర్ట్ హార్కోర్ట్ రిఫైనరీకి చమురును సరఫరా చేస్తున్న ప్రధాన పైప్‌లైన్‌కు కొందరు దుండగులు అక్రమంగా ట్యాపింగ్ చేశారు. ఆ పైపునకు మరో లైన్‌ను అనుసంధానించి నదిలో ఉన్న తమ ఓడల ట్యాంకుల్లోకి ముడిచమురును దొంగిలించేందుకు ప్రయత్నించారు. ఈ ప్రక్రియలో హఠాత్తుగా తీవ్రస్థాయిలో విషవాయువులు విడుదలయ్యాయి. ఆ విషవాయువులను పీల్చడంతో అక్కడే ఉన్న పలువురు అపస్మారక స్థితిలోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయారు. నదిలో నుంచి ఇప్పటివరకు 37 మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు ధృవీకరించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండటంతో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇంతే కదా...!





## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా
# ఘనంగా అన్నదానం



**చంద్రగిరి,తిరుచానూరు, సెప్టెంబర్ 2(వుదయం ప్రతినిధి):** జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ 55 వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ జనసేన పార్టీ అధ్యక్షులు వెంకట్ రాయల్ ఆధ్వర్యంలో బుధవారం తిరుచానూరు ఆలయ గేట్ సమీపంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట్ రాయల్ మాట్లాడుతూ.. ప్రజా సేవే జనసేన పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు, జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వెంకట్ రాయల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు బండ్ల లక్ష్మీపతి, తపసి మురళి రెడ్డి, చంద్రమౌళి, ప్రతాప్ రెడ్డి, యుగంధర్, సమర, దండు లక్ష్మీపతి, బీజేపీ నాయకురాలు పుష్ప మరియు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**ఎడుకలు**

**ధరూర్ సెప్టెంబర్ 04 (వుదయం బ్యూరో)**

మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు శ్రీ కృష్ణుడు, రాధా వేషధారణల్లో ముస్తాబై వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నెమలి పింఛం, వేణువుతో బాలకృష్ణుడి రూపంలో ముస్తాబైన చిన్నారులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారుల ముచ్చటైన వేషధారణలు, ఆటపాటలు, కేరింతలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. చిన్ని కృష్ణుల రూపంలో చిన్నా రులు చేసిన సందడి అక్కడికి వచ్చిన భక్తులు, స్థానికులను అలరించింది.



శ్రీకృష్ణుడి బాల్య లీలలను తలపించేలా చిన్నారుల వేషధారణలు, కార్యక్రమాలు సాగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రత్యేకంగా అలంకరించి వేడుకల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. దీంతో ధరూర్ మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారుల ఉత్సాహం, భక్తుల సందడితో కృష్ణాష్టమి వేడుకలు ఆద్యంతం కన్నులపండువగా సాగాయి.



# ఎంబీబీఎస్ సీటు సాధించిన ప్రశాంత్ కు సన్మానం

**అచ్చంపేట, సెప్టెంబర్ 04: (వుదయం ప్రతినిధి )**

అచ్చంపేట పట్టణం వలపట్ల కాలనీకి చెందిన మూడి తిరుపతయ్య మేస్త్రి కుమారుడు ప్రశాంత్ కుమార్ ఎంబీబీఎస్ నీట్ లో సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం, డివిజన్ అచ్చంపేట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ప్రశాంత్ కు శాలువా కప్పి, పూలమాల వేసి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పాతుకుల శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మీసాల ప్రభాకర్, కోశాధికారి కొంకి విజయ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మంద వెంకటయ్య, వీరభద్ర హెయిర్ కటింగ్ షాపు బీసీ నాయకులు వెంకటస్వామి, గ్యాస్ వేణు, అంతటి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# గత పదేళ్లలో జరగని అభివృద్ధి

- **అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాల అసత్య ఆరోపణలు**
- **విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి**

**గద్వాల సెప్టెంబర్ 04 (వుదయం కరస్పాండెంట్)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లోనే గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని చేసి చూపించిందని జోగులాంబ గద్వాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేకే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ ప్రజా బంగ్లా కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం మేర అమలు చేశామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు.గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణంతో పాటు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన రహదారుల సమస్యల పరిష్కారానికి కోట్లాది రూపాయల నిధులతో పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు. నిరుద్యోగ యువత కోసం పోలీస్, ఫారెస్ట్ తదితర శాఖల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతిపక్షాలు రాజకీయ కోణంలో కాకుండా ప్రజా ప్రయోజనాల దృష్టితో ప్రభుత్వ కార్యక్రమాలను చూడాలని రాజీవ్ రెడ్డి సూచించారు. అసత్య ఆరోపణలు మానుకుని అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో డీసీసీ వైస్ ప్రెసిడెంట్లు గట్టు గౌస్, మద్దిలేటి, జనరల్ సెక్రటరీలు శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, సంకాపురం రాముడు, మధు నాయుడు, కాకులారం నర్సింహులు, నగేష్, టీపీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధరూర్ రవి, నరేందర్, ఉప్పల్ తిమ్మారెడ్డి, ఆయా మండల అధ్యక్షులు ఎర్రవల్లి నర్సిరెడ్డి, లక్ష్మేందర్ రెడ్డి, ఆంజనేయులు, రాజు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## దుబ్బాకలో "కొత్త"గా "రఘు"లుతున్న రాజకీయ ఎత్తుగడ..!
# ఒకే దెబ్బతో ఇద్దరికీ చెక్..?

- **అభివృద్ధి కోసం ఒకటైన ఎమ్మెల్యే, ఎంపీ**
- **ఇద్దరి వెనుక అసలు కథేంటి..?**
- **ఆ ఇద్దరికోసమే వీరు కలిశారా..?**
- **నియోజకవర్గ అభివృద్ధి వారి లక్ష్యమా.!**

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 4, వుదయం:**





రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు. చదరంగాన్ని మించిన ఈ ఆటలో చివరికి నేర్పరే గెలుస్తారు. ఇదే సూత్రం ఇప్పుడు సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో కొత్త చర్చకు తెరలేపింది. గతంలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు మధ్య విమర్శలు తారాస్థాయికి చేరాయి. అధికార కార్యక్రమాల్లో ఇరు పార్టీల కార్యకర్తల నినాదాలు, పరస్పర విమర్శలతో రాజకీయ వేడి రగిలేది. నాయకులు, కార్యకర్తలను అదుపు చేయడం పోలీసులకు తలకు మించిన భారంగా మారేది. కానీ ఇప్పుడు దుబ్బాకలో సీన్ రివర్స్ అయింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు అక్బర్ పేటభూంపల్లి మండలంలో జరిగిన ప్రారంభోత్సవాలకు ఒకే కారులో కలిసి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడంతో విభేదాలకు ఫుల్ స్టాప్ పడినట్లయింది. ఈ ఊహించని పరిణామంతో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు షాక్ లో ఉన్న ప్రజలు మాత్రం గొడవలు, విమర్శలు లేకుండా అభివృద్ధి పనులకు పునాదులు పడ్డాయని చర్చించుకోవడం విశేషం.

**ఈ కలయిక వెనుక మతలబు ఏంటి?**

ఒక్కసారిగా ఇద్దరు నాయకులు కలవడం వెనుక ఇంకేమైనా వ్యూహం దాగి ఉందా అనే చర్చ జోరుగా సాగుతోంది. రాజకీయ చదరంగంలో ఇతర నాయకులు ఎదగకుండా చేసే కుట్రలో భాగమే ఈ కలయిక అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సోలిపేట రామలింగారెడ్డి వర్ధంతి వేడుకల్లో సోలిపేట సుజాత రాబోయే ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ ప్రకటనే కొత్త ప్రభాకర్ రెడ్డి యూటర్న్ తీసుకొని రఘునందన్ రావుతో స్నేహానికి బీజం వేసిందా అనే చర్చ నియోజకవర్గంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రఘునందన్ రావును అధికార బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రోటోకాల్ విషయంలో తీవ్రంగా అవమానించారు. ఇప్పుడు ప్రతీకారం కాకుండా అభివృద్ధి కోసం చేతులు కలపడం శుభపరిణామమే అయినా, అది ఎంతవరకు నియోజకవర్గ ప్రజల కోసమే అనే సందేహం మొదలైంది. దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీని పుంజుకోకుండా చేయడంతో పాటు సొంత పార్టీలో వర్గపోరు, సెకండ్ క్యాడర్ లేకుండా చేయడానికి అంటూ కొందరు రాజకీయ నాయకులు మాట్లాడుకుంటున్నారు.

**ఇద్దరికీ ఒకే దెబ్బతో చెక్!**

ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నడవడం వెనుక బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తానంటున్న సోలిపేట సుజాత, కాంగ్రెస్ నుంచి పోటీకి సిద్ధమవుతున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు ఒకేసారి చెక్ పెట్టేందుకే ఈ ఎత్తుగడ అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వారిద్దరినీ నియోజకవర్గంలో ఎదగకుండా చేయడానికే ఇద్దరు పెద్ద నాయకులు ప్లాన్ చేశారనే చర్చ జోరుగా సాగుతోంది. "పదవుల్లో ఉన్న మనం కొట్లాడితే వారికి మేలు" అనే కోణంలో కలిసారనే వాదన వినిపిస్తుంది. ఏదేమైనా రాబోయే ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందే దుబ్బాక నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నాయకుల ఎత్తు పైఎత్తులతో వర్గపోరుకు బీజం వేసే నాయకులకు చుక్కలు తప్పవా..? ఇక మూడు పార్టీల అధిష్టానం ఎలా స్పందిస్తుందో, ఎవరికి మద్దతు ఇస్తుందో వేచిచూడాల్సిందే.

# కోహీర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలి

- **"గేట్ వద్ద గంటలకు పైగా నిలిచిపోతున్న వాహనాలు", "ప్రయాణికుల తీవ్ర అవస్థలు"' "ఫ్లైఓవర్ బ్రిజ్ నిర్మించాలని డిమాండ్"**

**కోహీర్ సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి )**

కోహీర్ రైల్వే గేట్ వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తుగా రైల్వే గేట్ మూసివేయడంతో ఇరువైపులా ప్రయాణికులు నిలిచిపోవాల్సి వచ్చింది.రైలు వచ్చే వరకు గేట్ తీసే అవకాశం లేకపోవడంతో వాహనాలు వరుస కట్టయి దీంతో రోడ్డుపై దాదాపు కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అత్యవసర పనులపై ప్రయాణించే వారు తీవ్ర ఆందోళన చెందారు. అంబులెన్స్. ద్విచక్ర వాహనదారులు, కార్లు, లారీలు మరియు ఇతర వాహనాలు రోడ్డు పై ఉండి వేచి చూడాల్సి వచ్చింది.

రైల్వే గేట్ మూసివేయడం వల్ల గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు తీవ్ర ఆలస్యమయ్యారు.రోడ్డుపై స్థలం లేకపోవడంతో అంబులెన్సులు, అత్యవసర వాహనాలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకునే పరిస్థితి ఏర్పడింది.ప్రతిసారి రైలు ఆలస్యమైనప్పుడు ఇక్కడ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కోహీర్ రైల్వే గేట్ వద్ద తరచూ ఇటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.వంతెన (ఆర్‌ఓబీ) లేదా అండర్ పాస్ లేకపోవడం వల్లే ఈ సమస్య తీవ్రమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.గంటల తరబడి గేట్ మూసివేస్తే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొంటున్నాం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .సమయపాలన పాటించకుండా రైళ్లు రావడం



వల్ల నిత్యం ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి కోహీర్ రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఫ్లైఓవర్ నిర్మిస్తే తప్ప ఈ ట్రాఫిక్ కష్టాల నుండి శాశ్వత విముక్తి లభించదని స్పష్టం చేస్తున్నారు.ఈ సమస్య పై ప్రజాప్రతినిధులు మరియు రైల్వే ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలి. ఇటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు స్థానిక పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సుదీర్ఘ నిరీక్షణతో నరక యాతన అనుభవించినట్లు వాహనదారులు వాపోయారు.రైల్వే శాఖ వెంటనే స్పందించి రైళ్ల సమయపాలనను పునః సమీక్షించాలని కోరుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ప్రణాళికలు రూపొందించాలని విన్నవించారు. కోహీర్ ప్రజల రవాణా కష్టాలను తీర్చడానికి త్వరితగతిన పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలన 1000 రోజుల విజయోత్సాహ ర్యాలీ

- **"మాజీ మంత్రి డాక్టర్ ఎ. చంద్రశేఖర్ ఆధ్వర్యం. జహీరాబాద్‌లో ద్విచక్ర వాహన ర్యాలీ"**
- **"పాల్గొన్న కోహీర్ మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్. మండలం అధ్యక్షులు టీ. సువర్ణ మల్లన్న పాటిల్"**

**కోహీర్ సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి )**





కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో 1000 రోజులు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా, జహీరాబాద్ పట్టణంలో మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జ్ డాక్టర్ ఎ. చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ ఘనంగా జరిగింది. శుభాష్ గంజ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాల సమర్పించిన అనంతరం కుమార్ హోటల్ మీదుగా కరెంట్ ఆఫీస్ వరకు సాగింది. డాక్టర్ ఎ. చంద్రశేఖర్ గారు ఈ ర్యాలీలో పాల్గొని నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మరింత ఉత్సాహాన్ని అందించారు.ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఎ. రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత కరెంట్), మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరా మహిళ శక్తి ద్వారా డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు మరియు పెట్రోల్ పంపులు వంటి అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి మరియు సుపరిపాలనను ప్రతిబింబించేలా ఈ ర్యాలీ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్లు మహమ్మద్ యూనుస్, అశోక్ కుమార్, పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు హుగ్గెల్లి రాములు, సువర్ణమల్లన్న పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్, పవన్ రాథోడ్, పట్టణ అధ్యక్షులు ముజాఫ్ఫార్ హుస్సేన్, మాజీ పట్టణ అధ్యక్షులు కండేం నర్సింలు, తాజా మాజీ మండల పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు

- **హరీశ్ రావు, కేటీఆర్ సభలో అడుగుపెడితే మంత్రులకు ముచ్చెమటలు**
- **వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**
- **సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిరసన ధర్నా**

**సంగారెడ్డి వుదయం**

ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ హామీల అమలులో "మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడప దాటడం లేదు" అన్న చందంగా వ్యవహరిస్తోందని MLA చింత ప్రభాకర్ విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన ధర్నా నిర్వహించింది.

**కేసీఆర్ వస్తే రేవంత్‌కు తట్టుకోలేరు..**

అసెంబ్లీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగు పెడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ చింత ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే ముఖ్యమంత్రి, మంత్రులు "నోట్లో నాలుక లేనట్టుగా.. సమాధానం కోసం తడబడుతున్నారని" ఎద్దేవా చేశారు.

**వృద్ధులకు రూ.4,000 పింఛన్ హామీ ఏమైంది?**

ఎన్నికల సమయంలో వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వృద్ధులను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. "మాట ఇచ్చి మడమ తిప్పడం ప్రజలకు ఆమోదయోగ్యం కాదు.." అని పేర్కొంటూ, వృద్ధులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**మహిళలకు రూ.2,500 ఎక్కడ?**

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు.మహిళలకు నెలనెలా రూ.2,500 అందిస్తామన్న హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.



**వికలాంగులకు రూ.6,000 పింఛన్ హామీ ఏమైంది?**

వికలాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ హామీని అమలు చేయకుండా వికలాంగులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ఎన్నికల ముందు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటా?**

"ఎద్దు పోయిన తర్వాత గోతులు తవ్వినట్టుగా.. అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెట్టడం సరికాదు" అని విమర్శించారు.

వృద్ధులు, మహిళలు, వికలాంగులు కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేశారని, ఇప్పుడు అదే ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు."హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదు"వృద్ధులకు రూ.4,000 పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వికలాంగులకు రూ.6,000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ TNGOs రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# డయల్ 100/112 అత్యవసర సేవా నంబర్లు

- **అనవసర/ఫేక్ కాల్స్ చేస్తే కఠిన చర్యలు – పోలీస్ హెచ్చరిక......**

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 4....**

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన చిత్తారి నరసింహులు మద్యం మత్తులో డయల్ 100/112 కు నిరంతరం అనవసర కాల్స్ చేస్తున్న గోమారం కు చెందిన చిత్తారి నరసింహులు వ్యక్తికి పోలీసుల కౌన్సిలింగ్ *

డయల్ 100/112 అనేది ఆపదలో ఉన్న ప్రజలను తక్షణమే ఆదుకోవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యవసర సేవా విభాగం అని, దీనిని దుర్వినియోగం చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి స్పష్టం చేశారు.

గత కొన్ని రోజులుగా చిత్తారి నరసింహులు అనే వ్యక్తి ఎలాంటి అత్యవసర కారణం మద్యం మత్తులో లేకుండా మాటిమాటికి డయల్ 100 నంబర్‌కు కాల్ చేస్తూ లైన్‌ను బ్లాక్ చేయడమే కాకుండా, సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు గుర్తించడం జరిగింది. అదేవిధంగా కొంతమంది మద్యం మత్తులో ఈ విధంగా డయల్ 100/112 కి కాల్ చేస్తున్నట్టు గుర్తించడం జరిగింది

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు, సదరు వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కుటుంబ సభ్యుల సమక్షంలో గట్టిగా హెచ్చరిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. తాసిల్దార్ ముందు బైండోవర్ చేయడం జరిగింది మొదటి తప్పుగా భావించి వ్యక్తి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతానికి హెచ్చరికతో విడిచిపెట్టడం జరిగిందని, మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని స్పష్టం చేశారు.

**అనంతరం ఎస్సై మధుకర్ రెడ్డి మాట్లాడుతూ.**

* డయల్ 100 కేవలం అత్యవసర పరిస్థితులకు మాత్రమే: ప్రమాదాలు, నేరాలు, మహిళలు/చిన్నారులపై దాడులు, ప్రాణాపాయం వంటి అత్యవసర సమయాల్లో ప్రజలను రక్షించడానికి డయల్ 100 నిరంతరం పనిచేస్తుంది.

* ఆపదలో ఉన్నవారి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు: మీరు చేసే ఒక్క ఫేక్ లేదా అనవసరపు కాల్ వల్ల, నిజంగా ప్రాణాపాయంలో ఉన్న మరొకరికి సకాలంలో పోలీస్ సహాయం అందకుండా పోయే ప్రమాదం ఉంది.

* ఫేక్/ప్రాంక్ కాల్స్‌పై నిఘా: పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనవసర కాల్స్, ప్రాంక్ కాల్స్ లేదా అసభ్యకరంగా మాట్లాడే వారి ఫోన్ నంబర్లు, లొకేషన్లు రికార్డ్ అవుతాయి. అలాంటి వారిపై టెలికాం చట్టాలు మరియు భారతీయ న్యాయ సంహిత (BNS) ప్రకారం నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి అత్యవసర సేవల వ్యవస్థకు సహకరించాలని తెలిపారు.



# నిరసన సభకు భారీగా గులాబీదండుతో తరలిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 04 ....**

మండల కేంద్రమైన శివ్వంపేట నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాసాయిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన సభకు భారీ కాన్వాయ్ | తో తరలివెళ్లారు. శివ్వంపేటకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు వాహనాలతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం ఆమె వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణగౌడ్ ఆధ్వర్యంలో భారీ వాహనాల కాన్వాయ్తో మాసాయిపేటకు బయలు దేరింది. సభకు శివ్వంపేట మండలం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లడంతో మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్రెడ్డి, సీనియర్ నాయకులు యాదగౌడ్, 'మహిపాల్రెడ్డి, కుంట లక్ష్మణ్, ముద్దగల్ల లక్ష్మీ నర్సయ్య, మహేందర్రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్రెడ్డి, సత్యం, మైసయ్య యాదవ్, రాంచందర్ గౌడ్, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఉన్నారు.

# హిందువుల ఐక్యతకు కృషి చేద్దాం



- **ఆర్య సమాజ్ సార్వదేశి ప్రతినిధి విట్టల్ రావు ఆర్య**

**నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 4(వుదయం ప్రతినిధి)**

విశ్వహిందూ పరిషత్ 63 వ ఆవిర్భావ దినోత్సవం నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చౌక్ బజార్ లో శ్రీ కృష్ణుని పటానికి పూజలు నిర్వహించి కేసరి పథకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్య సమాజ్ సార్వదేశి ఆర్య ప్రతినిది విఠల్ రావు జెండా ఆవిష్క రణ చేశారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాబోవు రోజు ల్లో హిందూ సమాజం ఐక్యమత్యం చాలా ముఖ్యమని ఆయన అన్నారు.హిందువాంస్థలూ హిందువుల ఐక్యత కోసం కృషి చేయాలని కోరారు. గోవును జాతీయ జంతు వుగా ప్రకటించాలని ఆయ న డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్, విశ్వహిందూ పరిషత్ నగర అధ్య క్షుడు మురళి బట్టడ్, నగర కార్యదర్శి ప్రవీణ్ కడదాస్, ఉత్సవ సమితి అధ్యక్షుడు భీమ్ ఛందర్ గౌడ్, రవి కుమార్ గౌడ్ ,ఉమాదేవి శ్రవణ్ ,సందీప్ ,కౌన్సిలర్ల ప్రభాకర్ ,రాము సతీష్ కృష్ణ నీరటి వెంకటేష్ ఆకాష్ అనిల్ బాలు చక్రి బస్తీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ నూతన సినిమా పాట ఆవిష్కరణ

**వెల్దండ సెప్టెంబర్ 4 (వు దయం)**

కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన సినీ నిర్మాత సింగం విజయ్ గౌడ్ ను మాజీ మంత్రి బిఆర్ ఎస్ అధినేత కేటీఆర్ అభినందించారు హైదరాబాద్లోని వారి నివాసంలో శుక్రవారం విజయ గౌడ్ రచనలో రూపొందిన నూతన సినిమా పాట సిడి నీ కేటీఆర్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సినిమా హిట్ కావాలని వారు ఆకాంక్షించారుకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణ రెడ్డి,తలకొండపల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమల్ల సుభాష్,సర్పంచ్ జల్లెల్ల కృష్ణ,సత్యం తదితరులు పాల్గొన్నారు.



# శిరీష హత్య కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

- మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్, రూ.5 లక్షల చెక్కు అందజేత

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి)**

హైదరాబాద్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ దారుణ హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబాన్ని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతురాలి తల్లి, అన్న, వదిన, ఇతర కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన శిరీష కుటుంబానికి అండగా నిలిచేందుకు హైదరాబాద్ వెళ్లి నర్సుగా పనిచేస్తుండగా దారుణ హత్యకు గురి కావడం అత్యంత విషాదకరమన్నారు. సవ్యసమాజం తలదించుకునేలా ఈ ఘటన చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీషపై హత్యతో పాటు లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో గతంలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా ఉద్యోగం పొందిన శిరీష.. కుటుంబానికి అండగా నిలిచేందుకు హైదరాబాద్ వెళ్లిందని మంత్రి గుర్తుచేశారు. ఆమె మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**రూ.5 లక్షల ఆర్థిక సాయం**

మృతురాలి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్స్‌తో పాటు రూ.5 లక్షల చెక్కును మంత్రి పొంగులేటి అందజేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఐటీడీఏ పీవో రాహుల్, హౌసింగ్ పీడీ సవయ్ రామ్ తదితరుల సమక్షంలో ఈ సహాయాన్ని అందించారు.

**వసతి గృహం, ఆసుపత్రిపై విచారణకు ఆదేశాలు**

అనంతరం హైదరాబాద్‌లోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శిరీష హత్యకు సంబంధించిన అంశాలపై మంత్రి ఆ ప్రాంత పోలీసు ఉన్నతాధికారితో మృతురాలి కుటుంబ సభ్యుల సమక్షంలో ఫోన్‌లో మాట్లాడారు. శిరీష ఉంటున్న వసతి గృహాన్ని తక్షణమే తనిఖీ చేసి, ఆసుపత్రికి అనుసంధానమైన వసతి గృహాల్లో భద్రతా చర్యలపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. అవసరమైతే సంబంధిత ఆసుపత్రిపై సీజ్ చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. హత్యకు సంబంధించిన కేసులో ఆసుపత్రి, వసతి గృహాలకు సంబంధించిన వ్యక్తుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్‌లో సంబంధిత వ్యక్తుల వివరాలు ఎందుకు నమోదు కాలేదనే అంశాన్ని పరిశీలించి, అవసరమైతే అదనపు ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా



చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

**సీఎంతో చర్చించి న్యాయం చేస్తాం**

శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమై తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి తెలిపారు. మృతురాలి తల్లి తన ఆవేదనను, ప్రశ్నలను తన ముందుంచిన సమయంలో సమాధానం చెప్పలేకపోయానని, ఆమె మనోవేదన తనను కలచివేసిందని మంత్రి పేర్కొన్నారు. శిరీష కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ములకలపల్లి తహసీల్దార్ స్వాతి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనలో వంటావార్పు



**మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 04**

నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద, మహిళలు దివ్యాంగులు వృద్దులు వంటావార్పు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు పలువురు మహిళా నాయకులు కార్పొరేటర్లు మాట్లాడుతూ.. మహిళలు మోసపు వాగ్దానాలు చేసిగద్దెనెక్కిన ఈ ప్రభుత్వం. అన్నిట మోసం చేసిందని, మహిళలకు 2500, దివ్యాంగులకు 6000 వృద్దులకు 4000 విద్యార్థినులకు స్కూటీలు ఇస్తానని మోసం చేసిందని మాట్లాడిన ప్రతి మహిళా నాయకురాలు అనర్ఘళం గా మాట్లాడి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రభుత్వాన్ని తూర్పార పట్టారు. కంచర్ల మాట్లాడుతూ..రేవంత గారు నకరేకల్ వస్తున్నారు ఎందుకు వస్తున్నారు. మా ప్రభుత్వం లో మంజూరి చేసిన హాస్పిటల్ ప్రారంబానికివస్తున్నారు

రేవంత్ గారు రేపు నకరేకల్ కు వచ్చే ముందు మీరు ఇస్తానన్న మహిళలకు 2500/–వృద్దులకు 4000/ దివ్యాంగులకు 6000/– మహిళలకు కళ్యాణలక్ష్మి తులం బంగారం రైతులకు,కౌలు దారులకు ఎకరాకు రైతు భరోసా 15000 ఫీజు రీ అంబర్స్ మెంటు ప్రకటించి రావాలని కోరారు. లేకుంటే ప్రజల నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. రేవంత్ ప్రభుత్వం సంబండ వర్గాల ప్రజల ఆశలను నీరు కార్చిందని, మహిళలకు 2500/–దివ్యాంగులకు 6000/–వృద్దులకు 4000 విద్యార్థినులకు స్కూటీ లు ఇవ్వలేదని.. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి,కి మంగళం పాడాలని చూస్తున్నాడని, కెసిఆర్ కిట్ గ్యాస్ బండ ఎగనామం పెట్టా దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర పార్టీ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి గారు, రాష్ట్ర కార్పోరేషన్ మాజీ అధ్యక్షులు కటికం సత్తయ్య గౌడ్, మాజీ ఆర్ ఓ మాలే శరణ్య రెడ్డి గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెగట్టే మల్లికార్జున రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,బక్క పిచ్చయ్య సింగం రామ్మోహన్,కంచనపల్లి రవీంద్రరావు అభిమన్యు శ్రీనివాస్ సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరీం పాషా, బొజ్జ వెంకటయ్య మాజీ జడ్పీటీసీ తుమ్మల లింగస్వామి, నగర పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్, ఐతగోని యాదయ్య...పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, దేప వెంకట్ రెడ్డి, రావుల శ్రీనివాస రెడ్డి, సత్తయ్య సింగం లక్ష్మి, మామిడి పద్మ, కార్పొరేటర్లు, మందడి లిఖిత సైదిరెడ్డి, దొడ్డి రమేష్ మారగోని ని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కొందూరు దీపికా ప్రవీణ్ రెడ్డి,బాణావత్ దీప్లా, గోపగోని స్వాతి రాజశేఖర్.కందుల లక్ష్మయ్య,మండల మహిళా అధ్యక్షులు.. కొంద్ర స్వరూప, కొప్పోలు విమలమ్మ, మర్రి రేణుక, నర్రా నిర్మల,సరోజ,ఝాన్సీ, విజయరెడ్డి, బడుపుల శంకర్, వనపర్తి నాగేశ్వర్ రావు సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి తోపాటు పలువురు విద్యార్థినులు, మహిళలు దివ్యాంగులు వృద్దులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంగమ్మ గుడి.. పాలారం వరకు రహదారి అధ్వానం

- దెబ్బతిన్న కల్వర్టులు గుంతలమయమైన రహదారి
- రాత్రివేళ ప్రయాణమంటేనే వాహనదారుల హడలెత్తింపు

**అనంతగిరి, సెప్టెంబర్ 04 వుదయం**



గంగమ్మ గుడి నుంచి పాలారం వరకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో వారు మాట్లాడుతూ రహదారిపై ఉన్న కల్వర్టులు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారాయని తెలిపారు. అదే విధంగా రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో సరైన వెలుతురు లేకపోవడంతో దెబ్బతిన్న కల్వర్టులు, గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆరుబాటపు శంకుస్థాపనలు మాత్రమే తప్ప రహదారి పనులు పూర్తయింది లేదని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి గంగమ్మ గుడి నుండి పాలారం వరకు రహదారిని పరిశీలించి, దెబ్బతిన్న కల్వర్టులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి తారు రోడ్డు రహదారి నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రజా ప్రతినిధులను వాహనదారులు కోరారు.

## సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



**జేఏసీ చైర్మన్ మారం జగదీశ్**

**నల్గొండ జిల్లా వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 04**

నల్గొండ పట్టణ కేంద్రంలో టీఎన్జీ భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న "ఉద్యోగ హక్కుల సాధన సభ చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నల్గొండ–సూర్యాపేట జిల్లాల TGEJAC సన్నాహక సమావేశం ఈరోజు నల్గొండలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ , ఏలూరి శ్రీనివాసరావు, PRTU రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రెడ్డి , TSUTF JAC కో–చైర్మన్ చావా రవి గారు, TNGOs రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ , అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్ కస్తూరి వెంకటేశ్వర్లు PRTU రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షం గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై తమ సందేశాన్ని అందించారు

సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో లక్ష మందితో ఉద్యోగ హక్కుల సాధన సభ నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు మరియు అన్ని అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నల్గొండ జిల్లా TGEJAC భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు నాగిళ్ల మురళి అధ్యక్షతన, తమ తమ సంఘాల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులను హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జె. శేఖర్ రెడ్డి, తిరుపతయ్య, అంజిరెడ్డి, సోమయ్య, రాధాకృష్ణ, ఉపేందర్ రెడ్డి, జితేందర్, కృష్ణమూర్తి, దున్న శ్యామ్, గోపాల్ రెడ్డి, యాకూబ్ నాయక్,చేపూరి నరసింహాచారి, వెంకటేశ్వరం, జనార్ధన్, ఏడుకొండలు, భిక్షం, అలీమ్, సందీప్, కే. రాంబాబు, జీవన్ రెడ్డి, శాంసుందర్, అజీముద్దీన్, ఏలూరి లక్ష్మయ్య, ఖాసిం, జయరావు, ఆకనూరి లక్ష్మయ్య,కే. మనోజ్ ప్రదీప్, డీ. సాయిదులు, రణదేవి, భాస్కర్ శ్రీమతి రమ్యసుధా, సుమలత కరుణశ్రీ తదితర నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారి భవిన్ జోయల్ కనువిందు

**అనంతగిరి సెప్టెంబర్ 04 వుదయం**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు సంప్రదాయబద్ధమైన వివిధ వేషధారణలతో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారి భవిన్ జోయల్ శ్రీకృష్ణుడి వేషధారణలో అలంకరించుకుని చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాడు. నెమలి పింఛం, వేణువు, కృష్ణుడి అలంకరణతో ఎంతో ముద్దుగా, కనువిందుగా కనిపిస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నాడు. చిన్నారి కృష్ణుడి రూపంలో మెరిసిన



దృశ్యం జన్మాష్టమి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా వేషధారణ నిలిచింది.

## శ్రావణ మహాలక్ష్మి అలంకరణలో గాయత్రి మాత



**దమ్మపేట సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి ):**

దమ్మపేట మండల కేంద్రంలో గల శ్రీ గాయత్రీ ఆశ్రమం నందు గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా భక్తులకు మనశ్శాంతి, జ్ఞానం, విద్య లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం ఉంది. శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా శ్రావణ 4 వ శుక్రవారము కావున గాయత్రీ అమ్మవారిని మట్టి గాజులతో శ్రావణ మహాలక్ష్మిగా అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దమ్మపేట పరిసర గ్రామాల నుండి వచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ, రమణి దంపతులు గాయత్రీ దేవి అమ్మవారి వాయనము చీర, తాంబులము, గాజులు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఇచ్చి మీరు, మీ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆ జ్ఞానస్వరూపిణి మీ అందరికీ ఆయురారోగ్యాలను, సద్బుద్ధిని, ప్రశాంతతను ప్రసాదించాలని దీవించారు. ఈ సందర్భంగా ప్రేమ్ సుస్థిర గురూజీ మాట్లాడుతూ జ్ఞానానికి ప్రతీక అయిన గాయత్రీ దేవిని ఐశ్వర్య ప్రదాత అయిన మహాలక్ష్మి రూపంలో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయి అన్నారు. ప్రతీ పండుగకు ఆశ్రమము నందు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ సమాజ శ్రేయస్సుకు, పేదరిక నిర్మూలనకు మరియు మానవతా విలువలను పెంపొందించలని ఉద్దేశ్యంతో నేడు పంచాయతీ సిబ్బందిని ఆశ్రమంకు ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది అని, వారు నిరంతరం గ్రామ స్వచ్ఛతను పరిరక్షిస్తూ, పారిశుధ్య పనులను నిర్వహిస్తూ, మొక్కలను పెంచుతూ, ప్రజల వద్ద నుండి చెత్త సేకరిస్తూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బంది మెచ్చుకున్నారు.. ఈ సందర్భంగా ఆశ్రమంకు సహాయ సహకారాలు అందిస్తున్న సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను అభినందించారు. ఆశ్రమ సేవకులు, గాయత్రి పుత్రికలు పాల్గొన్నారు.

## గట్టుప్పల్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'చెరుకు దేవాన్స్ వర్షిత్'**

**గట్టుప్పల్, సెప్టెంబరు 4 (వుదయం):**

మండల కేంద్రంలో కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ప్రశాంత వాతావరణంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించిన అనంతరం, పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.ఈ వేడుకల్లో భాగంగా చిన్నారి చెరుకు దేవాన్స్ వర్షిత్ శ్రీ కృష్ణుడి వేషధారణలో అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాడు. పట్టు వస్త్రాలు, శిరస్సున నెమలి పింఛం, చేతిలో మురళీధారణతో బాల కృష్ణుడిలా ముస్తాబైన దేవాన్స్ వర్షిత్ చిరునవ్వులు, బుడిబుడి అడుగులు తిలకించిన వారిని మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం శివాలయం దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి ఉత్సవంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పై స్పందించండి..!

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్**

**కల్లూరు,సెప్టెంబర్ 4(వుదయం ప్రతినిధి)**



కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణను ప్రతి కార్యకర్త పాటిస్తూ, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమయి దయానంద్ అన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రజలు బాగుంటేనే పార్టీకి ప్రజల మద్దతు ఉంటుందని, ప్రజల ఆశీస్సులతోనే పార్టీ అధికారంలో కొనసాగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. ప్రజల సమస్యలను పట్టించుకుని, వారి సంక్షేమం కోసం పనిచేసే నాయకత్వానికే ప్రజల మద్దతు ఉంటుందని రాఘమయి దయానంద్ పేర్కొన్నారు.

## బుల్లెట్ రైలు దీక్షకు మద్దతు పలికిన ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు

**సూర్యాపేట, సెప్టెంబర్ 04: వుదయం ప్రతినిధి**



జాతీయ రహదారి 65కి సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట బతుకమ్మ చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు మద్దతు పలికారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1853లో రైల్వే ప్రవేశపెట్టారని, 1947 నాటికి దేశంలో 42 రైల్వే సంస్థలుగా అభివృద్ధి చెంది, 1951లో అన్నింటినీ కలుపుకొని భారతీయ రైల్వే ప్రపంచంలోనే అతిపెద్ద రైల్వే సంస్థలలో ఒకటిగా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు సూర్యాపేట జిల్లా ప్రాంతవాసులకు రైలు ప్రయాణం నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, జనగాం, వరంగల్ ప్రాంతాలకు వెళ్లి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వస్తోందని, జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం లేకపోవడం ఇక్కడి రాజకీయ నాయకుల వైఫల్యమేనని అన్నారు. రూట్ మ్యాప్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా, కొండమల్లేపల్లి, హాలియా, సాగర్ మీదుగా మార్చడం అన్యాయమని, దానిని రద్దు చేసి మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ ను హైదరాబాద్ – చౌటుప్పల్ – చిట్యాల – నార్కట్ పల్లి – నకిరేకల్ – సూర్యాపేట – కోదాడ మీదుగా విజయవాడ – చెన్నైకి నడపాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా సూర్యాపేట జిల్లా విద్యా, వైద్య, వ్యాపార, వాణిజ్య పరంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. సి.హెచ్. శ్యామ్ ప్రసాద్, ముల్లంగి జాకబ్ రాజు, జలగం జేమ్స్, చింత మనిషే, పి. మార్క్, కొండేటి లాజర్, వై. రూబెన్, పంది మార్క్, కొమ్ము హోసన్నా, మామిడి క్రిస్టోఫర్, పిట్టల సామేలు, రెంటాల విజయలక్ష్మి పాల్గొన్నారు.



## దేవాలయంలో పేదలకు అన్నదానం

**మధిర, సెప్టెంబర్ 4, వుదయం ప్రతినిధి:**

మధిర శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో ప్రతి శుక్రవారం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవ్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయంలో దాతల ఆర్థిక సహకారంతో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయడం జరుగుతుది.కోమటిడి శ్రీనివాసరావు,ధర్మపత్ని జ్యోతికృష్ణ,కోమటిడి రంగారావు,ధర్మపత్ని లక్ష్మి సీతమ్మ జ్ఞాపకార్ధం, మనవడు మనవరాలు సాయి భరత్, సాహితి, సాయి కిరణ్, చలువాదిశ్రీనివాసరావు, ధర్మపత్ని సరోజిని, చలువాది ప్రశాంత్, ధర్మపత్ని పెళ్లిరోజు సందర్భంగా,తాళ్లూరి సీత, కుమారుడు అమరేష్, వంశీకృష్ణ,రాయపాటి విజయలక్ష్మి రిటైర్డ్ టీచర్ అన్నదానమునకు ఆర్థిక సహకారం అందించారు.శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అన్నదాన కార్యక్రమంనకు ఆర్థిక సహకారంఅందించారు.అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దాతలు మాట్లాడుతూ అన్నిదానాలలో కెల్లా అన్నదానం మిన్న అని,అన్నం పరబ్రహ్మ స్వరూపమని ప్రతి ఒక్కరు పుట్టినరోజు,పెళ్లిరోజులసందర్భంగాపేదలకుఅన్నదానకార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నదాతలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా కనగాల

**రైతుల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం**

**అనంతగిరి సెప్టెంబర్ 04 వుదయం**



భద్రాద్రి కొత్తగూడెం భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జిగా తనను నియమించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నూతన ఇన్‌చార్జి కనగాల నారాయణ తెలిపారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రామచంద్రరావు అనుమతితో తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నరసయ్య, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.తనకు ఈ బాధ్యత దక్కడంలో ప్రోత్సాహం అందించిన మాజీ శాసనసభ్యుడు సంకినేని వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, తుటుపల్లి రవితో పాటు నియామకానికి సహకరించిన నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర నాయకులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమాలు అర్హులైన రైతులకు చేరేలా కృషి చేస్తానన్నారు.రైతులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి తరఫున బలంగా నిలబడి, కిసాన్ మోర్చా కార్యకర్తలతో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా రైతుల విశ్వాసాన్ని పొందుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను కేవలం పదవిగా కాకుండా రైతులకు సేవ చేసే గొప్ప అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, రైతు సోదరుల సహకారంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేసి, రైతుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న కాపుగల్లు సర్పంచ్ దొంతగాని అప్పారావు గౌడ్



**కోదాడ సెప్టెంబర్ 4(వుదయం)**

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని కాపుగల్లు గ్రామంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదాన్ని అందించారు. వేడుకల్లో గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకి సేవ, ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆయన భక్తులతో కలిసి పాల్గొన్నారు. స్వామివారి పల్లకిని భక్తులతో కలిసి మోసి, శ్రీకృష్ణుడి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ (ఎస్) పి.హెచ్.సి.లో సుఖప్రసవం.. మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

- వైద్యాధికారి డాక్టర్ రమ్య నేతృత్వంలో నార్మల్ డెలివరీ విజయవంతం
- డాక్టర్, సిబ్బందిపై ప్రశంసల వర్షం

**ఆత్మకూర్ (ఎస్), సెప్టెంబర్ 04:**



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) సాధారణ ప్రసవాలకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. ఈరోజు పి.హెచ్.సి.లో వైద్యాధికారి డాక్టర్ రమ్య నేతృత్వంలో ఒక మహిళకు సురక్షితంగా నార్మల్ డెలివరీ నిర్వహించారు. ఆ మహిళ ఆరోగ్యవంతమైన మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన సేవలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నార్మల్ డెలివరీలపై అవగాహన: డాక్టర్ రమ్య మరియు సిబ్బంది గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు. సిజేరియన్లకు స్వస్తి: శస్త్ర చికిత్సల (సిజేరియన్) జోలికి వెళ్లకుండా, సహజ ప్రసవాలు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుండటంతో స్థానిక ప్రజలు పి.హెచ్.సి.లోనే డెలివరీలు చేయించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆప్యాయమైన వైద్య సేవలు అందిస్తూ, కాన్పులను విజయవంతం చేస్తున్న డాక్టర్ రమ్యని మరియు ఆసుపత్రి సిబ్బందిని ఆత్మకూర్ (ఎస్) ప్రజలు, రోగుల బంధువులు కొనియాడుతున్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ మానస, ఓపీ ఏఎన్ఎం మహబూబా, ఆత్మకూర్ ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్ మాధవి, సీహెచ్ వో యాదగిరి, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ లో సీటు సాధించిన పూజితకు అభినందనలు తెలియజేసిన సిఐ రమేష్

**మధిర, సెప్టెంబర్ 4, వుదయం, ప్రతినిధి:**



మధిర టౌన్ పోలీస్ స్టేషన్ నందు కార్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న మడుపల్లి వాసి పి మురళి పెద్ద కుమార్తె సిద్దిపేట మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ నందు సీటు సాధించిన సందర్భంగా మధిర టౌన్ సిఐ రమేష్, ఎస్సై కిషోర్ అభినందనలు తెలియజేశారు. కృషి పట్టుదలతో అతి సామాన్య కుటుంబం నుండి ఎంబిబిఎస్ నందు సీటు సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మునుముందు కూడా అనేక విజయాలు సాధించి ఉన్నత స్థాయిలో ఉండి కన్నవారికి ఉన్న ఊరికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చర్లలో బీఆర్ఎస్ వంటావార్పు



**చర్ల, సెప్టెంబర్ 3:(వుదయం ప్రతినిధి)**

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు చర్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్ల బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో చర్ల పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి భద్రాచలం బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధానాలను వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చర్ల బీఆర్ఎస్ కో–కన్వీనర్ అయిన వోలు పవన్‌కుమార్, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, కొంబత్తిన రాము, గోరింట్ల వెంకటేశ్వరరావు, అంబోజి సతీష్, తడికల బుల్లెబ్బాయి, కుప్పాల నిరంజన్, కుప్పాల సౌజన్య, పాసిగంటి సంతోష్, దుబ్బ సమ్మయ్య, తడికల చంద్రశేఖర్, కట్టం కన్నారావు, గాధంశెట్టి కిషోర్, కుక్కడపు సాయి, పాసిగంటి సంధ్య, మచ్చ రాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా సర్పంచులు పెద్దముసిలేరు సర్పంచ్ బెండబోయిన సుహాసిని, ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, కుదునూరు సర్పంచ్ కుంజా కమలతో పాటు పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




"జీఎస్ఎల్‌వీఎఫ్17 వాహకనౌక ద్వారా అడ్వాన్స్‌డ్ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ 05 ఉపగ్రహాన్ని విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశ పెట్టాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శ్రీహరికోట నుంచి ఇది రెండో విజయవంతమైన మిషన్. మొదటిది స్కైరూట్ స్టార్టప్ ప్రయోగం కాగా.. ఇస్రోకు ఈ ఆర్థిక సంవత్సరానికి ఇదే తొలి ప్రయోగం. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పని చేయడంతో ఈ ప్రయోగం సంపూర్ణ విజయం సాధించింది. ఈ ఏడాది కమ్యూనికేషన్ ఉపగ్రహాలతో పాటు, గగన్‌యాన్‌కు సంబంధించిన రెండు మానవరహిత ప్రయోగాలు కలుపుకొని మొత్తం ఆరు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం."

**- నారాయణన్, ఇస్రో ఛైర్మన్**

## వేమన పద్యం

**అల్పజాతి వాని కధికార మిచ్చిన**
**దొడ్డవారినెల్ల తొలగగొట్టు**
**చెప్పు తినెడు కుక్క చెరకు తీపెరుగునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ**



# సంపాదకీయం

## రేవంత్.. వెయ్యి రోజుల పాలన...

సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో కొలువుదీరి వెయ్యి రోజులు పూర్తయింది. ఐదేండ్ల కాలానికి మొత్తం 1825 రోజుల్లో వెయ్యి రోజులు పూర్తయినా, ఇంకా 825 రోజులు మిగిలే ఉన్నాయి కదా...? అని అధికార పార్టీ నేతలు తమను తాము సంతృప్తి పరుచుకునే ప్రయత్నం చేసినా, ప్రజలిచ్చిన గడువులో సింహభాగం పూర్తయిందని చెప్పక తప్పదు. ఈ వెయ్యి రోజులపాలనలో ప్రభుత్వ పనితీరు, విధానాలు, చేపడుతున్న చర్యలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితరాంశాలను బేరీజు వేసుకుంటే... కొంత తీపి, కొంత చేదు (కట్టా.. మీటా...) అని వ్యాఖ్యానించాల్సి వస్తోంది. గత బీఆర్ ఎస్ హయాంలో కేవలం సింగిల్ పవర్ సెంటర్ గా కథ నడిస్తే... ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కొంత వెసులుబాటుతో మల్టీ పవర్ సెంటర్ గా పరిస్థితి కొనసాగుతోంది. అప్పట్లో ఆ ముగ్గురు చెప్పిందే వేదమైతే.. ఇప్పుడు దానికి భిన్నంగా మంత్రులు ఎవరికి వారే నిర్ణయాలు తీసుకోవటం కనబడుతోంది. ఇటు పార్టీలోనూ, అటు ప్రభుత్వంలోనూ అమాత్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు స్వతంత్రంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న తీరును మనం గమనించొచ్చు. మరోవైపు భారత్ ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, హిల్ట్ పాలసీ, ఫార్మాసిటీ, మూసీ ప్రక్షాళన తదితర దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకుని ముందుకుపోతున్న రేవంత్ సర్కార్... ఆరు గ్యారెంటీల అమలుకు మాత్రం కిలోమీటర్ల దూరంలో ఉండటం గమనార్హం.

తమది ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వాధినేతలు వెయ్యి రోజుల పాలన తర్వాత ఆత్మ విమర్శ, ఆత్మావలోకనం చేసుకోవాల్సి ఉంది. ఐపీఎస్‌లు ఒక పోస్టులో పూర్తిగా కుదురుకోకముందే వారిని పదే పదే ఒకశాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేయటం పలు విమర్శలకు తావిస్తోంది. ఇది అవగాహనా లేమికి, పాలనపై పరిపక్వత లేమిని సూచిస్తోంది. దీంతో శాఖలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూడా కుంటుపడుతున్నదుస్థితి. గత బీఆర్ ఎస్ హయాంలో అవినీతిపరులు, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ పలువురు ఐఏఎస్‌లపై దుమ్మెత్తిపోసిన సంగతి మనకెరుకే. కానీ ఇప్పుడు అదే ఉన్నతాధికారులే ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుండటం గమనార్హం. ఇది పరస్పర విరుద్ధమైన వైఖరికి నిదర్శనం.

కాగా గత ప్రభుత్వ అప్పులు, వాటి వడ్డీలు, తలెత్తిన తిప్పల నుంచి సర్కారు అనేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించటం ముదావహం. వివిధ శాఖల్లో లీకేజీలను అరికట్టటం, డబుల్ ఉద్యోగాలను అనుభవిస్తున్న వారిని తీసేయటం, ఒకటో తారీఖున్నే ఉద్యోగులకు జీతాలెయ్యటం తదితర చర్యలను మనం ఆహ్వానించాల్సిందే వీటి అమల్లో కొన్ని లోపాలు, లొసుగులున్నా వాటి అమలు పట్ల హర్షం వ్యక్తం చేయాల్సిందే. లోపాలను సవరించాలి, అందరికీ వాటిని అమలు చేయాలని డిమాండ్ చేయాల్సిందే.

అదే సమయంలో అట్టడుగునున్న పేదలు, మహిళలను ఆదుకోవటంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైంది. మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం నెలకు రూ.2,500 సాయం, ఆటోవాలాల ఉపాధి రక్షణ కోసం నెలకు రూ.వెయ్యి భృతి, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తామంటూ హస్తం పార్టీ తన మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఆర్భాటమైన ఈ ప్రకటనలన్నీ ఎప్పుడో అటకెక్కాయి. దీంతో ఆయా తరగతుల నుంచి ప్రభుత్వం వ్యతిరేకతను మూటగట్టుకుంటోందనే సంకేతాలు బలంగా వినబడుతున్నాయి. వీటితోపాటు రైతు భరోసా డబ్బులు సకాలంలో వేయకపోవటంతో రైతులు ఇక్కట్లపాలవుతున్నారు. ఆసరా, చేయూత పింఛన్ల పెంపు కోసం అర్హులైన లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వీటి సంగతేంటని జనం నిలదీయకముందే సర్కారు మేల్కొనాలి.

ఇక తమ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందంటూ చెప్పుకుంటున్న వారు... ఎందుకో తెలియదుగానీ, ఈ మధ్యకాలంలో దానికి కొంత భిన్నంగా వ్యవహరించటం శోచనీయం. విద్యార్థి, ప్రజా, కార్మిక సంఘాల ఆందోళనలను అడ్డుకోవటం, అరెస్టులు చేయటం ప్రజా పాలన అనిపించుకోదు గదా...? దీంతోపాటు పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా ఉండి, అతి పెద్ద పార్టీగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్.


.రాష్ట్రంలో ఏలుబడిలో ఉన్నప్పుడు, దాని స్థాయి, బలానికి తగ్గట్టే కేంద్రంపై పోరాడాలి. నిధుల కోసం కొట్లాడాలి. తెలంగాణ హక్కుల కోసం మోడీ సర్కారును నిలేయాలి. కానీ అవి మచ్చుకైనా కానరాకపోవటం అత్యంత విస్మయకరం. సాక్షాత్తూ సీఎం వద్దే హోం, విద్య, మున్సిపల్ లాంటి కీలకశాఖలున్నా వాటిపై పర్యవేక్షణ, సమీక్షలు అంతం తమాత్రంగానే ఉండటం గమనార్హం. ఇటీవల ఆదివాసీ యువతి శిరీషపై అఘాయిత్యం జరిగినా, ముఖ్యమంత్రి స్పందించకపోవటం అత్యంత విచారకరం. రేవంత్ సర్కార్ వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న క్రమంలో ఇలాంటి బలహీనతలు, లోపాలను సరిచేసుకుని, ముందుకు సాగుతుందని, ప్రజారంజకమైన పరిపాలనను అందిస్తుందని ఆశిద్దాం. లేదంటే ఊపర్ షేర్వాణీ.. అందర్ పరేషానీ... అనే సామెతను గుర్తు చేసుకోవాల్సి వస్తుంది.

**రచనలు పంపండి**

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# జ్ఞాన జ్యోతి వెలిగించే దీప స్తంభాలు

భారత దేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఈ సంప్రదాయం వెనుక ఉన్న మూలకారణం విశిష్ట తాత్వికుడు, గొప్ప విద్యావేత్త, భారతరత్న గ్రహీత, భారత దేశ రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం. ఆయన ఒకసారి "నా పుట్టినరోజు ప్రత్యేకంగా జరపాల్సిన అవసరం లేదు. కానీ నా సేవలను గౌరవించాలనుకుంటే ఆ రోజు దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోండి" అని అన్న సందర్భం నుండి ఈ దినోత్సవానికి శ్రీకారం చుట్ట బడింది. అప్పటి నుండి ప్రతి ఏడాది కోట్లాది మంది విద్యార్థులు తమ గురువులను సత్కరిస్తూ కృతజ్ఞతా నివాళి అర్పించడం ఆనవాయితీగా మారింది. భారతీయ సంప్రదాయంలో ఉపాధ్యాయుని స్థానం అత్యున్నతమైనది. తల్లిదండ్రులు మనకు జీవనాన్ని ఇస్తే ఉపాధ్యాయులు ఆ జీవనానికి జ్ఞానం, దిశా నిర్దేశం అందిస్తారు. శిష్యుడి ఆలోచన విధానాన్ని తీర్చిదిద్దడమే కాకుండా నీతి, నైతికతలు, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని బోధించడం ఉపాధ్యాయుని గొప్ప కర్తవ్యంగా భావించబడింది. అందుకే పురాణాలలో, శాస్త్రాలలో "గురు బ్రహ్మః, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః" అని ఉపాధ్యాయుని స్థాయిని దైవస్థాయిలో ఉంచారు. భారతీయ చరిత్రలో అనేక మంది గురువులు సమాజానికి దిశా నిర్దేశకులుగా నిలిచారు. చాణక్య చంద్రగుప్తుని సామ్రాజ్య నిర్మాతగా తీర్చిదిద్దాడు. ఆదిశంకరాచార్యులు భారతీయ ఆధ్యాత్మికతను పునరుద్ధరించారు. ఆధునిక యుగంలో జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే




విద్యా హక్కుల కోసం, ముఖ్యంగా స్త్రీలకు విద్యను అందించేందుకు పోరాడారు. స్వాతంత్ర్యం తర్వాత తొలి విద్యా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా విధానానికి బలమైన పునాదులు వేశారు. ఈ తరహా మహనీయుల కృషి ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని మరింత పెంచింది.

ఈ రోజుల్లో భారతదేశంలో సుమారు 47 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రతి సంవత్సరం వారి కృషిని గుర్తించి రాష్ట్రపతి చేత జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేస్తారు. 1962 నుండి ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. 2024లోనే 130 మంది ఉపాధ్యాయులు ఈ గౌరవాన్ని అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండీ ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఒక విశిష్ట ఘట్టం. ఈ అవార్డులు ఉపాధ్యాయుల సమర్పణకు, శ్రమకు సామాజిక గుర్తింపును కల్పిస్తున్నాయి.

అయితే నేటి యుగంలో ఉపాధ్యాయ వృత్తి సవాళ్లతో నిండినదే. సాంకేతిక పరిణామం వలన విద్యార్థులకు అపారమైన సమాచారం అందుబాటులోకి వచ్చింది. కానీ ఆ సమాచారాన్ని సరైన జ్ఞానంగా మార్చి, ఉపయోగకర దిశలో వినియోగించడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. తల్లిదండ్రులు, సమాజం నుంచి విద్యార్థులపై అధిక మార్కులు, ర్యాంకుల కోసం ఒత్తిడి పెరుగుతున్న క్రమంలో ఉపాధ్యాయులు కేవలం బోధకులే కాకుండా మానసిక బలాన్ని అందించే మార్గదర్శకులుగా మారాల్సిన పరిస్థితి నెలకొంది.

గ్రామీణ ప్రాంతాల్లో వనరుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కారణంగా అక్కడి ఉపాధ్యాయులు అనేక పాత్రలు పోషిస్తూ విద్యా యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రవేశంతో పాఠ్య పద్ధతుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థి కేంద్రిత బోధన, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మక ఆలోచనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం వచ్చింది. ఈ కొత్త విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు సరికొత్త శిక్షణలు పొందుతూ, సాంకేతిక వనరులు వినియోగిస్తూ ముందుకు సాగుతున్నారు.



విద్యావేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఒకసారి "ఒక గొప్ప ఉపాధ్యాయుడు దేశ భవిష్యత్తును నిర్మించ గలడు. విద్యార్థి మనసులో మంట వెలిగించగల శక్తి గురువుకే ఉంటుంది" అన్నారు. మహాత్మా గాంధీ "విద్య అనేది మనిషి శరీర, మానసిక, ఆత్మిక పరిమాణాల సమగ్ర అభివృద్ధి" అని చెప్పిన మాట ఉపాధ్యాయుని పాత్రను మరింత స్పష్టంగా తెలియజేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు తమ గురువులను సత్కరించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఒక సంప్రదాయంగా మారింది. విద్యార్థులు ఒక రోజు పాటు ఉపాధ్యాయుల పాత్రను పోషించడం ద్వారా గౌరవాన్ని వ్యక్తపరుస్తారు. ఇది గురువుల పట్ల కృతజ్ఞతా భావాన్ని మాత్రమే కాక, ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని గుర్తు చేస్తుంది. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, కృత్రిమ మేధస్సు ఎంత విస్తరించినా ఉపాధ్యాయుని స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయలేరు. యంత్రాలు సమాచారం అందించగలవు కానీ ఆ సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవడం నేర్పేది మాత్రం ఉపాధ్యాయుడే. అందువల్ల ఉపాధ్యాయ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు. ఇది సమాజాన్ని జ్ఞానవంతం చేసి, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల మహోన్నత సేవలకు సమాజం తరఫున అర్పించే కృతజ్ఞతా నివాళి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

## సెప్టెంబరు ఒకటి -అదో చీకటి అధ్యాయం

దశాబ్దాల పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న పెన్షన్ హక్కును ఒక్క నిర్ణయంతో హరించి, వారి వృద్ధాప్య భద్రతను మార్కెట్ ఒడిదుడుకులకు అప్పగించిన రోజుగా సెప్టెంబర్ 1 ప్రభుత్వ ఉద్యోగుల చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. జీవితంలో అత్యంత విలువైన కాలాన్ని ప్రభుత్వ సేవకు అంకితం చేసిన ఉద్యోగికి, ఉద్యోగ విరమణ తర్వాత గౌరవంగా, ఆత్మగౌరవంతో జీవించే భరోసా కల్పించాల్సిన ప్రభుత్వమే ఆ బాధ్యత నుంచి తప్పుకోవడం ఎంతవరకు సమంజసం? ఉద్యోగంలో ఉన్నంతకాలం దేశానికి, ప్రజలకు సేవ చేసిన ఉద్యోగి తన మిగిలిన జీవితాన్ని మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి గడపాల్సిందేనా? అందుకే సెప్టెంబర్ 1 కేవలం క్యాలెండర్‌లోని మరో తేదీ కాదు.. ఉద్యోగి హక్కును, అతని భవిష్యత్తును, అతని కుటుంబ భద్రతను ప్రశ్నించే రోజు. పెన్షన్ హక్కు కోసం మరోసారి పోరాటానికి పిలుపునిచ్చే రోజు.

2004లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్/ఎన్‌పీఎస్) అమల్లోకి వచ్చినప్పుడు దేశంలో ఈ విధానంలో ఉన్న ఉద్యోగుల సంఖ్య చాలా తక్కువ. కానీ ప్రతి ఏడాది ప్రభుత్వాలు కొత్త నియామకాలు చేపట్టడంతో సీపీఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఇదే విధానం కొనసాగింది. ప్రస్తుతం రాష్ట్రంలో సీపీఎస్/ఎన్‌పీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగుల సంఖ్య దాదాపు మూడు లక్షలకు చేరువైంది. ఇదే పరిస్థితి కొనసాగితే 2035 తర్వాత ప్రభుత్వ సర్వీసులో కొనసాగుతున్న ఉద్యోగుల్లో పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పరిధిలో ఉన్న వారి సంఖ్య వందల్లోకి పడిపోయే ప్రమాదం ఉంది. అంటే ఇది కేవలం నేటి ఉద్యోగుల సమస్య కాదు. రేపటి తరాల ప్రభుత్వ ఉద్యోగుల సామాజిక




భద్రతకు సంబంధించిన కీలకమైన సమస్య.

ప్రభుత్వ ఉద్యోగి తన యవ్వనాన్ని, శ్రమను, ప్రతిభను ప్రభుత్వ సేవకు అంకితం చేస్తాడు. ఉద్యోగ విరమణ అనంతరం గౌరవంగా జీవించడానికి ప్రభుత్వం అందించే పెన్షన్ అతనికి చేసే దానం కాదు. అది అతని దీర్ఘకాలిక సేవకు సంబంధించిన సామాజిక భద్రత. ఓపీఎస్‌లో ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనంతరం నిర్దిష్టమైన పెన్షన్ లభిస్తుంది. కానీ సీపీఎస్/ఎన్‌పీఎస్‌లో ఉద్యోగి భవిష్యత్తు మార్కెట్ పరిస్థితులు, పెట్టుబడుల రాబడి, ఫండ్ పనితీరుపై ఆధారపడి ఉంటుంది. ఉద్యోగం చేస్తున్నప్పుడు ఉద్యోగి భద్రత ప్రభుత్వ బాధ్యత అయితే, ఉద్యోగ విరమణ తర్వాత అతని జీవిత భద్రత కూడా ప్రభుత్వ బాధ్యత కాదా? ఈ ప్రశ్నకు పాలకులు సమాధానం చెప్పాలి.

సీపీఎస్ విషయంలో దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల వైఖరిని కూడా ఉద్యోగులు ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. 2004లో కేంద్ర ప్రభుత్వ కొత్త ఉద్యోగులకు ఎన్‌పీఎస్ అమల్లోకి వచ్చిన తర్వాత, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ఉద్యోగుల డిమాండ్లు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్రంలో వివిధ ప్రభుత్వాల హయాంలో పెన్షన్ విధానంలో మార్పులపై చర్చలు, నిర్ణయాలు జరిగాయి. రాష్ట్రాలు తమ ఉద్యోగుల పెన్షన్ విధానంపై నిర్ణయాలు తీసుకునే సమయంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి, రుణ పరిమితులు, భవిష్యత్ పెన్షన్ బాధ్యతలు వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు ఆర్థిక భారాన్ని పరిగణనలోకి తీసుకుంటూనే ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ఓపీఎస్‌ను తిరిగి అమలు చేశాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు పెన్షన్‌పై తమ విధానాన్ని స్పష్టంగా ప్రకటించడంతో పాటు, ఉద్యోగుల పెన్షన్ భద్రతను కాపాడుతూ ప్రభుత్వాలపై పడే దీర్ఘకాలిక ఆర్థిక భారాన్ని ఎలా నిర్వహిస్తాయో కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

# దాతృత్వానికి పర్యాయపదం మదర్ థెరిసా

అమ్మ అంటే త్యాగం. అమ్మ అంటే నమ్మకం. అమ్మ అంటే కరుణ. అమ్మ అంటే అనంతమైన ప్రేమ. కన్న తల్లి బిడ్డల కడుపు చూస్తుంది. అమ్మ చేతి స్పర్శ విశ్వాసాన్ని కూర్చే ఔషధం. ప్రేగు బంధం పెనవేసుకున్న అమ్మకు మించిన దైవం లేదు. అమ్మ హస్తం అమృత తుల్యం. కన్న తల్లి ప్రేమను కురిపించడం సర్వసాధారణం. అమ్మ కాని అమ్మలు కూడా తల్లిని మరిపించి, సకల సపర్యలు చేస్తే అదో అద్భుతం, కనివిని ఎరుగని విశేషం. అవసరార్థులు, ఆకలితో అలమటించే అభాగ్యులు, తీవ్ర రోగాల బారిన పడి జీవచ్ఛవంలా బతుకులను ఈడుస్తున్న కడు పేదలకు తానే కన్న తల్లిగా మారి, సకల సపర్యలు చేసి, వారి ముఖాల్లో చిరునవ్వులు చూడగలగడం ఆమెకే సొంతం. ఆమె జీవితం అవసరార్థులకే అంకితం. ఆమె ఓ ప్రపంచ శాంతిదూత, ఓ ఆపన్నహస్తం, స్వచ్ఛంద నేస్తం. ఆమె ఎవరో కాదు పేరులోనే తల్లిని ఇముడ్చుకున్న మహోన్నత మహిళ, మదర్ థెరిస్సా.

**అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం:**

అసాధారణ, అత్యుత్తమ శ్రేణి మహిళ మదర్ థెరిసా పేద బడుగు బలహీన వర్గాల శ్రేయస్సుకు పాటుపడిన కారణంగా ప్రపంచ దాతృత్వ గుణానికి ప్రతీకగా నిలిచిన నొబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా 2012 నుంచి ప్రతి ఏట 05 సెప్టెంబర్ రోజున "అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ చారిటీ)" పాటించాలని ఐరాస నిర్ణయించడం ముదావహం. సామాజిక బాధ్యతను తట్టి లేపడం, దాతృత్వ చర్యలకు ప్రేరణనివ్వడంతో పాటు మానవాళి ఎదుర్కొంటున్న పేదరికం, ఆకలి చావులు, విద్య, సంక్షేమం లాంటి సమస్యల పట్ల పౌర సమాజాన్ని జాగృత పరచడం లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న సేవలు కూడా పెద్ద మార్పుకు నాంది పలుకుతాయని కూడా ప్రచారం చేయడం జరుగుతుంది. పేదరిక నిర్మూలన, పీడిత జనాల రక్షణ, ఆకలి కేకలకు అన్నం ముద్ద అందించడం, గాయపడిన గుండెలకు సాంత్వన కూర్చడం, సహానుభూతితో సమస్యలకు పరిష్కారం చూపడం లాంటి లక్ష్యంతో మదర్ థెరిసా తన జీవితాన్ని ఆసాంతం అవసర ప్రజా సేవకు అంకితం చేసారు. మదర్ థెరిసా జీవితం దాతృత్వ ఔదార్య స్ఫూర్తిని రగిలించడం జరుగుతోంది. అంతర్జాత దాతృత్వ దినం వేదికగా చర్చించే అంశాల్లో పేదరిక నిర్మూలనలో ప్రపంచ సంఘీభావం, సమానత్వ సమ్మిళిత అభివృద్ధి, టెక్నాలజీ ఆధారిత దాతృత్వం, వాతావరణ మార్పుల కట్టడి, నైతిక విలువల పరిరక్షణ లాంటివి తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. మానవీయ సేవలకు ప్రతిరూపం మదర్ థెరిసా: 26 ఆగస్టు 1910 పుణ్య గడియల్లో స్కోప్జీ, మర్సిడోనియాలో జన్మించిన మదర్ థెరిస్సా అసలు పేరు "అగ్నెస్ గోంక్స్‌హ బొజాక్సిహివు". ఆమె 27 ఆగస్టు రోజున బాప్టిజమ్ స్వీకరించడం జరిగింది. చిన్నారి చిన్నతనంలా నుంచే మిషనరీల్లో సేవలు చేయడం ప్రారంభించింది. అవసరార్థులు, అనాధలు, దీర్ఘకాలిక రోగులకు సేవలు చేయడానికి 1928లో ఇంటిని వదిలి 'సిస్టర్స్ ఆఫ్ లొరెటో'లో చేరి ఇండియాలో సేవలు అందించడానికి అంకితం అయి పోయింది. నన్స్ విభాగంలో శిక్షణ అనంతరం కలకత్తాలోని పాఠశాలలో టీచర్‌గా 1931 నుంచి 1948 వరకు సేవలు అందించింది. ఈ కాలంలో పేదరికాన్ని చూసి చలించిపోయి, శాశ్వతంగా సేవామార్గాన్ని నిర్ణయించుకుంది. 1950లో "మిషనరీస్ ఆఫ్ చారిటీ, కలకత్తా"ను ఏర్పాటు చేసి ఒక సమూహాన్ని ఏర్పరచుకొని మురికి వాడల్లో మగ్గుతున్న కడు పేదలకు స్వచ్ఛందంగా సేవలు చేయడం, విద్య బోధించడం, ఆకలి తీర్చడం, రోగులకు ఉపశమన సేవలు చేయడం ప్రారంభించింది. తను నిర్మించిన మిషనరీ సామ్రాజ్యం 130కి పైగా దేశాలకు విస్తరించి లక్షలాది సేవకులకు కేంద్రంగా మారింది. ఇండ్లు లేని వీధి బాలలకు తానే అమ్మగా మారి సకల సపర్యలు చేసి, మానవతకు నిలువెత్తు రూపంగా నిలిచింది. మదర్ అమూల్య సేవలకు ప్రతిగా ప్రపంచ పౌర సమాజం పలు పురస్కారాలు ఆమెను వరించాయి. వాటిలో ప్రధానమైనవిగా భారత ప్రభుత్వ పద్మశ్రీ, జాన్ పోప్ శాంతి బహుమతి, కెన్నెడీ అవార్డు, జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ పురస్కారం, యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్, నోబెల్ శాంతి బహుమతి, భారత రత్న, ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, అమెరికా గౌరవ పౌరసత్వం, కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ లాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఉన్నాయి. ఐదు భాషల్లో అనర్గళంగా మాట్లాడగల మదర్ థెరిసా 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకొని 2015లో పోప్ ఫ్రాన్సిస్ చేత "సేయింట్ థెరిసా ఆఫ్ కలకత్తా"గా గుర్తించబడింది. 05 సెప్టెంబర్ 1997 రోజున అమరత్వం పొందింది మథర్ థెరిసా. ఆమె వర్ధంతిని "అంతర్జాతీయ చారిటీ దినం"గా పాటించడం జరుగుతున్నది. పలు దేశాల్లో థెరిసా పేరున సంస్థలు, వీధులు, యూనివర్సిటీ, కాలేజీలు, పాఠశాలలు కూడా నెలకొల్పడం జరిగింది. మానవీయ సేవలకు తన జీవితాన్ని అంకితం చేయడమే కాకుండా లక్షల మంది సేవకుల దళాలను ఏర్పాటు చేసి అమూల్య సేవలను నిరు పేదలకు అందించి, నేటి తరానికి దారి దీపంగా నిలుస్తున్నారు.





మధుసూదన్ రెడ్డి
9949700037

# వాళ్ల బతుకుల్లో మార్పు ఎప్పుడు...?

తెలంగాణ ఏర్పడి పదమూడేండ్లు గడిచినా రజకుల బతుకుల్లో మాత్రం మార్పు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. రాష్ట్ర జనాభాలో 2.8 శాతం, బీసీ జనాభాలో సుమారు ఐదు శాతం ఉన్న ఈ వర్గంలో 75 శాతానికి పైగా ఇప్పటికీ సంప్రదాయ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ సర్వేల్లో అత్యంత వెనుకబడిన వర్గంగా గుర్తించినప్పటికీ, బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతలో మాత్రం తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. ఎన్నికల హామీలు అమలుకాకపోవడం, వృత్తి స్థలాలు కబ్జాలకు గురవడం, విద్యుత్ సబ్సిడీ బకాయిలు పేరుకుపోవడం ఈ వర్గం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు పది లక్షల మంది రజకులు ఉన్నారు. వీరిలో అత్యధికులు బట్టలు ఉతకడం, ఇస్త్రీ, డ్రైక్లీనింగ్, లాండ్రీ వంటి వృత్తులపైనే ఆధారపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శుభ, శుభకార్యాలు, గ్రామ దేవతల పండుగలు, బోనాలు, దేవాలయాలకు సున్నాలు వేయడం వంటి సంప్రదాయ సేవలను కూడా రజకులే నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లో వారికి గతంలో జీవనాధారంగా ఉన్న ఇనాం, మాన్య భూములు అన్యాక్రాంతం కావడం, చాకిరేవు, దోబీఘాట్ స్థలాలు కబ్జాలకు గురికావడం వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వృత్తి గ్రామాల నుంచి పట్టణాలకు విస్తరిస్తున్నప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి, మౌలిక వసతులు లేక రజక వృత్తిదారులు పోటీని ఎదుర్కోలేకపోతున్నారు.

33 జిల్లాల్లో సుమారు 4,300 రజక సహకార సంఘాలుండగా, సుమారు 500 దోబీఘాట్లు, మెకనైజ్డ్ లాండ్రీలు, రెండు లక్షలకు పైగా ఇస్త్రీ షాపులు ఉన్నాయి. 74 వేల మందికి ఉచిత విద్యుత్ పథకం అమలవుతున్న ప్పటికీ గత మూడేండ్లకు సంబంధించిన సుమారు రూ.370 కోట్ల సబ్సిడీ బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వృత్తిదారులపై రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఈ విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. సబ్సిడీ బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. 2026 27లో రూ.3 లక్షల కోట్లకు పైగా రాష్ట్ర బడ్జెట్ ఉన్నప్పటికీ రజకుల సంక్షేమానికి కేవలం రూ.200 కోట్లు కేటాయించడం వారి జనాభా, వెనుకబాటుతనంతో పోలిస్తే సరిపోదు. మరోవైపు ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో ఆధునిక లాండ్రీల ఏర్పాటుకు రూ.10 లక్షలు, ప్రతి జిల్లాకు దోబీఘాట్ల ఆధునికీకరణకు రూ.10 కోట్లు అమలే కాలేదు. అలాగే లాండ్రీ షాపులకు స్థలాలు, వృత్తిదారులకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, ఎంబీసీ సంక్షేమ మంత్రిత్వ శాఖ, 42 శాతం బీసీ రిజర్వేషన్లు వంటి హామీలు ఇంకా పూర్తి స్థాయిలో అమలుకు నోచు కోలేదు. ఇక రజకులపై సామాజిక దాడులు, సాంఘిక బహిష్కరణలు, కుల వివక్ష, మహిళలు, బాలికలపై దాడులు కొనసాగుతుండటం మరింత ఆందోళనకరం. తెలంగాణలో కుల వివక్షను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం అవసరం. ప్రభుత్వం ఇప్పటికే జారీ చేసిన 102, 9, 18, 19, 116, 178, 27, 343 జీవోలను అమలు చేయాలి. ప్రతి జిల్లాలో రజక సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయాలి. సాంఘిక బహిష్కరణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.



రజకుల పరిస్థితిలో మార్పు రావాలంటే కేవలం హామీలు, బడ్జెట్ ప్రకటనలు సరిపోవు. కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేసి, 202526, 202627 బడ్జెట్లలోని రూ.375 కోట్లను వినియోగించాలి. ఆధునిక మెకనైజ్డ్ దోబీఘాట్లు నిర్మించి, 141 మున్సిపాలిటీల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించాలి. లాండ్రీ షాపులకు గ్రామ, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో స్థలాలు కేటాయించాలి.

కబ్జాకు గురైన దోబీఘాట్ స్థలాలను స్వాధీనం చేసుకుని రక్షణ గోడలు, ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసి రజక సొసైటీలకు పట్టాలివ్వాలి. కొత్త రజక సహకార సంఘాల ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చి, సభ్యులకు షేర్ సర్టిఫికెట్లు అందించాలి. వృత్తిదారులకు గీత, చేనేత కార్మికుల తరహాలో పెన్షన్ సౌకర్యం కల్పించాలి. పేద రజక కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యం ఇవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల దుస్తుల శుభ్రతకు రజక వృత్తిదారులను నియమించడం ద్వారా వారికి స్థిరమైన ఉపాధి కల్పించాలి.

ప్రభుత్వ సంస్థల వృత్తి కాంట్రాక్టులను జీవో 102 ప్రకారం రజక సొసైటీలకే ఇవ్వాలి.

రజకుల ఆత్మగౌరవ భవనానికి స్థలం కాపాడి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం ద్వారా ఆమె పోరాట స్ఫూర్తికి తగిన గౌరవం ఇవ్వాలి. రజకుల సమస్యను ఒక కుల వృత్తి సమస్యగా కాకుండా ఉపాధి, సామాజిక భద్రత, ఆత్మగౌరవం, హక్కుల సమస్యగా ప్రభుత్వం చూడాలి. బడ్జెట్ కేటాయింపులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా పర్యవేక్షణ ఉండాలి. వృత్తిని ఆధునీకరించడంతోపాటు రజక యువతకు శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. మహిళా వృత్తిదారులకు ప్రత్యేక ఆర్థిక, సామాజిక భద్రతా కార్యక్రమాలు చేపట్టాలి. అప్పుడే రాష్ట్ర ప్రగతిలో రజకులకు కూడా సమాన భాగస్వామ్యం లభిస్తుంది.

> గ్రామీణ ప్రాంతాల్లో శుభ, శుభకార్యాలు, గ్రామ దేవతల పండుగలు, బోనాలు, దేవాలయాలకు సున్నాలు వేయడం వంటి సంప్రదాయ సేవలను కూడా రజకులే నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లో వారికి గతంలో జీవనాధారంగా ఉన్న ఇనాం, మాన్య భూములు అన్యాక్రాంతం కావడం, చాకిరేవు, దోబీఘాట్ స్థలాలు కబ్జాలకు గురికావడం వారి ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వృత్తి గ్రామాల నుంచి పట్టణాలకు విస్తరిస్తున్నప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడి, మౌలిక వసతులు లేక రజక వృత్తిదారులు పోటీని ఎదుర్కోలేకపోతున్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## 195 సరస్సులు అత్యంత ప్రమాదకరం

- సిక్కింలోనే 25 హైరిస్క్ లేక్ లు
- గంగా పరివాహక ప్రాంతంలో 4,700
- హిమాలయాల్లో 7,500 హిమానీనద సరస్సులు
- ఇవి బద్దలైతే భారత్‌లో జలప్రళయమే!

**న్యూఢిల్లీ :**

నేపాల్ లో ఇటీవల సంభవించిన హిమానీనద విపత్తు భారత్ కు మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. హిమాలయ పర్వతాల్లోని మంచు సరస్సులు బద్దలైతే ఎంతటి విధ్వంసం సంభవిస్తుందో నేపాల్ ఘటన స్పష్టం చేస్తోంది. అదే సమయంలో భారత్లో కూడా వందల సంఖ్యలో ప్రమాదకర హిమానీనద సరస్సులు ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. దీంతో వాటిపై నిరంతర నిఘా, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ సర్వే ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలో దాదాపు 7,500 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వీటిలో సుమారు 10 శాతం అంటే దాదాపు 750 సరస్సులు సిక్కింలోనే ఉన్నట్లు అంచనా. వీటిలో 25 సరస్సులను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరుగుదల, వర్షపాతంలో మార్పులు వంటి పరిణామాలు ఆ సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి.

హిమానీనదాల నుంచి కరిగిన మంచు, నీరు చేరి ఏర్పడే సరస్సులు కాలక్రమంగా భారీగా విస్తరించే అవకాశం ఉంటుంది. సరస్సులను చుట్టుముట్టిన మంచు, రాళ్ల గోడలు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు రావచ్చు. దీనినే గ్లేషియల్ లేక్ ఔట్ బర్స్ట్ ఫ్లడ్ (జీఐఓఎఫ్ ) అంటారు. ఇలాంటి వరదలకు భారీ నీటితోపాటు మట్టి, రాళ్లు, మంచు కూడా కలవడంతో దిగువ ప్రాంతాల్లో విధ్వంసం మరింత పెరుగుతుంది. అయితే భారత్ లో హిమానీనద సరస్సుల ముప్పు సిక్కింకే పరిమితం కాదు. గంగా నదీ పరివాహక ప్రాంతంలోనూ సుమారు 4700 సరస్సులు ఉన్నట్టు అంచనాలు వెలువడుతున్నాయి. ఆ నదీ పరివాహక ప్రాంతం 2.5 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా విస్తరించి ఉంది. వీటిలో ఏదైనా



అత్యంత ప్రమాదకర సరస్సు ఒక్కసారిగా బద్దలైతే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర కీలక మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ముఖ్యంగా పర్వత ప్రాంతాల్లో లోయలు ఇరుకుగా ఉండటంతో వరద ప్రవాహం మరింత వేగంగా కిందకి దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.

భారత్ ఇప్పటికే ప్రమాదాన్ని చవిచూసింది. 2023 అక్టోబర్ 3వ తేదీన సిక్కింలోని సౌత్ లొనాక్ సరస్సు వద్ద భారీ విపత్తు సంభవించింది. సరస్సులోకి భారీగా మంచు, రాళ్లు విరిగిపడటంతో ఒక్కసారిగా పెద్ద అల ఏర్పడింది. సుమారు 20 మీటర్ల ఎత్తున ఎగిసిన ఆ నీటి అల దిగువ ప్రాంతాల వైపు దూసుకెళ్లింది. ఆ వరద ప్రవాహానికి జల విద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదారులు, నివాస ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఘటన హిమానీనద సరస్సుల ప్రమాద తీవ్రతను దేశం ముందు స్పష్టంగా ఉంచింది. నేపాల్ లో జరిగిన తాజా విపత్తు మరో కోణాన్ని బయటపెట్టింది. మంచు లేదా రాళ్లు విరిగిపడటం, ఆ తర్వాత భారీగా మట్టి, రాళ్ల ప్రవాహం ఏర్పడటం, తాత్కాలి కంగా సరస్సు ఏర్పడటం, చివరకు ఆకస్మిక వరదగా మారడం, ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా జరిగే ప్రమాదాలను క్యాస్కే డింగ్ హజార్డ్స్ అంటారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సభ్యుడు కృష్ణ వత్స ప్రకారం, ఇలాంటి పరిణామాలు చాలా వేగంగా చోటు చేసుకోవచ్చు. దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేయడానికి చాలా తక్కువ సమయం ఉండే అవకాశం ఉంది.

సౌత్ లొనాక్ ఘటన తర్వాత కేంద్ర హిమానీనద సరస్సులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయం కోసం ఉన్నత్స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఉన్నతాధికారి పీకే మిశ్రా నేతృత్వంలో కమిటీ పనిచేస్తోంది. ప్రమాదకర సరస్సులను గుర్తించడం, వాటిపై సర్వేలు నిర్వహించడం, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి అంశాలపై కమిటీ దృష్టి పెట్టింది. అంతేకాదు, ప్రమాదం ఎక్కువగా ఉన్న నాలుగు హిమాలయ రాష్ట్రాల్లో కార్యక్రమాల కు కేంద్రం రూ.150కోట్లు కేటాయించింది. “నేపాల్‌లో ఇటీవల సంభవించిన విపత్తు వంటి సంఘటనలు వాస్తవానికి భారతీయ హిమాలయ ప్రాంతంలో చాలా కాలంగా జరుగుతూనే ఉన్నాయి. గత 20 25 ఏళ్లలో భారత్ పై ప్రభావం చూపిన ఇటువంటి విపత్తులు ఏడు లేదా ఎనిమిది వరకు ఉన్నాయి. నేపాల్‌ను ప్రభావితం చేసిన పెద్ద విపత్తులు సుమారు నాలుగు లేదా ఐదు ఉన్నాయి. మరి దీనికి సంబంధించి భారత్ ఎంతవరకు సిద్ధంగా ఉంది?” అని ఎన్ డీఎంఏ మాజీ సలహాదారు సాఫీ అహ్సన్ రిజ్వీ తెలిపారు.

హిమాలయ ప్రాంతాల్లో వాతావరణ మార్పులతో పరిస్థితులు వేగంగా మారుతు న్నాయి. మంచు కరుగుదల, అస్థిరమైన మంచు కొండలు, మారుతున్న వర్షపాత పరిస్థితులు ఇవన్నీ హిమానీనద సరస్సులపై ప్రభావం చూపుతున్నాయి. అందుకే నేపాల్ విపత్తును కేవలం ఆ దేశానికి సంబంధిం చిన ఘటనగా చూడలేం. భారత్ లో కూడా వేలాది హిమానీనద సరస్సులు ఉన్న నేపథ్యంలో అప్రమత్తత మరిత పెంచాల్సిన అవసరం ఉంది. ప్రమాదకర సరస్సులను గుర్తించడం నుంచి వాటి కదలికలను ముందుగానే పసిగట్టి, దిగువ ప్రాంతాల ప్రజలను సకాలంలో అప్రమత్తం చేసే స్థాయికి వ్యవస్థను తీసుకెళ్లడమే ఇప్పుడు అసలు సవాల్. సౌత్ లొనాక్ ఘటన ఇప్పటికే భారత్‌కు ఒక హెచ్చరిక ఇచ్చింది. నేపాల్ విపత్తు ఆ హెచ్చరికను మరింత బలంగా గుర్తుచేసింది. హిమానీనద సరస్సుల ముప్పును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ జీఏల్ఓఎఫ్ రిస్క్ మిటిగేషన్ ప్రోగ్రామ్ ను చేపట్టింది. ఇందులో భాగంగా 195 ప్రమాదకర హిమానీనద సరస్సులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఐదు అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
సరస్సుల ప్రమాద స్థాయిని అంచనా వేయడం, నిరంతరం పర్యవేక్షించడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ప్రమాదాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం, స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించడం. ఇక హిమానీనద సరస్సులను గుర్తించడం తొలి అడుగు మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. గుర్తించిన సరస్సులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. నీటిమట్టం ఎంత పెరుగుతోంది? మంచు, రాళ్ల పరిస్థితి ఎలా ఉంది? సరస్సు గోడలు బలహీనపడుతున్నాయా? వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అందుకోసం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, కేంద్ర జల సంఘం, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సీడాక్, ఐటీబీపీ, సైన్యం తదితర సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలి.

## ఇప్పట్లో ముగిసేలా లేదు



- మరింత విస్తరిస్తోన్న వైనం
- అమెరికా-ఇరాన్ యుద్ధంపై తీవ్ర చర్చ
- మరో ఏడాది వరకూ కొనసాగే అవకాశం
- మిలటరీ ప్లాన్‌లో భాగంగానే ఇలాంటి నిర్ణయాలు

**వాషింగ్టన్, టెహ్రాన్, సెప్టెంబరు 04 (ఎ.ఎం.ఎస్):**

పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా మధ్య యుద్ధం ఇప్పట్లో ముగియదా? వచ్చే ఏడాది వరకు కొనసాగుతుందా? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. తాజాగా, పశ్చిమాసియాలో దళాల మోహరింపును 2027 వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ప్రకటించారని ‘వాల్ స్ట్రీట్ జర్నల్’ తాజా నివేదిక పేర్కొంది. ఇరాన్ యుద్ధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరింత మంది సైన్యాలు, మెరుగైన సైనిక వ్యూహాలను అందుబాటులో ఉంచేందుకు చేపట్టిన సుదీర్ఘ మిలిటరీ ప్లాన్‌లో భాగమే ఈ నిర్ణయం. ప్రస్తుతం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి తీసుకురావడం, ఎదురుదాడులు చేయడం లేదా యుద్ధాన్ని మరింత విస్తరించడం అనే మార్గాలు ట్రంప్ ముందు ఉన్నాయి .. కాలక్రమేణా తీవ్రరూపం దాల్చి విస్తరించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన సుమారు 50,000 మంది సైనికులు, 19 యుద్ధ నౌకలు, ఫైటర్ స్క్వాడ్రన్లు, వైమానిక రక్షణ విభాగాలు, పారాట్రూపర్లు మోహరించి ఉన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనం ప్రకారం.. యుద్ధనౌకల సిబ్బంది, ఎయిర్ డిఫెన్స్ విభాగాలు, పారాట్రూపర్లు ముందుగా నిర్ణయించిన దానికంటే ఎక్కువ కాలం ఆ ప్రాంతంలోనే కొనసాగాలని ఆదేశాలు అందాయి. సైన్యానికి చెందిన ఎయిర్ డిఫెండర్ల మోహరింపు కాలాన్ని 9 నెలల నుంచి 12 నెలలకు పెంచారు. అంతే కాకుండా ఐరోపా, పసిఫిక్ ప్రాంతాల నుంచి పశ్చిమాసియాకు తరలించిన కొన్ని విభాగాలు ఇప్పటికే ఏడాదికి పైగా అక్కడే సేవలుందిస్తున్నాయి. ఈ విధంగా సుదీర్ఘకాలం పాటు అక్కడే మోహరించడం వల్ల అమెరికా సైనికులు, వారి కుటుంబాలతో పాటు సైనిక పరికరాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ‘యుఎస్ఎస్ డెల్బర్ట్ డి. బ్లాక్’, ‘యుఎస్ఎస్ స్ప్రుయెన్స్’ అనే రెండు డిస్ట్రాయర్లు ప్రస్తుతం హర్మూజ్ జల సంధి దిగ్బంధనంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. 300 మంది సిబ్బంది ఉన్న ఈ నౌకలు విరామం లేకుండా నెలల తరబడి సముద్రంలోనే విధుల్లో నిమగ్నమయ్యాయి. మరోవైపు, ఇరాన్ నాయకత్వాన్ని తిరిగి చర్చలకు తీసుకొచ్చేందుకు ట్రంప్ యంత్రాంగం తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి తంత్రం వైపు మొగ్గు చూపుతోంది. ఇరాన్‌పై తెస్తున్న ఈ ఆర్థిక ఒత్తిడి వల్ల ఆ దేశం తన అణు కార్యక్రమాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉందని, దాంతో యుద్ధం పూర్తయినట్లు ప్రకటించే యోచనలో ట్రంప్ ఉన్నారని నివేదిక పేర్కొంది. ‘హర్మూజ్ జలసంధిపై దాదాపు పూర్తి నియంత్రణ సాధించడం, ఇరాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలడంతో ఇప్పుడు మన పరిస్థితి చాలా మెరుగ్గా ఉంది. ఇరాన్ ప్రజలు ఎప్పుడు తిరగబడి పోరాడతారు?'' అని ట్రంప్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే, యుద్ధాన్ని మరింత విస్తరిస్తే నవంబరులో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థుల గెలుపు అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ట్రంప్ సలహాదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే యుద్ధం విషయంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు తాను ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకోనని ట్రంప్ స్పష్టం చేశారు.

అమెరికా దళాలపై తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, ఇరాన్‌పై ఎప్పుడైనా, ఏ క్షణంలోనైనా మరిన్ని దాడులు చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని ఆయన బుధవారం హెచ్చరించారు. “మేము ఇరాన్‌కు చెందిన అనేక నౌకలను నాశనం చేస్తున్నాం. వారి రాడార్లను పేల్చివేయడం వల్ల వారు వేటినీ చూడలేకపోతున్నారు.. మేము అనుకున్నప్పుడు మళ్లీ దాడులు చేయడానికి సిద్ధంగా ఉన్నాం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. సైనిక చర్యలతో పాటు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాదు, దాని వ్యాపార భాగస్వాములపై కూడా ఆంక్షలు విధిస్తామని వాషింగ్టన్ హెచ్చరించింది.




## విదేశీ పర్యటనకు తమిళనాడు సీఎం

- తొలిసారిగా బ్రిటన్‌కు

**చెన్నై, సెప్టెంబరు 04 (ఎ.ఎం.ఎస్) :**

తిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం విజయ్ తొలిసారిగా విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రానికి భారీగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సెప్టెంబర్ 10 నుంచి 16 వరకు బ్రిటన్‌లో జరిగే పారిశ్రామికవేత్తల సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. ఈ అధికారిక పర్యటనలో ఆయన తన భార్య సంగీత, కుమార్తె దివ్యలను కలవనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు, నటి త్రిష కూడా అదే సమయంలో యూరప్‌లో షూటింగ్ నిమిత్తం ఉండటంతో వారిద్దరి కలయికపై కూడా చర్చ జరుగుతోంది.

## నవంబరు 10న బిలాంగింగ్ ప్రచురణ




- ఎక్స్ వేదికగా వెల్లడించిన హార్పర్‌కాలిన్స్ సంస్థ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 04 (ఎ.ఎం.ఎస్) :**

కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జీవిత చరిత్ర ఆధారంగా రచించబడిన ఆత్మకథ పుస్తకంపై బిగ్ అప్‌డేట్ వచ్చింది. ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ను హార్పర్‌కాలిన్స్ ఇండియా నవంబర్ 10న ప్రచురించనుంది. ఈ మేరకు శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఆత్మకథ భారతదేశంలో 2026 నవంబర్ 10న ప్రచురించబడుతుంది. మన కాలంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న రాజకీయ ఆత్మకథలలో ఒకటైన ‘బిలాంగింగ్’ అత్యంత వ్యక్తిగతమైన కథ. ఇది భారతదేశ ప్రయాణంపై ఒక అరుదైన అంతర్గత దృక్పథాన్ని అందిస్తుంది,” అని హార్పర్‌కాలిన్స్ ఎక్స్‌లో రాసింది. కాగా, పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సదురు పుస్తకాన్ని పబ్లిష్ చేయట్లేదని వెల్లడించిన విషయం తెలిసిందే.

## నేపాల్ విషాదంలో అద్భుతం

- వరదలొచ్చిన 9 రోజుల తర్వాత బయటపడ్డ ఇద్దరు కార్మికులు
- ప్రాణాలతో బతికిన ఘటన
- మరికొందరు బయటపడతారంటూ ఆశలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**ఖాట్మండు, సెప్టెంబరు 04 :**

నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే ఆశలు బలపడ్డాయి.

నేపాల్‌లోని త్రిశూలి 3ఏ జల విద్యుత్ ప్రాజెక్టులో ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.



బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది.

సహాయక చర్యల్లో ప్రాణాలతో బయటపడిన వారిని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (ఎన్ఈఏ) మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ షా (30), త్రిశూలి3 ‘ఏ’ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్ (45)గా నేపాల్ హోం మంత్రి సుడాన్ గురుంగ్ గుర్తించారు. ‘బీబీసీ’ కథనం ప్రకారం.. సంజయ్ షా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో అతన్ని వెంటనే హెలికాప్టర్‌లో రాజధాని ఖాట్మండుకు సమీపంలోని బత్తర్‌కు తరలించారు. మరోవైపు, కబీర్ మహర్జన్ స్పృహలోనే ఉన్నాడని, అతన్ని ఖాట్మండులోని చౌనీ మిలటరీ ఆసుపత్రికి తరలిస్తున్నామని అతని భార్య తెలిపారు. “చాలా సంతోషంగా ఉంది, నా గుండెపై భారం తగ్గింది” అని కబీర్ సోదరుడు అమీర్ మహర్జన్ ఆనందం వ్యక్తం చేశారు.

హిమానీనదం కూలిపోవడం వల్ల సంభవించిన ఈ జల ప్రళయంలో నేపాల్‌లోని మూడు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,259 మంది మరణించగా, 5,000 మందికి పైగా గల్లంతయ్యారని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. సరిహద్దుకు ఆవలి వైపున ఉన్న టిబెట్‌లో 21 మంది చనిపోగా, 541 మంది గల్లంతైనట్లు చైనా ప్రకటించింది.

నేపాల్‌లోని 12 జల విద్యుత్ ప్రాజెక్టుల నుంచి దాదాపు 900 మంది కార్మికులు గల్లంతయ్యారని, వారిలో సుమారు 500 మంది సొరంగాల్లోనే చిక్కుకుని ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఆరు హైడ్రోపవర్ ప్రాజెక్టుల సొరంగాల్లో 150 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు భావిస్తుండటంతో, వారిని కాపాడేందుకు భారీ ఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగాల్లోకి గాలిని పంపింగ్ చేస్తూ కార్మికులను ప్రాణాలతో కాపాడేందుకు ఇంజనీర్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

తాజా ఘటన జరిగిన త్రిశూలి సొరంగం నుంచి మరిన్ని స్వరాలు వినిపిస్తున్నాయని స్థానిక మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. “మరింత మందిని కాపాడుతామని ఆశిస్తున్నాం. వారి కోసం ఎదురుచూస్తున్నాం” అని నేపాల్ కమ్యూనికేషన్ మంత్రి బిక్రమ్ తిమిల్సినా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటనతో గల్లంతైన వారి కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయి.



## మహిళలకు భద్రతేది?

- బాలికలకూ రక్షణ కరువు
- సీపీఐ (ఎం) నేత బృందా కరత్ ఆందోళన

**నోయిడా, సెప్టెంబరు 04 (ఎ.ఎం.ఎస్) :**

6 ఏండ్ల బాలికపై లైంగికదాడి ఘటనకు నిరసనగా నోయిడా పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద ఐద్వా గురువారం భారీ ఆందోళనను నిర్వహించింది. మహిళలు, బాలికలకు రక్షణ, భద్రత కల్పించడంలో ఉత్తరప్రదేశ్ పోలీసులు విఫలమయ్యారని విమర్శించింది. నేరస్థులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.ఈ ఆందోళనలో పాల్గొన్న సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ బృందా కరత్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై పెరుగుతున్న లైంగిక హింస ఘటనలను తీవ్రంగా ఖండించారు. మహిళలకు భద్రతను కల్పించడంలో ఉత్తరప్రదేశ్, ఢిల్లీ పోలీసులు విఫలమవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.అలాగే, పోలీసుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే నిందితులు ఈ నేరానికి పాల్పడే అవకాశం కలిగిందన్న ఆరోపణలపై న్యాయమైన, నిష్పాక్షికమైన విచారణ జరపాలని ఐద్వా డిమాండ్ చేసింది. బాధ్యులపై బీఎన్ఎస్‌లోని నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా విజ్ఞప్తి కోరింది.అలాగే, ఈ ఆందోళన నేపథ్యంలో బుధవారం రాత్రి 11 గంటల నుంచే ఐద్వా గౌతమ్ బుద్ధ నగర్ జిల్లా అధ్యక్షులు రేఖా చౌహాన్‌ను గృహ నిర్బంధంలో ఉంచడాన్ని ఐద్వా ఖండించింది. ఇలాంటి చర్య ప్రజాస్వామ్య హక్కులు, శాంతియుత నిరసన హక్కుపై దాడి అని ఐద్వా విమర్శించింది. పోలీసుల నియంతృత్వ ధోరణిని ఖండించింది.ఈ ఆందోళనకు సీఐటీయూ సంఘీభావం ప్రకటించింది. ప్రజాసంఘాల నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వాణిజ్య నౌకలపై దాడులు ఆపాల్సిందే

- అప్పటి వరకు చర్చల్లేవు
- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడి

**వాషింగ్టన్, సెప్టెంబరు 04 :**

ఇరాన్‌తో చర్చలకు అమెరికా తాత్కాలికంగా బ్రేక్ వేసింది. వాణిజ్య నౌకలపై దాడులు ఆపే వరకు టెహ్రాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు. ఇరాన్ చర్యలను బట్టి తమ ఆపరేషన్లు కొనసాగుతాయని చెప్పారు. వాటికి ఎలాంటి గడువు విధించబోమన్నారు.

వైట్ హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో వాన్స్ మాట్లాడారు. వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌తో చర్చలు ఉండవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంగా చెప్పారని తెలిపారు. హర్మూజ్ జలసం



ధిలో ఇంధన రవాణా సజావుగా సాగడమే ప్రస్తుతం అమెరికా ప్రధాన లక్ష్యమని వాన్స్ చెప్పారు. తమ చర్యల వల్ల గురువారం రాత్రి 1.5 కోట్ల బ్యారెళ్ల చమురు హర్మూజ్ జలసంధి నుంచి బయటకు వెళ్లిందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం రాకుండా అమెరికా చర్యలు అడ్డుకున్నాయని తెలిపారు.

ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా వద్ద ఆర్థిక, సైనిక, దౌత్య, రహస్య చర్యలు సహా అన్ని మార్గాలు ఉన్నాయని వాన్స్ చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని తిరిగి నిర్మించకుండా అడ్డుకోవడం కూడా తమ లక్ష్యమన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి పెంచడంలో చైనా సహకరిస్తోందని వాన్స్ తెలిపారు. టెహ్రాన్‌కు ఆర్థిక సేవలను పరిమితం చేసే విషయంలో చైనా కొన్ని అమెరికా అభ్యర్థనలకు స్పందించిందన్నారు. టర్కీ, అజర్‌బైజాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్ కూడా ఇరాన్‌పై ఒత్తిడి పెంచడంలో సహకరిస్తున్నాయని చెప్పారు.

హర్మూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలక మార్గం. గల్ఫ్ దేశాల నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు చమురు తరలింపులో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇక్కడ రవాణాకు అంతరాయం ఏర్పడితే ఇంధన ధరలు, బీమా ఖర్చులు, రవాణా వ్యయం పెరిగే అవకాశం ఉంది.



## పోల్‌ను తాకిన వీఏడీజీఎస్ విమానం

- ప్రయాణీకులు, సిబ్బంది సురక్షితం
- ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు
- అధికారుల వెల్లడి

**శ్రీనగర్, సెప్టెంబరు 04 (ఎ.ఎం.ఎస్) :**

శ్రీనగర్ విమానాశ్రయంలో ఇండిగో విమానం పార్కింగ్ చేస్తుండగా వీఏడీజీఎస్ పోల్‌ను తాకింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. ముంబై నుంచి శ్రీనగర్ వచ్చిన ఇండిగో విమానం 6ఈ 225 (వీటీఎన్‌ఓజీ) ఉదయం 9.02 గంటలకు బే నంబర్ 6లో పార్కింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. విమానాన్ని సరైన స్థానంలోకి తీసుకెళ్తున్న సమయంలో వీఏడీజీఎస్ డిస్‌ప్లే యూనిట్‌తో పాటు లేజర్ లేదా కెమెరా సెన్సర్లను అమర్చిన పోల్‌ను విమానం తాకినట్లు అధికారులు వెల్లడించారు.

వెంటనే ప్రయాణికులు, సిబ్బందిని మాన్యువల్ మెట్ల సాయంతో విమానం నుంచి దించారు. అందరూ సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం విచారణ చేపట్టనున్నారు. విచారణ పూర్తయ్యే వరకు ప్రమాదానికి కారణంపై ఎలాంటి నిర్ధారణకు రావడం లేదని స్పష్టం చేశారు. ఈ ఘటనతో శ్రీనగర్ విమానాశ్రయ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం పడలేదు. విమానాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

గురువారం కూడా ఇండిగో విమానానికి సంబంధించిన మరో ఘటన చోటుచేసుకుంది. దోహా నుంచి బెంగళూరుకు వెళ్తున్న 6ఈ 1302 విమాన పైలట్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో విమానాన్ని అత్యవసరంగా మస్కట్‌కు మళ్లించారు. అక్కడ వైద్య బృందం పైలట్‌కు చికిత్స అందించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగానే ఉన్నట్లు ఇండిగో తెలిపింది. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ విమానం, కొత్త సిబ్బందిని ఏర్పాటు చేసి బెంగళూరుకు పంపించింది.

## వియత్నాంలో రోడ్డు ప్రమాదం

- తెలుగు యువకుడు మృతి

**హనోయి, సెప్టెంబరు 04 :**

వియత్నాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలుగు యువకుడు మృతి చెందారు. ఈ మేరకు బాపట్ల జిల్లా పర్చూరు మండలం చెరుకూరులో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. చెరుకూరు గ్రామానికి చెందిన సందెపూడి సాల్మన్ రాజు (35) ఐదేళ్ల క్రితం ఉద్యోగం నిమిత్తం వియత్నాం వెళ్లారు. రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాల్మన్ భౌతికకాయాన్ని శనివారం స్వస్థలానికి తరలించనున్నట్టు సమాచారం.



# దమ్ముంటే రాజీనామా చేసి ఇండిపెండెంట్ గా పోటీ చెయ్!



**నేనూ ఇండిపెండెంట్ గా పోటీ చేయడానికి సిద్ధం**
**కొండా సురేఖకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్**
**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి) :**

దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వరంగల్ తూర్పులో ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కొండా సురేఖకు సవాల్ విసిరారు.గురువారం వరంగల్ లోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తాను కూడా ఇండిపెండెంట్ గా పోటీకి సిద్ధమని, ఇన్నేళ్లుగా ప్రజల రక్తం తాగుతూ కొండా దంపతులు బీసీ కార్డు వాడుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని తిడితే ఊరుకోమని, హై కమాండ్ కు ఫిర్యాదు చేసింది తానేనని అన్నారు. మంత్రి పదవి పోవడం కొండా సురేఖ వాళ్ళ స్వయంకృతాపరాధమేనని, మంత్రి పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి నే తిట్టడం భావ్యం కాదని అన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు కొండా దంపతులవేనని, ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ వారిని బ్లాక్ మెయిల్ చేయడం కొండ వారికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు.దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని,నేను కూడా ఇండిపెండెంట్ గా పోటీ చేస్తా ఎవరి భవిష్యత్తు ఏంటో ప్రజలు నిర్ణయిస్తారని సవాల్ విసిరారు. కష్టం వచ్చినప్పుడే బీసీ నినాదం ఎత్తుకుంటారని, ఒక్కరిని కూడా బీసీలను కొండా దంపతులు ఎదగనివ్వలేదని అన్నారు. రామసహాయం సురేందర్ రెడ్డి లాంటి సీనియర్లను విమర్శించడం వారి స్థాయికి తగదన్నారు. సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించిన నీచ చరిత్ర కొండ సురేఖదని,వరంగల్ లో ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కూడా వారికి సపోర్ట్ చేయరని అన్నారు.కొండా సురేఖ గెలుపు కోసం పనిచేసిన వారిని పట్టించుకోని వారి బుద్ధి ఇక్కడ అందరికీ తెలుసని,కుడా చైర్మన్ పదవి గుండు సుధారాణికి ఇవ్వడం అధిష్టాన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని చెప్పారు.ఇంకా మరికొందరికి పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలకు పదవులు రావాల్సి ఉందని, ఇప్పుడు అవి వస్తాయని బస్వరాజు సారయ్య అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, బస్వరాజ్ శ్రీమాన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి, చాగంటి శ్రీనివాస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొండా సురేఖ బర్తరఫ్ సమంజసమే



**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**హనుమకొండ, సెప్టెంబర్ 03 (వుదయం ప్రతినిధి) :**

మంత్రి పదవి నుంచి కొండా సరేఖను ముఖ్యమంత్రి బర్తరఫ్ చేయడం ముమ్మాటికీ సమంజసమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన హనుమకొండలో మీడియాతో మాట్లాడుతూ మంత్రి పదవి అనుభవిస్తూ పార్టీపై పదేపదే విమర్శలు గుప్పిస్తూ, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు కచ్చితంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ చేసిన ఆరోపణలను ఆయన తీవ్ర స్థాయిలో తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం లేదని ఆమె ఇప్పుడు ఆరోపించడంపై మండిపడ్డారు. ప్రభుత్వంలో మూడేళ్లుగా మంత్రులుగా కొనసాగిన తర్వాత, ఇప్పుడు పథకాల అమలుపై విమర్శలు చేయడం ఏమిటని, ఇవాళే ఆ సంగతి గుర్తుకు వచ్చిందా అని నిలదీశారు. పార్టీ లైన్ కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవడం సరైనదేనని ఆయన నాయిని రాజేందర్ రెడ్డి సమర్థించారు. కాగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మొదటి నుంచి కొండా సరేఖ వైఖరిని, ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు.

కొండా సరేఖ కూతురు కొండా సుస్మిత పటేల్ సిఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల అనంతరం హైదరాబాద్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కొండా సురేఖ వైఖరిని తీవ్రంగా ఖండించారు.

# ఎస్.పి.ఆర్. లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**హసన్ పర్తి సెప్టెంబర్4 (వుదయం ప్రతినిధి):**

హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామ శివారులోని ఎస్.పి.ఆర్. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఉట్టి కొట్టే కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగిందని, విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు ఎంతగానో అలరించాయని తెలిపారు. శ్రావణ మాసం కృష్ణ పక్షంలో వచ్చే అష్టమి నాడు శ్రీ కృష్ణుని పుట్టిన రోజు సందర్భంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటామని, కృష్ణావతారానికి కారణమైన కథను వివరించి, శ్రీకృష్ణుని జీవితం నుండి నేర్చుకోవాల్సిన జీవిత పాఠాలను అందరు నేర్చుకోవాలని భగవద్గీత సారాన్ని అవలంబించి జీవితంలో ఎదగాలని, భారతీయ సనాతన సంస్కృతి సాంప్రదాయాలను విద్యార్థులు నేర్చుకోవాలని, ప్రతి ఒక్కరు కృష్ణ తత్వాన్ని అవలంబించి జ్ఞానాన్వేషణ, దృఢత్వం కలిగి ఉండాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు మాట్లాడుతూ...., విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, బాధ్యత, చిత్త శుద్ధి, సమయపాలన జట్టు కృషి వంటి అంశాలను పెంపొందించుకోవాలని, కేవలం పుస్తకాల పరిమితం కాకుండా దైనందిన జీవితంలో ప్రతి అంశాలపైన అవగాహన పెంచుకోవాలని, అదర్శనీయమైన వీటి ధర్మ మార్గంలో పయనించాలని, ఈనాటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులవ్వాలి

## పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క



**మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిర మహిళాశక్తి పథకం అండ**
**మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం.. వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు**
**సత్తుపల్లిలో ఇందిర మహిళాశక్తి సదస్సు లో పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసిన మంత్రి సీతక్క**
**సత్తుపల్లి సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి)**

మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తూ, ఆర్థికంగా ఎదిగి కోటీశ్వరులుగా మారాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మహిళల చేతుల్లో డబ్బు ఉండాలని, తమకు నచ్చిన విధంగా జీవించే ఆర్థిక స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని సిద్ధారం రోడ్డులో గల ఎం.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో 1000 రోజుల ప్రజా పాలనలో భాగంగా నిర్వహించిన ఇందిర మహిళాశక్తి సదస్సులో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లతో కలిసి పాల్గొన్నారు. మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలు పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరవుతున్నారంటే ప్రభుత్వంపై వారికి ఉన్న ప్రేమ, విశ్వాసానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కుటుంబ సభ్యులుగా భావిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి గత రెండున్నరేళ్లలో పంచాయతీరాజ్, మహిళా సంఘాల సంక్షేమం, తాగునీరు తదితర రంగాల్లో సుమారు రూ.300 కోట్ల వరకు నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి పల్లె, గూడెం, తండా, వాడలో అవసరమైన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. మహిళా ఆర్థిక పురోగతికి కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మేడారం జాతర సందర్భంగా మహిళా సంఘాలకు సుమారు రూ. 6 కోట్ల మేర రుణ సహాయం అందించగా, మహిళలు కేవలం 15 రోజుల్లోనే సుమారు రూ.9 కోట్ల వ్యాపారం చేసి లాభాలు ఆర్జించారని గుర్తుచేశారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, రుణాలపై వడ్డీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రుణ బీమా సదుపాయం కల్పిస్తూ, రుణం తీసుకున్న సభ్యురాలు మరణించిన సందర్భంలో నిర్దిష్ట పరిమితి వరకు రుణాన్ని మాఫీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

**మహిళలకు ఆత్మగౌరవ భవనాలు**

మహిళా సంఘాల సమావేశాలు చెట్ల కింద లేదా ఇతరుల ఇళ్ల వద్ద నిర్వహించాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీవో భవనాలను నిర్మిస్తోందన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే అనేక వీవో భవనాలు మంజూరు చేశామని, ఇంకా అవసరమైన భవనాలను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా సమాఖ్యల కోసం రూ. 5 నుంచి రూ.7 కోట్ల వ్యయంతో భవనాలను నిర్మిస్తున్నామని, మహిళల శిక్షణ, సమావేశాలు, వ్యాపార కార్యకలాపాలకు అవి ఉపయోగపడతాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని, మినీ అంగన్వాడీలను ప్రధాన అంగన్వాడీలుగా మార్చి సిబ్బందికి వేతనాలను పెంచామని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్వాడీ పిల్లలకు యూనిఫాంలతో పాటు అల్పాహారం, పోషకాహారం అందించే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని, పిల్లలను తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ అంగన్వాడీలను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందిస్తున్న పథకాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. చిన్న స్థాయిలో కుట్టు మిషన్‌తో ప్రారంభించిన మహిళలు నేడు పెద్ద కంపెనీలు నిర్వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, గతంలో మహిళా సంఘాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, రుణాలపై అధిక వడ్డీ భారంతో చాలామంది సభ్యులు సంఘాల నుంచి వైదొలిగిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ రెహ్మాన్ బేగం, కల్లూరు ఎపీపీ వసుందర, సత్తుపల్లి మున్సిపల్ కమీషనర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలనలో పేదలకు లబ్ది

**నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత**
**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 04**



తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నిరుపేదలకు లబ్ది జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత అన్నారు. శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ నుండి క్లాక్ టవర్ వరకు 1000 రోజులో సాధించిన విజయాలపై వికాస యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అగ్ర కుల పెద్దల అభ్యున్నతికై కృషి చేస్తున్నారని దళిత బహుజన ఆత్మీయ బంధువు గా మారారని కొనియాడారు. నిరుపేదలకు సన్న బియ్యం,5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు,2 లక్షల రుణమాఫీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు RTC ఉచిత ప్రయాణం,వడ్డీలేని రుణాలు,ఇందిరమ్మ చీరలు లాంటి అద్భుతమైన పథకాలు దేశానికి ఆదర్శమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల గుండెల్లో నిలిచారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని లూటీ చేసిన దోపిడి దొంగల ముఠా నేడు తెలంగాణలో నిరసనలు తెలిపే నైతిక హక్కులేదన్నారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగని మాధవి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముంతాజ్ అలీ, ప్రధాన కార్యదర్శులు పోసిరెడ్డి సంతోష్ రెడ్డి,మేకల రాజేందర్ రెడ్డి,గోపిశెట్టి రాంబాబు, ఏళ్ల రవీందర్ రెడ్డి,కుకుడాల బాలకృష్ణ,జిల్లా కార్యదర్శులు చర్లపల్లి గౌతమ్,దామనూరి అశోక్,కాసిరెడ్డి నరేష్,దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న వెంకటేశ్వర్లు ,కొండమల్లెపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి,చింతమల్ల వెంకటయ్య, కాటం వెంకన్న,మధుప్రసాద్,వవిల్ల దేవదాస్,పులెంల సందీప్,కుర్పాటి గణేష్,వేముల గోపీనాథ్,ఇందనూరి శ్రీను,కోరే శివ, బాలం మహేష్,గణపురం మహేష్,కత్తుల గణేష్,INTUC,NSUI ,YOUTH CONGRESS నాయకులు,కౌన్సిలర్లు,అనుబంధ సంఘా నాయకులు పాల్గొన్నారు

# 420హామీలపై సబ్బండ వర్గాలకు దుద్దిళ్ల శ్రీధర్ జవాబు చెప్పాలే



**ఎన్నికల్లో మెజార్టీ ఇచ్చే కాటారం మండలాన్ని విస్మరించిన ఎమ్మెల్యే**
**కాంగ్రెస్ మోసాలపై ప్రతి ఒక్కరు చైతన్యవంతులై నిలదీయాలే**
**వంటావార్పు నిరసనలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**
**జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 04(వుదయం ప్రతినిధి)**

అధికారం కోసం 420హామీలు ఇచ్చి వేయి రోజులైన అమలు చేయని దుద్దిళ్ల శ్రీధర్ సబ్బండ వర్గాలకు సమాధానం చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా శుక్రవారం కాటారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ కూడలి వద్ద వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఒక్క హామీ అమలు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మానిఫెస్టో రాసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ హామీల అమలును కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. గ్యారంటీ కార్డులు పట్టుకుని ఇంటింటికీ తిరిగి వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఆయన అన్నారు. మహిళలు, వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులు, నిరుద్యోగులు, సబ్బండ వర్గాల ప్రజలను దుద్దిళ్ల శ్రీధర్, రేవంత్ రెడ్డిలు దగా చేశారని అన్నారు. హామీలు ఆకాశంలో.. అమలు పాతాళంలోకి పోయాయని ఎద్దేవా చేశారు. ఆనాడు సిపాయి మాటలు మాట్లాడిన మంథని ఎమ్మెల్యే ఇప్పుడు హామీల అమలు ఎందుకు చేయడం లేదో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఏ ఒక్కటి హామీ ఇవ్వలేదని, హామీ ఇవ్వకుండా ప్రజల కష్టాలను తీర్చేలా పథకాలకు రూపకల్పన చేసి అమలు చేసిన గొప్ప నాయకులు కేసీఆర్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెల రూ.2,500 ఇస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారని, ఆ హామీలు కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని, మహిళలు ఆ హామీ అమలు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగుల వేతనాలను పెంచుతామని చెప్పి ఎన్నికల సమయంలో వారి మద్దతు పొందారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మహిళా సంఘాలకు, ఇతర వర్గాలకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చదువుకున్న వ్యక్తి అని నమ్మి మంథని ప్రజలు ఓట్లు వేసి అధికారం ఇస్తే మోసం చేస్తూనే ఉన్నాడని, ప్రతి ఎన్నికల్లో కాటారం మండల ప్రజలు వేలలో మెజార్టీ ఇస్తున్నా ఇప్పటి వరకు ఈ ప్రాంత ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. యావత్తు రాష్ట్ర ప్రజలను మోసం చేసేలా మానీఫెస్టో రాసి 420హామీలు ఇచ్చి ఒక్కటి అమలు చేయకుండా మంథనికి అపకీర్తి తీసుకువచ్చాడని, ఎక్కడకు వెళ్లినా కాగితాలు రాసిచ్చి మోసం చేసిన దౌర్భగ్యుడు మంథని ఎమ్మెల్యే అని తిట్టుకుంటాండ్లని అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ జక్కు హర్షిని, మహిళా నాయకురాలు కేదారి గీత, సౌజన్య రెడ్డి, స్వప్న,అరుణ, నాయకులు జక్కు రాకేష్, శ్రీపతి బాపు, ఆన్కారి ప్రకాష్, అలీమ్, సుంకే మధు, వెన్నంపల్లి మహేష్, పోత వెంకటస్వామి, రవి సాగర్, నీర్ల ప్రభాకర్, తో పాటు నాయకులు, పాల్గొన్నారు.

# ముక్కోటి ఉత్సవాల్లోపు ఉత్తర ద్వార పనులు పూర్తి చేయాలి

**గోదావరి పుష్కరాల నాటికి ఘాట్లు, అభివృద్ధి పనులు సిద్ధం చేయాలి**
**భద్రాచలం ఆలయ అభివృద్ధిపై అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి )**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటికి భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, ఆలయ ఈవో దామోదర్, తహసీల్దార్ రవికుమార్, ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, మంత్రి పొంగులేటి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు.

**అభివృద్ధి పనుల పరిశీలన**

పూజల అనంతరం ఆలయ పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చిత్రకూట మండపం పరిసరాలు, గోశాల, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాలయానికి వెళ్లే మార్గం, ఉత్తర ద్వార దర్శనం, రామాలయం, మాడవీధులు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించారు.

**ముక్కోటి, శ్రీరామనవమికి ముందే పనులు పూర్తి**

ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ముక్కోటి ఉత్సవాల నాటికి ఉత్తర ద్వార అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 జూన్-జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కరాల ప్రారంభం నాటికి గోదావరి పరివాహక ప్రాంతంలోని ఘాట్లు, ఇతర అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**రూ.276 కోట్లతో ఆలయ పరిసరాల అభివృద్ధి**

భద్రాచలం ఆలయ పరిసరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.276 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలకు తావులేకుండా నిర్మాణాలు దశాబ్దాల పాటు పటిష్టంగా ఉండేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తు వేగవంతం చేయండి - జిల్లా పోలీస్ అధికారులతో

# వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ నర్సింహ, ఐపీఎస్ ఆదేశం

**ప్రతి పౌరుడికి అందుబాటులో పోలీసు సేవలు.. వినాయక చవితి ఉత్సవాలకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు**
**సూర్యాపేట, సెప్టెంబర్ 04: వుదయం ప్రతినిధి**



జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నర్సింహ, ఐపీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల తీరుతెన్నులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, అట్రాసిటీ కేసులు, సెంటర్ కంప్లైంట్ సెల్ ఫిర్యాదులు, 30 రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు, పోక్సో కేసుల దర్యాప్తు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.

నాణ్యమైన దర్యాప్తు: ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు కేసులపై దృష్టి: కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని, సాక్ష్యాధారాల సేకరణ, డాక్యుమెంటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

పోక్సో కేసులకు ప్రాధాన్యత: పోక్సో కేసుల్లో దర్యాప్తును అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత సమయంలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. వినాయక చవితి ఉత్సవాలపై ముందస్తు ప్రణాళిక: రానున్న వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నిమజ్జన ప్రదేశాల గుర్తింపు, రూట్ మ్యాప్,

పార్కింగ్ పై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని, మండప నిర్వాహకులకు నిబంధనలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, పోలీస్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యాపేట మీదుగానే బుల్లెట్ ట్రైన్.. అలైన్ మెంట్ కోసం

# కేంద్రంతో మాట్లాడుతా - మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

**22వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలకు మద్దతు - ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తామని హామీ**
**సూర్యాపేట, సెప్టెంబర్ 04: వుదయం ప్రతినిధి**



సూర్యాపేట ప్రజల చిరకాల వాంఛ అయిన జాతీయ రహదారి 65 సమాంతర బుల్లెట్ రైలు కారిడార్ ను సూర్యాపేటకు తీసుకొచ్చేలా కృషి చేస్తానని మాజీ పార్లమెంటు సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 22వ రోజుకు చేరాయి. గురువారం ఈ దీక్షకు సీఐటీయూతో కలిసి ఆయన మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి 65 సమాంతరంగా హైదరాబాద్ సూర్యాపేట జగ్గయ్యపేట అమరావతి చెన్నై / విశాఖ మీదుగా సైంటిఫిక్ గా భూసేకరణ చేసి బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. హైదరాబాద్ లో భూముల రేట్లు పెంచడానికే అలైన్ మెంట్ మార్చారని ఆరోపించారు. దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో తాను ఎంపీగా ఉన్న సమయంలోనే సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కోసం కోరానని గుర్తు చేశారు. చిట్యాలకు డ్రై పోర్ట్ ను కూడా మంజూరు చేయించానన్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, నితిన్ గడ్కరీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ల సహకారంతో సూర్యాపేట వాసిగా బుల్లెట్ ట్రైన్ ను సాధించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన సమితి కన్వీనర్ జానకీ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, బీజేపీ జిల్లా నాయకులు చలమల్ల నరసింహ, అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పట్టణ అధ్యక్షుడు బూర మల్సూర్ గౌడ్, అఖిలపక్ష నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ భూపతి రాములు, సట్టు నాగయ్య, గండూరి శంకర్, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2,500, తులం బంగారం హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేడు**
**రూ.2 వేల నుంచి రూ.4 వేలకు ఆసరా పెన్షన్ పెంపు హామీ ఎక్కడ?**
**బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది**
**ఐనవోలు లో వంటావార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్**
**ఐనవోలు , సెప్టెంబర్ 04 ( వుదయం ప్రతినిధి ):**



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల దాదాపాలన నిరసిస్తూబీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా మూడవరోజు వర్ధన్నపేట నియోజకవర్గం అయినవోలు మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "వెయ్యి రోజుల పాలనపై వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సు" లో వంటా వార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పాల్గొని స్వయంగా కూరగాయలు కట్ చేసి వంట వండినారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆరూరి రమేష్ మాట్లాడుతూ..మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతి మహిళకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి మహిళను మహాలక్ష్మిని చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేసి మహిళలు బస్సుల్లో ఇబ్బందులు పడే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు. హన్మకొండ , వరంగల్ నుంచి ఐనవోలు మండల కేంద్రం వరుకు , మండల రెడ్డి పాలెం నుండి ఐనవోలు కు వెళ్లడానికి బస్ స్టాండ్‌కు వెళ్తే గంటల తరబడి నిలబడినా బస్సులు రావడం లేదని అన్నారు.రూ.500కే గ్యాస్ సిలిండర్ పది మంది మహిళలకు ఇచ్చి అందరికి ఇచ్చినట్లు చెబుతున్నారని అన్నారు.హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేస్తోందని విమర్శించారు. మహిళలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత పెళ్లి చేసుకున్న వారిలో ఒక్కరికైనా తులం బంగారం వచ్చిందా అని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను అన్నింటినీ మరచిపోయిందని అన్నారు. మహిళల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఆరూరు రమేష్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ తంపుల మోహన్ , నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు , మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘు వంశీ , సర్పంచులు ఉస్మాన్ అలీ , కంజర్ల అశోక్ రావు , మాజీ సర్పంచ్ లు పల్లకొండ సురేష్ , కత్తి దేవేందర్ , మాజీ దేవస్థానం చైర్మన్ మునిగాల సమ్మయ్య , మాజీ ఉప సర్పంచ్ లు అడ్డగూడి సతీష్ , రాజి రెడ్డి , సీనియర్ నాయకులు దుప్పెల్లి కొమురయ్య , రామోజీ సతీష్ , గుంషావాలి , దేవదాస్ , నరేష్ , బుస సురేష్ , జన్ను రాజు, ఎస్. చందర్ , కుమార్ , సింగారపు పుష్ప , కట్టబోయిన నాగలక్ష్మి , తాటికాయల సుజాత మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్-సంతోషిమాత ఆలయంలో వెలిచాల రాజేందర్‌రావు ప్రత్యేక పూజలు

**కరీంనగర్ సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్ జ్యోతినగర్ హనుమాన్–సంతోషిమాత ఆలయాన్ని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు రాజేందర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన కరపత్రాన్ని రాజేందర్‌రావు ఆవిష్కరించారు. ఆలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తూ అవసరమైన కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కార్పొరేటర్ పడాల శ్రీజ అజయ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ధర్మారం వెంకట స్వామి, మాజీ కార్పొరేటర్ వాల రమణారావు, కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్కే విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా 'ప్రారంభ్ ఉత్సవ్ 2026' ఫ్రెషర్స్ డే వేడుకలు

**కామారెడ్డి, వుదయం ప్రతినిధి:**



పట్టణంలోని ఆర్కే, ఎస్‌ఆర్కే, విఆర్కే జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో 'ప్రారంభ్ ఉత్సవ్ 2026' పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై, తమ ప్రతిభాపాటవాలతో ప్రోగ్రాంను ఘనవిజయం చేశారు.

**రజతోత్సవ వేడుకలకు శ్రీకారం:**

ఆర్కే విద్యాసంస్థలను స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి ఐన సందర్భంగా, ఈ సంవత్సరం రజతోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టామని సంస్థ సీఈఓ డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. గత 24 సంవత్సరాలలో ఇక్కడ చదివిన అనేకమంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత విద్యార్థులు కూడా అదే బాటలో పయనించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేదికపై ఉన్న అతిథులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్ వై గిరి పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు ఉత్తమంగా చదివి కామారెడ్డి జిల్లాకు ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. అదేవిధంగా ఇంటర్నోడల్ అధికారి షేక్ సలాం, మై భారత్ జిల్లా యువజన అధికారి రమేష్, డివై ఎస్ ఓ వెంకటేశ్వర్ గౌడ్ విచ్చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ అపర్ణ, ప్రొఫెసర్ విద్యావర్ధిని హాజరయ్యారు. వేడుకల్లో 'గెస్ట్ ఆఫ్ హానర్స్'గా ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సురేష్ బాబు, లిరిక్ రైటర్ ప్రజాకవి జయరాజ్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల గ్రూప్ చైర్మన్ భాస్కర్రావు, వివిధవిభాగాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, హెచ్ఓడీలు, సీనియర్లెక్చరర్లు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం రోజంతా కోలాహలంగా మారింది.

# కాగజ్ నగర్ మున్సిపాలిటీలో రూ.5.70 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి)**



కాగజ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.5.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విట్టల్.మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు– వార్డ్ నెం. 24: బాలాజీ నగర్ నుండి ఖలీద్ కిరణం వరకు సీసీ రోడ్డు రూ.1.50 కోట్లు.వార్డ్ నెం. 11: ఆదర్శ్ నగర్ నుండి స్విమ్మింగ్ పూల్ వరకు సీసీ రోడ్డు – రూ.1 కోటి.వార్డ్ నెం. 12: హనుమత్ రావు ఇంటి నుండి ఫకీర్ మొహమ్మద్ ఇంటి వరకు సీసీ రోడ్డు – రూ.1.50 కోట్లు.వార్డ్ నెం. 6: తాహెర్ ఇంటి నుండి మసాలా మోరీ వరకు సీసీ రోడ్డు – రూ.1.70 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టియుఎఫ్ఐడిసి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, మరిన్ని నిధులు సేకరించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిఈ రమాదేవి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

**ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**కామారెడ్డి, సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి):**



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదుచేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ, దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాటం చేస్తూనే ఉందని, భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు.ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీహక్కు.ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

**కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి:షబ్బీర్ అలీ**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పని చేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు? ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలి" అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు.కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు.

# నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు...



**పెద్దపల్లి సెప్టెంబరు 04 (వుదయం ప్రతినిధి)**

పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామంలో పెద్దపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సింగిల్ విండో చైర్మన్ ముత్యాల నరేష్ గారి నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు గారు...ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,పాలకవర్గం మరియు మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు మరియు పలు గ్రామాల సర్పంచ్ లు,సింగిల్ విండో చైర్మన్ లు,మండల పార్టీ అధ్యక్షులు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వమే అన్ని వర్గాలకు అండ

**నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్**

**వెయ్యి రోజుల పాలన.. కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్**



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి):**

“రైతులు, మహిళలు, యువత, పేదలు, మైనారిటీలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది” అని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజాపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బోథ్ పట్టణంలో మండల అధ్యక్షుడు మేరుగు భోజన్న ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సహకారంతో బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పటాకులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, జిల్లా కార్యదర్శి వినయ్ రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మేరుగు దాస్, తాజా మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, అరుణ్‌కుమార్, రమేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణంలో అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా...

**జగిత్యాల పట్టణంలో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పని చేస్తా...**



**జగిత్యాల సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి)**

జగిత్యాల పట్టణ ఉప్పరి పెట్ లో వెలమ సంక్షేమ సంఘంలో 3 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి బోర్ మోటార్ పనులకు భూమి పూజ చేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం హనుమాన్ ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని జగిత్యాల పట్టణంలో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ కౌన్సిలర్ లు సరిత రమేష్ రావు దుమాల రాజ్ కుమార్ గిరిధర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్ రావు సంఘం అధ్యక్షులు భగవంత రావు నాయకులు దామోదర్ రావు బాలే శంకర్ రమణ రావు ఆనంద్ రావు రాజేశ్వర్ రావు ప్రవీణ్ రావు డిఈ మిలింద్ ఏఈ విజయ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని వ్యాపార వర్గాలతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆత్మీయ సమ్మేళనం



**పెద్దపల్లి సెప్టెంబరు 04 (వుదయం ప్రతినిధి)**

గోదావరిఖని పట్టణ వర్తక వ్యాపార వాణిజ్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో రామగుండం ఎమ్మెల్యే ఎం. ఎస్.రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపారులు వాణిజ్య సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. గోదావరిఖని అభివృద్ధిలో వ్యాపార వాణిజ్య వర్గాల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పించడంతో పాటు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రహదారులు పారిశుధ్యం తాగునీరు పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ డిక్లరేషన్ హామీ ఏది?

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు బీఆర్ఎస్ బహిరంగ లేఖ**

**ధర్మపురి, సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడివెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నిక ల సమయంలో ఎస్సీ సమాజా నికి ఇచ్చిన ఎస్సీ డిక్లరేషన్ హా మీలు ఏమైయ్యాయని బీఆర్ఎస్ మండిపడింది.ఈ మేరకు ఎస్సీ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ధర్మపురి బీఆర్ఎస్ మండల కన్వీనర్ అయ్యోరి.రాజేష్ ఒక బహిరంగ లేఖ సంధించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నమ్మి ఎస్సీ లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారని, కానీ నేడు ఆ హామీల అమలు గాలికొదిలేశారని లేఖలో దుయ్యబట్టారు. రూ.12 లక్షల డాక్టర్ బీఆర్ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ఎక్కడికి పోయిందని నిలదీశారు.ఎస్సీ లకు ఇస్తామన్న 18 శాతం రిజ ర్వేషన్లు, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. భూమిలేని ఎస్సీ కుటుం బాలకు ఇంటి స్థలం, గృహ నిర్మాణ సహాయం ఎందుకు అందజేయడం లేదని నిలదీశారు. ఎస్సీ కార్పొరేషన్‌కు ప్రకటించిన నిధులు ఏవీ అని, విద్యా జ్యోతి, విదేశీ విద్య వంటి పథకాలు ఎందుకు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని లేఖలో ఎత్తి చూపారు. రాజకీయ విమర్శల కోసం కాకుండా ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరేందుకే ఈ ప్రశ్నలు వేస్తున్నట్లు బీఆర్ఎస్ స్పష్టం చేసింది. గత బీఆర్ ఎస్ హయాంలో ధర్మపురి నియోజకవర్గంలో దాదాపు 400 మంది దళిత కుటుంబాలకు దళిత బంధు అందించి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయగా, మరో 11వందల మంది లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున అందించేందుకు గ్రౌండింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని గుర్తు చేశారు. మంత్రి బాధ్యతలు చేపట్టాక ధర్మపురిలో ఎంతమందికి అంబేద్కర్ అభయ హస్తం కింద రూ. 12 లక్షల సాయం అందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ డిక్లరేషన్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించి ఏ హామీ అమలైంది, ఏది పెండింగ్‌లో ఉందో ప్రజలకు స్పష్టం చేయాలని లేనియెడల ఎస్సీల తరపున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

**నిర్మల్ జిల్లా 4 సెప్టెంబర్ 2026 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు.ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.ఏదైనా సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 22ఏ (22A) నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ ను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ వి ఎం గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల /సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి)**



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల ఈ వి ఎం గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పోలీసు సిబ్బంది సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు చేపట్టడంతో పాటు 24 గంటలు సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలుపుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పందించకపోతే హైవే దిగ్బంధం

**కుప్టి వద్ద NH-44ను పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి):**



నెరడిగొండ మండలంలోని కుప్టి వద్ద NH–44 రహదారిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరిశీలించారు. హైవేపై గుంతలు ఏర్పడటంతో పాటు వంతెనపై సింగిల్‌వే కొనసాగుతుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా సింగిల్‌వే కారణంగా ప్రమాదాల ముప్పు పెరుగుతోందన్నారు.హైవే అధికారులు సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాల కంటే తనకు ఏదీ ముఖ్యమైంది కాదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని, అధికారులు స్పందించకపోతే ప్రజల తరఫున హైవే దిగ్బంధం చేపడతామని అనిల్ జాదవ్ హెచ్చరించారు.

# ధర్మపురలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ధర్మపురి సెప్టెంబర్4 (వుదయం ప్రతినిధి):**



శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ నర సింహా స్వామివారి దేవస్థానం లో ప్రధాన దేవాలయంలో బలరామకృష్ణుల సమేత శ్రీస్వామివారికి,దేవస్థానం ఆవరణలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో స్వామివార్లకు అర్చకులు వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. స్వామివా ర్లకు క్షీరాభిషేకం, విష్ణుసూక్త పఠనంతో విశేష అభిషేకం జరిపించారు. అనంతరం షోడ శోపచార పూజా విధానం, అష్టోత్తర శతనామ పూజను శాస్త్రో క్తంగా కన్నుల పండుగగా నిర్వ హించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టకస్తోత్ర పారాయణం చేశారు.ఈ కార ్యక్రమ ంలో దేవస్థానం కార్యనిర్వహణా ధికారి సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ,ఓంకార శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంబి నరసింహ మూర్తి, చక్రపా ణి కిరణ్ కుమార్,అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజ గోపాల్, దేవ స్థాన సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.



# లోకపల్లి లక్ష్మమ్మను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నేత రతంగ్

**నారాయణపేట సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి)**

శ్రావణ శుక్రవారం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి దంపతులు,పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు వై.జనార్ధ న్ రెడ్డి లోక పల్లి లక్ష్మమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించా రు.ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రతంగ్ పాండురెడ్డి దంప తులను ఆలయ కమిటీ ఉపాధ్య క్షుడు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ శాలు వాతో సన్మానించారు.ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పిల్లి నర్సింలు, లప్ప అశోక్,క న్నా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డిలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- **వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**సంగారెడ్డివుదయం :**

సంగారెడ్డి పట్టణంలో మురళీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు ని ర్వహించారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చిన్నా రులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో సందడిగా మారింది.కృ ష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి జీవిత సందేశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ధర్మం, సత్యం, మానవ త్వం వంటి విలువలను ఆచరించాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సూచించారు. ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాం క్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 9న నాగర్ కర్నూల్ లో భారీ నిరుద్యోగ నిరసన

**నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 04 (వుదయం ప్రతినిధి):**



నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో శుక్రవారం యువతతో ప్రత్యేక సమా వేశాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి రావడానికి విద్యా ర్థులను, యువతను ఏ విధంగా మోసం చేసిందో, అధికారంలోకి వచ్చాక 1000 రోజులుగా అరాచక పాలనను ఏ విధంగా కొనసాగిస్తుందో గ్రామ గ్రామాన విద్యార్థులకు, యువతకు ముఖ్యంగా జెన్ జి కి విస్తృతంగా అవ గాహన కల్పించాలని పిలుపునిచ్చా రు.ఈ నెల 9వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ సమస్యలపై, విద్యార్థుల సమస్యలపై భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నియో జకవర్గంలోని యువత, నిరుద్యోగు లు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని యువతకు సూచించారు.

# శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినం




**పటాన్చెరు (వుదయం):**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజక వర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాల స్వామి దేవాలయాన్ని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం మాజీ కార్పొరేటర్, ఆలయ నిర్వ హకులు మెట్టు కుమార్ యాదవ్.. ఎమ్మెల్యే జీఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.

# ఉత్తమ అధ్యాపకుడిగా వేముల శ్రీనివాసులు

**తెలకపల్లి సెప్టెంబర్ 4 (వుదయం ప్రతినిధి)**



మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అసోసియేట్ ప్రొ ఫెసర్ డాక్టర్ వేముల శ్రీనివాసులు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం జడ్చ ర్ల లోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన ఎంతోమంది విద్యా ర్థులకు, అధ్యాపకులకు స్ఫూర్తిదాయ కంగా నిలిచారని పలువురు అభిప్రా పడ్డారు. కామర్స్ డిపార్ట్మెంట్లో మెరుగైన సేవలందిస్తూ పలువురి మన్ననలు పొందారు.

# మద్దూర్ లో అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి

**నారాయణపేట సెప్టెంబర్ 4(వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కొడంగల్ ని యోజకవర్గంలోని మద్దూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న పలు అభి వృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మద్దూరుకు చేరుకున్న ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ప్రియాంక హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భం గా కళాశాల భవన నిర్మాణ నమూనా చిత్రపటాన్ని పరిశీలించిన ముఖ్యమం త్రి, భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం,నిర్మాణ విస్తీర్ణం,తరగతి గదులు, ప్రయోగశాలలు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 4 ఎకరాల స్థలంలోని 13,670 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఈడబ్ల్యూఐడీసీ ఎం.డీ. గణపతిరెడ్డి ము ఖ్యమంత్రికి వివరించారు. అనంతరం భవనం లోపల జరుగుతున్న నిర్మాణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. కళాశాల భవనం పక్కన ప్రధాన రహదారి వైపు ఉన్న అదనపు భూమిని సర్వే చేయించాలని, అది పట్టా భూమి అయితే కొనుగోలు చేసి కళాశాలకు విశాలమైన ప్రాంగణం, ప్రహరీ నిర్మా ణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు ముఖ్యమం త్రి సూచించారు.వచ్చే మార్చి నెలలోపు కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మద్దూరు ప్రాంతంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడు వులోగా పూర్తి చేయాలని సూచించారు.

**గురుకుల బాలికల పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన....**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనుల పరిశీలన అనంతరం ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి రోడ్డు మార్గంలో చింతల్ దిన్నే వైపు కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల,కళాశాల నిర్మాణ పనులను



కూడా పరిశీలించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణా లతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ ప్రతి పడవద్దని సూచించారు. పనులు నిర్దేశిత ప్రమాణాలకు అను గుణంగా లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అయితే గురుకుల పాఠశాల నిర్మాణాని కి స్థలం ఇచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి మద్దూరుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలో అభిమాను లు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్వో రాజేశ్వరి, మద్దూరు మున్సిపల్ చైర్ పర్సన్ సరస్వతీ, మద్దూరు మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సిములు, వీరేశ్ గౌడ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# కమిటీలపై కొరడా.. ఇక జాప్యం వద్దు!

- **నూతన మండల అధ్యక్షులకు డీసీసీ చీఫ్ రాజీవ్‌రెడ్డి సూటి ఆదేశాలు**
- **గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ జెండా బలంగా ఎగరాలి.. అన్ని వర్గాలకు ప్రాధాన్యం**

**గద్వాల: సెప్టెంబర్ 04 (వుదయం కరస్పాండెంట్)**





కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు జిల్లా నాయ కత్వం దూకుడు పెంచింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల అధ్యక్షులు తమ పరిధిలోని పార్టీ అనుబంధ కమిటీల ఏర్పాటును ఇక ఏమాత్రం వాయిదా వేయొద్దని డీసీసీ అధ్యక్షుడు మలిచేటి రాజీవ్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి మండలంలో చురుకైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా బంగ్లా కార్యాలయంలో డీసీసీ కమిటీ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించా రు. సమావేశానికి రాజీవ్‌రెడ్డి అధ్యక్షత వహించి పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కమి టీలన్నీ కొలువు దీరాల్సిందే! గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలో నూతన మండల అధ్యక్షులు తమ పరి ధిలోని అనుబంధ కమిటీలను వేగంగా ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించా రు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్, సోషల్ మీడియా తదితర విభాగాల్లో కమిటీలను ఏర్పాటు చేసి పార్టీ శ్రేణులను కార్యాచరణలోకి తీసు కురావాలని సూచించారు. కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని, పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యక ర్తకు తగిన అవకాశం దక్కేలా కూర్పు ఉండాలని స్పష్టం చేశారు. మండల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్ర మాలను ముందుకు నడి పించాలని సూచించారు. ప్రజల్లోకి ప్రభు త్వ పాలన..కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ను ప్రతి గ్రామానికి చేరవేయాలని రాజీ వ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యక్ర మాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ప్రజాపాలన ఫలాలను ప్రజలకు వివరిం చాలని సూచించారు. పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని అన్నారు. ప్రభుత్వ కా ర్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామం.. మండలం.. నియోజకవర్గం.. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్య క్రమాలను గ్రామస్థాయి నుంచి మరింత ఉధృతం చేయాలని రాజీవ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేసేలా మండల అధ్యక్షులు కార్యాచ రణ రూపొందిం చాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సంస్థాగతంగా పార్టీకి బలమైన పునాది ఏర్పడితేనే ప్రజల్లో మరింత విశ్వాసాన్ని సాధించగలమని పేర్కొన్నారు. డీసీసీ ఎగ్జిక్యూటివ్ భేటీ సమావేశంలో డీసీసీ కమిటీ వైస్ ప్రెసి డెంట్లు మద్దిలేటి, గట్టు గౌస్, జనరల్ సెక్రెటరీలు శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, సంకపురం రాముడు, మధు నాయుడు, నాగేష్, నర్సిరెడ్డి, నర్సింహులు, టీపీసీసీ సోషల్ కోఆర్డినేటర్ ధరూర్ రవి, నూతన మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యం

- **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామాల అభివృద్ధి**
- **పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీడీకే అరుణ --ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**
- **జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 4(వుదయం ప్రతినిధి)**

సూరారం గ్రామ సమగ్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్ప నకు ప్రత్యేక చొరవ తీసుకుంటామని మహబూబ్‌నగర్ ఎంపీ డి కె .అరుణ అన్నారు. బాలానగర్ మండలం సూరారం గ్రామ పంచాయతీలో రూ.2 కోట్ల 4 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌం డ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి శుక్ర వారం ఎంపీ డీకే అరుణ శంకుస్థాపన చేశారు. అనంతరం విగార్డ్ సంస్థ సీఎ స్ఆర్ నిధులతో నిర్మించిన సూరారం ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.పి డి. కె అరుణ మాట్లాడుతూ పార్టీలు వేరైనా గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ప్రజాప్రతినిధులం తా కలిసి పనిచేస్తున్నామని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోని 20 గ్రా మాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తీ సుకురావడం జరిగిందని తెలిపారు.5 గ్రామాలకు దాదాపు 7 కోట్ల 72 లక్షల నిధులు హెచ్చు ఎం .డి. ఏ ద్వారా తీసుకు వచ్చారని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని అభినందించారు.గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే త్రాగు నీరు ,లైటింగ్,డ్రైనేజీ,పరిశుభ్రత ముఖ్యం అన్నారు.సూరారం గ్రామం అభివృద్ధి లో ఆదర్శంగా నిలిచి, ఇతర గ్రామాల కు స్ఫూర్తిగా ఉండాలని ఆకాంక్షించా రు. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.శి థిలావస్థకు చేరిన సూరారం ప్రాథమిక పాఠశాల భవనం స్థానంలో విగార్డ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నూతన భవ నాన్ని నిర్మించినట్లు ఎంపీ తెలిపారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం తో పనిచేసినప్పుడే గ్రామాలు సమగ్రం గా అభివృద్ధి చెందుతాయని అన్నారు. వి.బి.జి.ఆర్.ఎం.జి. చట్టం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోం దని, మహిళా సంఘాలు, అంగన్‌వా డీలు, గ్రామ పంచాయతీ భవనాలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు తదితర పనులు చేప ట్టేందుకు అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిపై కలెక్ట ర్ ఉన్నతాధికారులను పంపించి సమ స్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల అభి వృద్ధికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ సూరారం గ్రామ అభి వృద్ధికి ఇప్పటివరకు రూ.2 కోట్ల 4 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర పనులు చేపట్టి గ్రామ మౌలిక వసతులను మెరుగుపరుస్తామని చెప్పారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా* మాట్లాడు తూ, సూరారం గ్రామ పంచాయతీని జిల్లాలో ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. హెచ్ఎండీఏ నుంచి ఒక గ్రామ పంచాయతీకి రూ.2.04 కోట్ల నిధులు మంజూరు కావడం అభినంద నీయమన్నారు.కార్యక్రమంలో బాలాన గర్ మార్కెట్ చైర్మన్, గుమ్మల అశ్వినీ, సూరారం గ్రామ సర్పంచ్ యాదమ్మ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అధి కారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- **వంగ రాజేశ్వర్ రెడ్డి**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన శ్రీ కాత్యాయని సమేత సిద్దేశ్వర స్వామి ప్ర తిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ కా ర్యక్రమానికి వంగ రాజేశ్వర్ రెడ్డి ము ఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు.స్వామివారి ఆశీస్సులతో



సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాల తో, ప్రశాంతంగా జీవించాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఆధ్యా త్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావం తో పాటు ఐక్యతను పెంపొందిస్తాయ ని పేర్కొన్నారు.ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రజల సహకారం ఎంతో అవసర మన్నారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేం దుకు దోహదపడతాయని తెలిపారు. ప్రతిష్ఠ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వా మివారి ఆశీస్సులు పొందారు.

# దద్దరిల్లిన బీఆర్ఎస్ పోరుబాట

- **కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై ఎమ్మెల్యే విజయుడు తీవ్ర విమర్శలు**

**అలంపూర్ సెప్టెంబర్ 04 (వుదయం కరస్పాండెంట్)**

కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు విమర్శిం చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచనతో శుక్రవారం అలంపూర్ చౌరస్తా, ఎర్రవల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వ ర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు ని ర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిందన్నారు. 1000 రోజులు గడిచినా హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని ఆరోపించా రు. రైతు భరోసా, రుణమాఫీ, మహిళల



కు రూ.2,500, నిరుద్యోగ భృతి వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు మందగించాయని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రజల తరఫున ప్ర భుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షు లు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, కా ర్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే విజయుడికి సంఘీభావం తెలిపారు.



90 గజాల అదనపు నిర్మాణానికి.. చర్యలు శూన్యం!

# డీపీఓ పొంతన లేని మాటలు

- **పత్రికల్లో వస్తేనే స్పందించాలా? అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

**సంగారెడ్డివుదయం :**

ప్రజా సమస్యలపై పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు జిల్లా స్థాయి అధికారు లు స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాల్సి ఉండగా, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వ్య వహరిస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. "పేపర్లో వస్తే స్పందించా లా? రోజుకు వంద వార్తలు వస్తాయి.. అలాగైతే ఉద్యోగం చేయలేను" అంటూ డీపీఓ చేసిన వ్యాఖ్యలు ప్రజలను, మీడియాను అవమానించేలా ఉన్నా యన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొండాపూర్ మండలానికి సంబంధించి రెండు నెలలుగా మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) లేకపోవడం పంచాయతీ వ్యవస్థ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. మండల స్థాయిలో కీల కమైన అధికారి లేకపోవడంతో గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమ స్యలు, ఫిర్యాదులు, అభివృద్ధి పనులు, అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు తలెత్తుతు న్నాయి.ఇదిలా ఉండగా, మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఒక ఇంటి నిర్మాణానికి సంబంధించి అనుమతు లకు విరుద్ధంగా నిర్మాణం జరిగింద న్న ఆరోపణలపై ఇటీవల పలు వార్తా కథనాలు వెలువడ్డాయి. ఈ వ్యవహారం పై జిల్లా పంచాయతీ అధికారిని వివరణ కోరగా, "ఇవన్నీ నాకు సంబంధం లేని విషయాలు.. కింది స్థాయి అధికారులు చూసుకోవాలి" అన్నట్టుగా సమాధానం ఇవ్వడం విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై జిల్లా స్థాయి అధికారి కనీసం వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉందని పలువురు పేర్కొంటున్నారు.ఒక సమస్యపై స్పష్టత కోరినప్పుడు బాధ్యతను కింది స్థాయి అధికారులపైకి నెట్టడం సరైన విధానం కాదని అంటున్నారు. అధికారుల పరిధిలో ఉన్న అంశాలపై బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మల్కా పూర్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణంపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించ డంతో పాటు, నిబంధనలు ఉల్లంఘిం చినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా స్థాయి అధికారి ప్రజల సమస్యల ను చిన్నచూపు చూడకుండా, మీడియా ద్వారా వెలుగులోకి వచ్చే అంశాలను కూడా పరిశీలించి సంబంధిత అధి కారులతో నివేదికలు తెప్పించుకోవా లని ప్రజలు కోరుతున్నారు. "రోజుకు వంద వార్తలు వస్తాయి" అనే ధోరణి కాకుండా.. ఒక్కో వార్త వెనుక ఉన్న ప్రజా సమస్యను గుర్తించి పరిష్కరిం చాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఘనంగా కుంకుమార్చన కార్యక్రమం



**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేటమండల కేంద్రంలోని పెద్ద మ్మ దేవాలయంలో శ్రావణ శుక్రవారం, శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో గ్రామ మహిళలచే కుంకుమార్చన కార్యక్రమా న్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తు లు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి ఆధ్వ ర్యంలో గ్రామ మహిళలచే కుంకుమా ర్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.అనంతరం గ్రామస్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, ముదిరాజ్ కులస్తులు, భక్తులు తదితరు లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'సూపర్ సిక్స్' హామీలు ఏమైనాయి?.. బిఆర్ఎస్ నిరసన గళం

- **బద్రేశ్వర్ చౌక్‌లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో 'వంటా-వార్పు' నిరసన**
- **హామీల అమల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలం: మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ధ్వజం**

**తాండూరు సెప్టెంబర్ 4 వుదయం ప్రతినిధి :**

ఎలక్షన్ల సమయంలో ఇచ్చిన అభూ తకల్పనల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన "సూపర్ సిక్స్" వాగ్దానాలను వి స్మరించిందని తాండూరు మాజీ ఎమ్మె ల్యే పైలట్ రోహిత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు తాండూరు పట్టణంలోని బద్రే శ్వర చౌక్ వద్ద బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి గురువారం భారీ 'వంటావార్పు' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపైనే వంటలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతి రేక విధానాలపై నిరసన తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి విలేకరులతో మాట్లాడు తూ కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించారు:

తులం బంగారం ఏమైంది?: ఆడబిడ్డల పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్ర శ్నించారు.

రూ. 2500 మహాలక్ష్మి సహాయం ఏది?: ప్రతినెల ప్రతి మహిళకూ రూ. 2,500 ఇస్తామని చెప్పి అధికారం చేపట్టి రోజులు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా అందించలేదని మండిపడ్డారు.

100 రోజుల్లో అమలు ఏదీ?: అధికా రంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను (సూపర్ సిక్స్) అమలు చేస్తామని విర వీగిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని విమర్శిం చారు. "కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైంది. హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించే యత్నం చేస్తోంది. రైతులు, మహిళలు, యువత అంతా కాంగ్రెస్ పాలనలో తీవ్రంగా నష్టపోతున్నారు," అని పైలట్ రోహిత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ నెరవేరే వరకు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా క్షేత్రంలో పోరాటాలు కొనసాగిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, రాజు గౌడ్, కౌన్సిలర్ దీపావ నర్సింలు, మాజీ కౌన్సిలర్ పర్మిల శోభారాణి, శకుంతల దేశ్పాండే,మహిళా విభాగం ప్రతిని ధులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరే కంగా నినాదాలు చేశారు.





# తలారి స్వదేశ్ కు సీఎంఆర్ చెక్కును అందచేత

- ఉప సర్పంచ్ పార్టీ పవన్ గుప్తా....

ఉదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 4....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధి లోని గంగాయిపల్లి గ్రామానికి చెందిన తలారి స్వదేశ్ కు ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురై రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో, కార్పొరేటర్ హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన స్వదేశ్‌కు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కృషితో తలారి స్వదేశ్ కు 58.500ల రూపాయలు మంజూరు కాగా పల్లె ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కను గంగాయ పల్లి గ్రామ ఉపసర్పంచ్ . బి ఆర్ ఎస్ మండల యువత విభాగం అధ్యక్షుడు తాటి పవన్ గుప్త చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పవన్ గుప్త మాట్లాడుతూ ఈ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేయించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి బాధితుల తరపున మా తరపున కృతజ్ఞతలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నాగరాజు హుస్సేన్ మరియు యాదగిరి నర్సింలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు గాలికి.. హామీలు కాగితాలకే





- 420 హామీలు ఎక్కడ..? డబుల్ బెడ్‌రూమ్ సమస్యలు ఎప్పుడు..?

ఉదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 4)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీల అమలులో వైఫల్యం, తాగునీరు, విద్యుత్, బస్తీ దవాఖానాల సమస్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం మండలం కొల్లూరు కేసీఆర్ నగర్ ఫేజ్ 02లో నిర్వహించిన కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగంపేట ఫోరం మాజీ అధ్యక్షుడు, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, PACS చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..**

కేసీఆర్ నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

**ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ..**

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మహిళలు, రైతులు, యువత, పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఆయకట్టు చైర్మన్ వడ్డె నర్సింహ, మాజీ సర్పంచ్ యాదయ్య, వెంకటరామిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, శ్రీశైలం, నాగరాజు, ఉమేష్, బాల్లి, లచ్చిరామ్ నాయక్, PACS డైరెక్టర్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ గుద్ద సాగర్, మాజీ టెలిఫోన్ బోర్డు మెంబర్ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, వెలిమెల నాయకులు కొమరయ్య, నాగిరెడ్డి, ప్రభాకర్, బీఆర్ఎస్వీ నాయకులు చెన్నారెడ్డి, కేసీఆర్ నగర్ ఫేజ్ 1&2 బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత



- బుద్ధుల బిక్షపతి ముదిరాజ్....

ఉదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 4....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధి లోని దొంతి గ్రామానికి చెందిన పనగారి సత్తయ్య కార్పొరేట్ హాస్పిటల్ లో చికిత్స పొంది ఇటీవలే ఇంటి వద్ద రెస్టు తీసుకున్న సమయంలో మందు గోలీల అవసరపడే విధంగా . నర్సాపూర్ శాసన సభ్యురాలు వాకిటి సున్నితా లక్ష్మారెడ్డి చిరువతో 45000ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కావడంతో నేడు బాధితుడికి దొంతి మాజీ కోప్షన్ సభ్యులు లాయక్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ మండల ప్రచార కమిటీ అధ్యక్షులు తొమ్మిదవ వార్డ్ సభ్యులు బుద్ధుల బిక్షపతి. పిట్ల కృష్ణ లతో కలసి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ యూత్ ప్రెసిడెంట్ కైప్ పాల్గొన్నారు. సత్తయ్య కుటుంబ సభ్యుల తరఫున మాకు మంజూరు చేయించిన నర్సాపూర్ ఎమ్మెల్యే చింత లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# జగద్గురు నీలకంఠ మహాస్వామి వారి చతుర్ధ పుణ్యాస్మరణ ఉత్సవం



- జగద్గురు నీలకంఠ మహాస్వామి చతుర్ధ వార్షిక పుణ్యా స్మరణోత్సవం

సదాశివపేట ఉదయం

సదాశివపేట పట్టణంలోని పెద్ద మఠం పీఠాధిపతులు నిరంజన ప్రణవ స్వరూపులు జగద్గురువులు నీలకంఠ మహాస్వామి వారి చతుర్ధ వార్షిక పుణ్య స్మరణోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయము ఎనిమిది గంటలకు స్థానిక పెద్దమటము నుండి శివనామస్మరణతో మహేశ్వరి టాకీస్ వద్ద ఉన్నటువంటి గురువుగారి గదిగే వరకు చేరుకొని గురు ప్రార్ధన మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించినట్లు పెద్ద మఠం నిర్వాహకులు లింగానంద్ స్వామి అన్నారు. ధార్మిక కార్యక్రమంలో ష.బ్ర.108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి ధనసిరి, డాక్టర్ రంజోలు రాచయ్య స్వామి ధార్మిక సందేశాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఎడ్ల బజార్ అధ్యక్షులు గందిగె రాజు,వీరశైవ సమాజం చౌకీమఠం అధ్యక్షులు చీల మల్లన్న ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, ఎడ్ల బజార్ సమాజం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్మిశెట్టి జయప్రకాష్, జంగం మహేష్ స్వామి, అమరాధి రచన్న,వీర మహేందర్, సురేష్, వైద్యనాథ్, లోకేష్, వీరన్న, మరియు అర్చక స్వాములు ,సమాజ సభ్యులు మరియు అర్చక బృందం భక్తాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని నీలకంఠ మహాస్వామి వారి పాదపద్మములకు నమస్కరించి తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలియజేశారు.

# లోకపల్లి ఆలయంలో విశేష పూజలు



- శ్రీకృష్ణుని వేషాధారణలో ఆకట్టుకున్న చిన్నారి

నారాయణపేట టౌన్ సెప్టెంబర్ 4(ఉదయం ప్రతినిధి)

నారాయణపేట మండలం శ్రీ లోకాయపల్లి సంస్థానంలో వెలసిన లక్ష్మమ్మ మాత, శ్రీకృష్ణ జన్మాష్టమి శ్రావణ శుక్రవారం రావడం తో సంస్థానంలో వెలిసిన శ్రీకృష్ణ దేవాలయం, కోట ఆంజనేయస్వామి దేవాలయం, శ్రీ కాళి మాత దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధల తో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఒడిలను నింపి మొక్కుబడులు తీర్చుకోవడం జరిగింది. శ్రీ కాళి మాత దేవాలయ అభివృద్ధికి ఆలయ కమిటీ అధ్యక్షులు శశికాంత్ యాదవ్ నూతనంగా బండలు వేసి, స్టీల్ రైలింగ్ పనులు పూర్తి చేయించారు. అదే విధంగా ఈరోజు సంస్థానంలో వెలిసిన శ్రీకృష్ణ దేవాలయంలో భక్తులు రద్దీగా ఉండి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు శశికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులు కన్న జగదీష్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, లడ్డి రాధాకృష్ణ, కార్యదర్శి మధుసూదన్ రెడ్డి , కోశాధికారి లప్ప అశోక్, పిల్లి నరసింహులు, పెద్ద రాంరెడ్డి, గొల్ల బుగ్గన, సంతోష్ నామాజీ, బోయ మహేష్ కుమార్, మరియు శ్రీ లోకపల్లి లక్ష్మి మాత మహిళా సమితి సభ్యులు పాల్గొన్నారు.వచ్చే శుక్రవారం సెప్టెంబర్ 11 తేది నాడు జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు, అదే రోజు అన్న ప్రసాద కార్యక్రమం, నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఓ చిన్నారి శ్రీకృష్ణుని వేషాధారణతో పలువురిని ఆకట్టుకున్నది. కృష్ణాష్టమి సందర్భంగా వివిధ వార్డులలో ఉట్టి కొట్టే కార్యక్రమాల్ని సాయంత్రం నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు చిన్నారులు శ్రీకృష్ణుని వేషాధారణలతో పలువురిని ఆకట్టుకున్నారు.

# కొప్పునూరు గ్రామం లో కృష్ణనామ స్మరణతో మార్మోగిన వేడుకలు

- యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు
- భక్తి శ్రద్ధలతో పాల్గొన్న గ్రామస్థులు, యాదవ సంఘం సభ్యులు

చిన్నంబావి మండలం 04 (ఉదయం రిపోర్టర్)







శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూరు గ్రామంలో యాదవ సంఘం అధ్యక్షులు బడికల పెద్దబాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ కృష్ణుని నామస్మరణతో గ్రామం మార్మోగగా, భక్తి పారవశ్యంతో గ్రామస్థులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భక్తి కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. భక్తి సంప్రదాయం సంబరం శ్రీ కృష్ణుని లీలలను స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఎద్దుల బండ్లతో ఊరేగింపు బ్రహ్మాండంగా నిర్వహించారు. కొప్పునూరు గ్రామ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచేలా ఘనంగా నిర్వహించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన యాదవ సంఘం సభ్యులను పలువురు అభినందించారు. యాదవ్ కమిటీ అధ్యక్షులు బడికల పెద్ద బాలు, ఆనంద్ యాదవ్, కోటే రాంచంద్రయ్య, చటమోని కాశన్న, కంది నరసింహ, మధుకం కాశన్న, కంది మద్దిలేటి, కొట్టే భగవంతు, బడికల బాబు, కంది పెద్ద మద్దిలేటి, బడికల అశోక్, పసుల భారత్, జ్వాల బిచ్చన్న, బొల్లు మద్దిలేటి, బడికల విజయ్, చెల్లెపాడు బాలేశ్వరయ్య, బింగి శాలయ్య, బడికల శ్రీనివాసులు, బన్నూరు చిన్నయ్య, బడికల మహేష్, బడికల లింగస్వామి, పాండు కుమార్, జాల నరేష్, కంది శ్రీనివాసులు, కోటే కృష్ణయ్య, దగడ బిచ్చన్న , బింగి పెద్ద మద్దిలేటి, బడికల మల్లేష్, మంచాలకట్ట ఉషేన్, కంది నవీన్, ఇటిక్యాల మహేష్, సాయి కుమార్, కిరణ్ కుమార్, జలా రవి, ఇటిక్యాల రాము, ఎలుక కురుమూర్తి, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సుకు అందరూ ఆహ్వానితులే



- ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి
- ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు

ఉదయం మనూర్

విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సుకు అందరూఆహ్వానితులే అని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ డి.ఓంప్రకాష్ అన్నారు. ఈ నెల 6వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పూలే మార్ట్, మహిళా ప్రాంగణం, బైపాస్ రోడ్, జైత్ర ఆసుపత్రి పైభాగంలో నిర్వహించనున్న విద్యా హక్కు చట్టం అవగాహన సదస్సుకు జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలు, హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ నవోదయ సి

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్ద శంకరంపేట: (ఉదయం) ప్రతినిధి సెప్టెంబర్ 04

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనకు నిరసనగా శుక్రవారం పెద్ద శంకరంపేట గాంధీ చౌరస్తా వద్ద బీ.ఆర్.ఎస్. ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎన్నికల ముందు మహిళలకు నెలకు రూ. 2,500, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి.. అధికారంలోకి వచ్చాక మాటలతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజల ముందు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలన్నింటినీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా పోరాటం కొనసాగిస్తామని భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్, మండల బీఆర్ఎస్ నాయకులు సురేష్‌గౌడ్, బీ.దత్తు, సుభాష్, వెంకటరెడ్డి, మాణిక్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

# థియేటర్ల మనుగడ కోసం ప్రభుత్వంతో చర్చలు, 5 ఏళ్ల కాలపరిమితితో సింగిల్ విండో విధానంలో లైసెన్స్ రెన్యూవల్స్

- : APFDC చైర్మన్ భరత్ భూషణ్



ఆంధ్రప్రదేశ్ సినీ ఎగ్జిబిటర్ల ఫోరమ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ భరత్ భూషణ్‌కు విజయవాడలో ఎగ్జిబిటర్లు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం రాష్ట్రంలోని థియేటర్లు, ఎగ్జిబిటర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై భరత్ భూషణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఫైర్, సినిమాటోగ్రఫీ తదితర శాఖల లైసెన్సుల గడువులు వేర్వేరుగా ఉండటంతో ఎగ్జిబిటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అన్ని శాఖలకు ఒకే విధంగా 5 ఏళ్ల కాలపరిమితితో సింగిల్ విండో విధానంలో లైసెన్స్ రెన్యూవల్స్ ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడామని, ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన ఉందని భరత్ భూషణ్ తెలిపారు. ఎఫ్‌డీసీలో ఎగ్జిబిటర్లు మెంబర్‌షిప్ తీసుకోవాలని సూచించారు. ఎగ్జిబిటర్లందరూ కలిసి ఉంటే తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం మరింత సులభమవుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,197 మంది ఎగ్జిబిటర్లను గుర్తించామని, ప్రతి ఎగ్జిబిటర్ సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తామని భరత్ భూషణ్ పేర్కొన్నారు. కేవలం టికెట్ ధరలు పెంచడం ఒక్కటే పరిష్కారం కాదని, థియేటర్ల నిర్వహణ, వ్యాపారం సజావుగా కొనసాగేందుకు అవసరమైన పరిస్థితులను కల్పించడం కూడా ముఖ్యమని చెప్పారు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో 2,000కు పైగా థియేటర్లు ఉండేవని, ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు 1,200కు పడిపోయిందని భరత్ భూషణ్ తెలిపారు. ముఖ్యంగా గత 3-4 నెలల్లోనే సుమారు 400 థియేటర్లు మూతపడ్డాయని చెప్పారు. టికెట్ ధరల పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, అయితే వెంటనే శాశ్వత జీవో వస్తుందని ఎవరూ ఆశించవద్దని ఆయన అన్నారు. ఎగ్జిబిటర్లకు టికెట్ ధరలు పెంచే అంశంపై ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. టికెట్ రేట్ల పెంపు విషయంలో అత్యాశకు పోకుండా మార్కెట్ పరిస్థితులను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. టూరిజం, హోటల్ రంగాలకు వర్తింపజేస్తున్న విధంగానే సినిమా రంగానికి, థియేటర్లకు కూడా ఇండస్ట్రియల్ పవర్ టారిఫ్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని భరత్ భూషణ్ అన్నారు. పెరుగుతున్న ఉద్యోగుల జీతాలు, విద్యుత్ ఛార్జీలు, థియేటర్ల ఆధునీకరణ ఖర్చులను దృష్టిలో పెట్టుకుని నిర్వహణ ఛార్జీలను కొంత మేర పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అనే తేడా లేకుండా అన్ని కేటగిరీల థియేటర్లకు ప్రజలకు అందుబాటులో ఉండేలా యూనిఫామ్ టికెట్ ధరలను సమీక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. థియేటర్ల సమస్యల పరిష్కారానికి ఎగ్జిబిటర్లు, నిర్మాతలు, ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.



# పేట లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పెద్ద శంకరంపేట (ఉదయం ) ప్రతినిధి సెప్టెంబర్ 04

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం పెద్ద శంకరంపేట లోని శ్రీ సరస్వతి శిశు మందిర్, సంస్కార్ విద్యాలయంలో సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కనుల పండుగగా నిర్వహించారు. పలువురు చిన్నారులు చిన్ని కృష్ణుడు వేషధారణలతో విద్యార్థినిలు, గోపికల వేషధారణలతో కోలాటాలు ఆడుతూ పాటలు పాడుతూ పెద్దల సమక్షంలో ఉట్టిని కొట్టించారు. చిన్నారులకు శ్రీకృష్ణ తులాభారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి పంతులు, వేణు గౌడ్, కనకరాజు, కందుకూరి రవీందర్, రాజశేఖర్ రెడ్డి, సంస్కార్ విద్యాలయ కరస్పాండెంట్ సీతారామారావు, ప్రధానాచార్యులు కవిత, రేఖ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను హరిగోశ పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్
- మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకట్రావమ్మ చిన్నారెడ్డి
- మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి
- ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి

చిన్నంబావి మండలం 04 (ఉదయం రిపోర్టర్)









చిన్నంబావి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన కార్యక్రమం, రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేసింది అని ఇంటింటికి వెళ్లి రైతులను వివరాలు అడిగి తెలుసుకోవడం వంటి కార్యక్రమం నిర్వహించారు. మండల సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ది దగాకోరు పాలన అని బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరిస్తూ రైతులను అన్ని విధాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆరు గ్యారంటీలు,420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ మాజీ జడ్పిటిసి, మాజీ ఎంపీపీ, ఉమ్మడి మండలాల ఇంచార్జ్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. సందర్భంగా సీనియర్ నాయకులు గజ్జే ఈదన్న యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కేశిరెడ్డి చిన్నారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చిన్నంబావి మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నిరసన కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. రైతులకు బోనస్ ఏమైంది రైతులకు ధాన్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు కల్లాల్లో ధాన్యాన్ని నిల్వ చేసుకుని రోజుల తరబడి కొనుగోళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వడ్డేమాన్ రామకృష్ణ మాట్లాడుతూ ఎల్‌నినో పేరుతో పంటలు వేయొద్దంటూ రైతులను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. యూరియా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనతో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. దేగ శేకర్ యాదవ్ మాట్లాడుతూ కొంతమంది రైతులు చదువు, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. పింఛన్ల హామీపై విమర్శలు వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అయితే కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తగరం ఆటో కుర్మయ్య మాట్లాడుతూ ఉన్న పింఛన్ల విషయంలోనూ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న 420 హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకటరమణమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు గజ్జె ఈదన్న యాదవ్, దేగ శేకర యాదవ్, వడ్డేమాన్ రామకృష్ణ, తగరం ఆటో కుర్మయ్య, అనంత జయ గౌడ్, గొంది నిరంజన్ రెడ్డి, కంచి కరుణాకర్, మేకల మై చంద్ర, జింకల రమేష్ నాయుడు, బాలా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# టీకాల వివరాలను యువిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి



- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి

గద్వాల సెప్టెంబర్ 04 (ఉదయం కరస్పాండెంట్)

జోగులాంబ గద్వాల జిల్లాలో జాతీయ టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు పిల్లలకు అందిస్తున్న టీకాల వివరాలను యువిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. జె. సంధ్యా కిరణ్మయి సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా. అస్గర్ అలీ సందేశం మేరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది టీకాల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు. జాతీయ స్థాయిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించడంతో పాటు, ప్రతి చిన్నారికి అందుతున్న టీకాల వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉండేందుకు యువిన్ పోర్టల్‌లో నమోదు చేయడం ఎంతో కీలకమని తెలిపారు. పిల్లలకు పుట్టిన నాటి నుంచి 17 సంవత్సరాల వయస్సు వరకు జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం అందించాల్సిన అన్ని టీకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సకాలంలో వేయించాలని సూచించారు. ఎలాంటి టీకా వివరాలు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఇతర సంబంధిత సిబ్బందికి సూచించారు. పిల్లల టీకాల చరిత్రను సులభంగా గుర్తించేందుకు, భవిష్యత్‌లో అవసరమైన టీకాలను సకాలంలో అందించేందుకు యువిన్ పోర్టల్ నమోదు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పోరుబాటలో దొంగల చేతివాటం



- కొల్లూరు పోలీసులకు బాధితుల విజ్ఞప్తి..

ఉదయం, తెల్లాపూర్ ప్రతినిధి (సెప్టెంబర్ 4)

రామచంద్రాపురం మండలం కొల్లూరు కేసీఆర్ నగర్ ఫేజ్ 02లో శుక్రవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ 420 హామీలపై బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమంలో చోరీ ఘటన జరిగింది. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, లబ్ధిదారులు హాజరైన నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు జనాల్లో కలిసిపోయి చేతివాటం ప్రదర్శించినట్లు బాధితులు తెలిపారు. ప్రజల మధ్యే ఉండి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కొల్లూరు పోలీసులను కోరుతున్నారు. కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజల భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# చక్కని ఆరోగ్యం

## బరువు తగ్గడంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంచే హై-ఇంటెన్సిటీ వ్యాయామాలు..



బరువు నియంత్రణతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలని కోరుకునేవారిలో ప్రస్తుతం హై-ఇంటెన్సిటీ వర్కౌట్స్‌కు ఆదరణ పెరుగుతోంది. వీటిలో క్రాస్‌ఫిట్ కూడా ఒకటి. తక్కువ సమయంలో ఎక్కువ శారీరక శ్రమను అందించే ఈ వ్యాయామ విధానంలో బలాన్ని పెంచే వ్యాయామాలతోపాటు కార్డియో, జిమ్నాస్టిక్స్, రోజువారీ కదలికలకు ఉపయోగపడే ఫంక్షనల్ మూవ్‌మెంట్స్‌ను కలిపి చేస్తారు. సరైన పద్ధతిలో, వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా వ్యాయామాలను మార్చుకుంటూ చేస్తే బలం, కార్డియోవాస్కులర్ ఫిట్‌నెస్ రెండింటినీ మెరుగుపరచడంలో క్రాస్‌ఫిట్ సహాయపడుతుంది. క్రాస్‌ఫిట్‌లో వివిధ రకాల ఫంక్షనల్ మూవ్‌మెంట్స్‌ను భిన్నమైన తీవ్రతలతో చేస్తారు. సాధారణంగా ఒక సెషన్‌లో ముందుగా వార్మప్, ఆ తర్వాత టెక్నిక్ లేదా స్ట్రెంగ్త్ ట్రైనింగ్, అనంతరం పలు వ్యాయామాలను కలిపిన వర్కౌట్ ఉంటుంది. ఇందులో స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, పుష్-అప్స్, పుల్-అప్స్, బర్పీస్, కెటిల్‌బెల్ స్వింగ్స్, రోయింగ్, రన్నింగ్, బాక్స్ జంప్స్, ఒలింపిక్ లిఫ్ట్స్ వంటి వ్యాయామాలు కూడా ఉంటాయి. క్రాస్‌ఫిట్ వర్కౌట్స్‌ను వ్యక్తి ఫిట్‌నెస్ స్థాయికి అనుగుణంగా మార్చుకోవచ్చు. అంటే మొదటిసారి క్రాస్‌ఫిట్ ప్రారంభించే వ్యక్తి అనుభవజ్ఞుడైన అథ్లెట్ చేసేంత బరువుతో లేదా అదే స్థాయిలో వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదు. బరువు, వ్యాయామం కష్టం, పునరావృతాల సంఖ్య వంటి అంశాలను వ్యక్తి సామర్థ్యానికి అనుగుణంగా సర్దుబాటు చేసుకునే వీలు ఉంది. క్రాస్‌ఫిట్‌లో స్క్వాట్స్, డెడ్‌లిఫ్ట్స్, ప్రెస్‌లు, ఒలింపిక్ లిఫ్ట్స్ వంటి రెసిస్టెన్స్ వ్యాయామాలకు ముఖ్యమైన స్థానం ఉంటుంది. ఇవి కండరాలు ప్రతిఘటనకు వ్యతిరేకంగా బలాన్ని ఉపయోగించేలా చేస్తాయి. క్రమంగా శిక్షణను పెంచుకుంటూ వెళ్లడం వల్ల కండరాల బలం, శక్తి మెరుగుపడుతుంది. ముఖ్యంగా ఒకేసారి అనేక కండరాలు, కీళ్లను ఉపయోగించే కాంపౌండ్ వ్యాయామాలు శారీరక బలాన్ని పెంచడంలో ఉపయోగపడతాయి. అయితే గరిష్ఠ స్థాయిలో బలం పెంచుకోవడం ప్రధాన లక్ష్యంగా ఉన్న వారికి భారీ బరువులతో ప్రత్యేకంగా రూపొందించిన స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరింత అనుకూలంగా ఉంటుంది.

క్రాస్‌ఫిట్ కార్డియోవాస్కులర్ ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇందులో తక్కువ విశ్రాంతి వ్యవధులతో వరుసగా అధిక తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. రన్నింగ్, రోయింగ్, సైక్లింగ్, జంపింగ్, బాడీవెయిట్ మూవ్‌మెంట్ వంటి వ్యాయామాల వల్ల గుండె వేగం పెరుగుతుంది. క్రమం తప్పకుండా ఏరోబిక్, హై-ఇంటెన్సిటీ వ్యాయామాలు చేయడం వల్ల కార్డియోవాస్కులర్ ఫిట్‌నెస్, వ్యాయామ సామర్థ్యం మెరుగుపడుతుంది. అయితే అధిక తీవ్రత కలిగిన వ్యాయామమే అన్ని రకాల ఏరోబిక్ కార్యకలాపాలకు ప్రత్యామ్నాయం కాదు. వేగంగా నడవడం, సైక్లింగ్ లేదా స్థిరమైన వేగంతో పరుగెత్తడం వంటి మితమైన తీవ్రత కలిగిన వ్యాయామాలు కూడా గుండె ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. క్రాస్‌ఫిట్ వర్కౌట్ ఎక్కువగా కష్టంగా అనిపించడానికి ప్రధాన కారణం ఒకదాని తర్వాత మరొక వ్యాయామాన్ని తక్కువ విశ్రాంతి సమయంలో చేయడమే. ఉదాహరణకు స్క్వాట్స్ చేసిన వెంటనే రోయింగ్, బర్పీస్ వంటి వ్యాయామాలు చేయాల్సి వస్తుంది. ఒకేసారి శరీరంలోని అనేక కండరాలు పనిచేయడంతో పాటు గుండె వేగం కూడా ఎక్కువగా ఉండటంతో వర్కౌట్ మరింత శ్రమతో కూడుకున్నదిగా అనిపిస్తుంది. అయితే బరువు, పునరావృతాలు, వ్యాయామం కష్టం, వర్కౌట్ వ్యవధి, విశ్రాంతి సమయాలను మార్చడం ద్వారా తీవ్రతను తగ్గించే లేదా పెంచే వీలు ఉంది. బరువు నియంత్రణలో కూడా క్రాస్‌ఫిట్ కొంత సహాయపడుతుంది.

## నిద్రలేమి సమస్యకు మెగ్నీషియం లేదా మెలటోనిన్.. ఏది చక్కగా పనిచేస్తుంది..

నిద్ర సరిగా లేకపోవడం రోజువారీ జీవనశైలిపై మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుంది. నిద్రలేమి సమస్యలను ఎదుర్కొంటున్నవారు మెగ్నీషియం, మెలటోనిన్ వంటి సప్లిమెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ రెండూ ఒకే విధంగా పనిచేయవు.




నిద్ర సమస్యకు కారణం శరీరంలో ఉన్న లోపాలు, నిద్ర సమయం వంటి అంశాలను బట్టి వీటి ప్రయోజనం మారుతుంది. శరీరానికి అవసరమైన ముఖ్యమైన ఖనిజాల్లో మెగ్నీషియం ఒకటి. ఇది 300కు పైగా జీవ రసాయన ప్రక్రియల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా నాడీ వ్యవస్థ పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, నిద్ర, విశ్రాంతికి సహాయపడే గాబా (GABA) అనే న్యూరోట్రాన్స్‌మిటర్ నియంత్రణలోనూ భాగస్వామ్యం వహిస్తుంది. శరీరంలో మెగ్నీషియం స్థాయిలు తక్కువగా ఉన్నవారికి దీని సప్లిమెంటేషన్ కొంత ప్రయోజనం కలిగిస్తుంది. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ నిద్ర సమస్యలు ఎదుర్కొనే వృద్ధులు, ఒత్తిడి కారణంగా నిద్ర సరిగా పట్టని వారు మెగ్నీషియం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇది కండరాల ఒత్తిడిని, శరీరంలోని టెన్షన్‌ను తగ్గించి విశ్రాంతికి సహాయపడుతుంది. మరోవైపు, మెలటోనిన్ అనేది మెదడు సహజంగా ఉత్పత్తి చేసే హార్మోన్. సాధారణంగా నిద్రపోయే సమయం దగ్గరపడినప్పుడు దీని ఉత్పత్తి పెరుగుతుంది. శరీరంలోని అంతర్గత జీవ గడియారాన్ని నియంత్రించడంలో మెలటోనిన్ కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి నిద్ర సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్రలోకి వెళ్లేందుకు సహాయపడుతుంది. జెట్ లాగ్ కారణంగా నిద్ర సమయం మారిపోయినవారికి మెలటోనిన్ ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అలాగే షిఫ్ట్ ఉద్యోగులు, నిద్ర సమయం ఆలస్యంగా మారిపోయినవారు, శరీరంలోని సహజ నిద్ర-మెళకువ చక్రంలో మార్పులు వచ్చినవారికి కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మెగ్నీషియం, మెలటోనిన్ రెండూ నిద్రకు సహాయపడినా వాటి పనితీరు భిన్నంగా ఉంటుంది. మెగ్నీషియం ప్రధానంగా శరీరం, కండరాలు విశ్రాంతి పొందేందుకు, నాడీ వ్యవస్థలోని కొన్ని ప్రక్రియలను నియంత్రించేందుకు సహాయపడుతుంది. మెలటోనిన్ మాత్రం శరీరానికి నిద్రపోయే సమయం వచ్చిందనే సంకేతాన్ని అందించడం ద్వారా నిద్ర చక్రాన్ని సరిచేయడంలో సహాయపడుతుంది. నిద్రపట్టకపోవడానికి ప్రధాన కారణం శరీరం లేదా మనసు రిలాక్స్ కాకపోవడం అయితే మెగ్నీషియం కొంత ఉపయోగపడుతుంది. నిద్ర సమయం పూర్తిగా మారిపోవడం, రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం వంటి సమస్యలు ఉంటే మెలటోనిన్ మరింత అనుకూలంగా ఉండే అవకాశం ఉంటుంది. మెలటోనిన్ సాధారణంగా మెగ్నీషియంతో పోలిస్తే వేగంగా ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మెగ్నీషియం, మెలటోనిన్ రెండింటినీ కలిపి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వైద్య నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. సొంతంగా అధిక మోతాదులో తీసుకోవడం వల్ల అవాంఛిత దుష్ప్రభావాలు కలిగిస్తుంది. మెగ్నీషియంను అధిక మోతాదులో తీసుకుంటే విరేచనాలు, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. కొన్ని మందులతో ఇది పరస్పర చర్యలకు కూడా కారణం అవుతుంది.

## ఆరోగ్యానికి చిట్టి క్యాబేజీ...



మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇల్లు ఆనందాల హరివిల్లు అవుతుంది. ఇందుకోసం పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. అలాంటి వాటిల్లో బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ ఒకటి. చిట్టి క్యాబేజీగా పిలిచే ఇవి అందించే ప్రయోజనాలెన్నో...

బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లో ఉండే డీఐఎమ్ అనే ప్రత్యేక సమ్మేళనం... శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ మెటబాలిజాన్ని క్రమబద్ధీకరించడంలో తోడ్పడుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే కడుపునొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యల నుంచి ఉపశమనం అందిస్తుంది.

గర్భస్థ శిశువు... మెదడు, వెన్నెముక సక్రమంగా ఎదగడానికి ఫోలేట్ అత్యంత అవసరమైన పోషకం. బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లో ఇది సహజంగా, సమృద్ధిగా లభిస్తుంది. అలానే, గర్భస్రావం జరిగే ప్రమాదాన్ని తగ్గించడమే కాకుండా, పుట్టబోయే బిడ్డల్లో జన్యుపరమైన లోపాలు రాకుండా కాపాడుతుంది.

వయసు పెరిగే కొద్దీ, ముఖ్యంగా మెనోపాజ్ దశకు చేరుకున్న మహిళల్లో ఎముకలు బలహీనపడటం, ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రావడం సహజం. దాంతో స్వల్ప గాయాలకే అవి విరిగిపోతుంటాయి. అలాకాకుండా బ్రస్సెల్స్ స్ప్రౌట్స్‌లోని విటమిన్ కె సంరక్షిస్తుంది.

ఇక, వీటిల్లో ఉండే విటమిన్-సి, శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. కొలాజన్ ఉత్పత్తిని పెంచి ముడతలు రాకుండా నివారిస్తాయి. శరీరంలో పేరుకుపోయే హానికర రసాయనాలను తొలగించి, రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి, మలబద్ధకం దరిచేరదు. అయితే, వీటిని కేవలం ఆవిరి మీద ఉడికించి, పైన కొద్దిగా ఆలివ్ ఆయిల్, ఉప్పు చల్లి రోస్ట్ చేసుకుంటే సరి. ఇందులోని పోషకాలు నశించవు. అయితే, థైరాయిడ్ సమస్యలు ఉన్నవాళ్లు, రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్న వాళ్లు మాత్రం వైద్యుల సలహాతో పరిమితంగా తీసుకోవడం మంచిది.

## మేకప్‌లో ఈ రూల్ పాటిస్తున్నారా?

ఆఫీసు లేదా ఫంక్షన్‌కి వెళ్లడానికి రెడీ అవుతామా! ఫేస్ క్రీమ్ దొరికితే... లిప్‌స్టిక్ దొరకదు... ఈ రెండూ దొరికితే ఐలైనర్ కనిపించదు. దాంతో డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు మొత్తం వెతికేస్తాం. కావాల్సిన వస్తువులు ఒకటికి రెండున్నా సమయానికి చేతికి దొరక్కపోతే... ఆ టైమ్‌లో చిరాకు రాకమానదు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే 'మేకప్ డ్రాయర్ రూల్' పాటించి చూడండి. ఈ పద్ధతిలో సౌందర్య ఉత్పత్తుల్ని సర్దుకుంటే వస్తువులు త్వరగా దొరకడంతోపాటు



ముస్తాబయ్యే సమయం కూడా ఆదా అవుతుంది. దీనికోసం ఏంచేయాలంటే... సన్‌స్క్రీన్, కాజల్, లిప్‌స్టిక్... రోజూ వాడేవే కాబట్టి వీటిని ముందు భాగంలో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు వాడే ఐషాడో ప్యాలెట్లు, బ్రైట్ షేడ్స్ వంటివి వెనక భాగంలో సర్దుకుంటే పని సులువవుతుంది.

కొన్ని మేకప్ వస్తువులకు గడువు తేదీ ఏడాది ఉంటే... మరికొన్ని మూడు నాలుగు నెలల్లోనే ఎక్స్‌పైర్ అయిపోతాయి. గడువు ముగిసినా వాటిని బయటపడేయకుండా... కొత్తగా తెచ్చుకున్నవి వాటితో కలిపేస్తుంటాం. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే గడువు చెల్లిన వాటిని తొలగించాకే కొత్తవాటిని సర్దుకోవాలి. ఒక్కోసారి హడావుడిలోపడి మేకప్ పూర్తయ్యాక వాటి మూతలు పెట్టకుండా ర్యాక్‌లో పడేస్తుంటాం. దీనివల్ల అవి ఇతర సామగ్రికి అంటుకొని సొరుగు మొత్తం చిందరవందరగా కనిపిస్తుంది. అంతేకాదు, వాటిల్లోకి తేమ చేరి బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఎక్కువ. అందుకే మేకప్ పూర్తికాగానే మూత పెట్టడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. మేకప్ అంటే స్కిన్ కేర్ ఒక్కటేనా.. హెయిర్ కేర్ కూడా ఉంటుంది కదా. ఈ రెండు రకాల ఉత్పత్తులనీ కలపొద్దు అంటున్నారు సౌందర్య నిపుణులు. ఒకవేళ ఒకేచోట ఉంచితే రెండింటి మధ్యా పార్టిషన్ ఉండేలా డ్రా ఆర్గనైజర్ ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడే చూడ్డానికి అందంగానూ వాడుకోవడానికి వీలుగానూ ఉంటుంది.

## ఆ మచ్చలు.. పోవాలంటే..!

సౌందర్య పోషణలో భాగంగా హెయిర్ డైలు వేసుకోవడం సహజం. అయితే కొన్ని సందర్భాల్లో కొన్ని రకాల రంగులు చర్మానికి అంటుకుని అక్కడ మచ్చలు పడతాయి. వీటిని తొలగించడంలో కొన్ని ఇంటి చిట్కాలు సమర్థంగా పనిచేస్తాయంటున్నారు సౌందర్య నిపుణులు. వినెగర్‌లో ముంచిన కాటన్ బాల్‌తో మచ్చలు పడిన చోట రుద్దడం వల్ల అవి పోయే అవకాశం ఉంటుంది అంటున్నారు నిపుణులు. బేబీ ఆయిల్‌తో పాటు కొన్ని ఎసెన్షియల్ నూనెలు కూడా డై మచ్చలను తొలగించడంలో సహాయపడతాయి అంటున్నారు నిపుణులు. కొన్ని చుక్కల నూనెను తీసుకొని దాన్ని మచ్చపై అప్లై చేసి చేతి మునివేళ్లతో రుద్దాలి. కాసేపటి



తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేస్తే ఫలితం ఉంటుంది. అయితే రసాయనాలు కలవని, చర్మానికి అంటినా మచ్చలు పడని హెయిర్ డైలు కూడా ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉంటున్నాయి. సాధ్యమైనంతవరకు ఇలాంటి వాటిని నిపుణుల సలహాతో ఎంచుకోవడం మంచిది.

## జీఎల్‌పీ-1 మందులను వాడిన పురుషుల్లో పెరుగుతున్న టెస్టోస్టిరాన్ స్థాయిలు.. పరిశోధనల్లో వెల్లడి..


ఊబకాయం, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలను ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బరువు తగ్గడానికి, రక్తంలో చక్కెర నియంత్రణకు ఉపయోగించే జీఎల్‌పీ-1 తరగతి మందులు మరో విధంగా కూడా ప్రయోజనం కలిగిస్తాయని ఇటీవలి పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ మందులు తీసుకున్న కొంత మంది పురుషుల్లో టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరిగినట్లు అధ్యయనాల్లో వెల్లడైంది. అయితే వీటిని నేరుగా టెస్టోస్టెరాన్ పెంచే మందులుగా పరిగణించడం సరైంది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పురుషుల్లో టెస్టోస్టెరాన్ తగ్గడానికి కేవలం వృషణాల్లో సమస్యలే కారణం కావాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకునే కొవ్వుతో సహా అధిక శరీర కొవ్వు హైపోథాలమస్-పిట్యూటరీ-గోనాడల్ (హెచ్‌పీజీ) అక్షం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది మెదడు, హార్మోన్ల వ్యవస్థ, పునరుత్పత్తి అవయవాల మధ్య జరిగే హార్మోన్ల సంకేతాలను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ నిరోధకత, శరీరంలో దీర్ఘకాలిక స్వల్పస్థాయి వాపు, లెప్టిన్ సంకేతాల్లో మార్పులు, కొవ్వు కణజాలంలో టెస్టోస్టెరాన్ ఈస్ట్రోజెన్‌గా మారడం వంటి అంశాలు కూడా హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. అందువల్ల అధిక బరువు ఉన్న పురుషుల్లో టెస్టోస్టెరాన్ తక్కువగా ఉన్నప్పుడు, టెస్టోస్టెరాన్ ఉత్పత్తిని మాత్రమే పరిశీలించడం ద్వారా పూర్తి కారణాన్ని అర్థం చేసుకోవడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. జీఎల్‌పీ-1 రిసెప్టర్ అగోనిస్టులు, టెస్టోస్టెరాన్ స్థాయిల మధ్య సంబంధంపై పరిశోధనలు ఇంకా కొనసాగుతున్నాయి. 2025లో ప్రచురితమైన ఒక సిస్టమాటిక్ రివ్యూ, మెటా-అనాలిసిస్‌లో ఏడు అధ్యయనాలకు చెందిన 680 మంది పాల్గొన్నారు. జీఎల్‌పీ-1 మందులతో చికిత్స పొందిన వారిలో మొత్తం టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరిగినట్లు ఈ విశ్లేషణలో తేలింది. అదే సమయంలో శరీర బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), నడుము చుట్టుకొలత, హెచ్‌బీఏ1సీ స్థాయిలు కూడా తగ్గినట్లు గుర్తించారు.




2026లో ప్రచురితమైన మరో సిస్టమాటిక్ రివ్యూలో 10 అధ్యయనాలకు చెందిన 639 మంది పురుషుల డేటాను పరిశీలించారు. జీఎల్పీ-1 చికిత్స సమయంలో మొత్తం టెస్టోస్టెరాన్ సాధారణంగా పెరిగినట్లు ఇందులో వెల్లడైం ది. ముఖ్యంగా ఊబకాయం, టైప్-2 మధుమేహం లేదా ఫంక్షనల్ హైపోగోనాడిజం ఉన్న పురుషుల్లో ఈ మార్పు ఎక్కువగా కనిపించింది. అయితే ఫ్రీ టెస్టోస్టెరాన్ విషయం లో ఫలితాలు అంత స్థిరంగా లేవు. మొత్తం టెస్టోస్టెరాన్, ఫ్రీ టెస్టోస్టెరాన్ రెండూ ఒకటే కావు. రక్తంలో ఎక్కువ భాగం టెస్టోస్టెరాన్ కొన్ని ప్రోటీన్లకు అనుసంధానమై ఉంటుంది. కొంత భాగం మాత్రమే స్వేచ్ఛగా లేదా ఫ్రీ రూపంలో ఉంటుంది. శరీర కణజాలాలకు జీవశాస్త్రపరంగా అందుబాటులో ఉండేది ప్రధానంగా ఈ ఫ్రీ టెస్టోస్టెరాన్. కాబట్టి ఒక రకమైన టెస్టోస్టెరాన్ స్థాయి పెరిగిందని, పురుష హార్మోన్ల పనితీరు మొత్తం మెరుగుపడిందని అర్థం చేసుకోకూడదు. జీఎల్‌పీ-1 మందులు నేరుగా పురుషుల పునరుత్పత్తి హార్మోన్ల వ్యవస్థపై పనిచేస్తున్నాయా, లేక బరువు తగ్గడం, ఇన్సులిన్ నిరోధకత తగ్గడం, మెరుగైన మెటబాలిక్ ఆరోగ్యం కారణంగానే టెస్టోస్టెరాన్ పెరుగుతోందా అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఊబకాయం సాధారణ పునరుత్పత్తి హార్మోన్ల సంకేతాలను అణిచివేస్తుంది. శరీర బరువు, ఇన్సులిన్ నిరోధకత, మెటబాలిక్ ఆరోగ్యం మెరుగుపడినప్పుడు ఈ హార్మోన్లలో కూడా కొంత మెరుగుదల వచ్చే అవకాశం ఉంటుంది. ఊబకాయం కారణం గా టెస్టోస్టెరాన్ తగ్గిన పురుషుల్లో లిరాగ్లుటైడ్‌ను టెస్టోస్టెరాన్ రీప్లేస్ మెంట్ థెరపీతో పోల్చిన ఒక అధ్యయనం కూడా ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 16 వారాల తర్వాత రెండు గ్రూపుల్లోనూ టెస్టోస్టెరాన్ స్థాయిలు పెరిగాయి. అయితే లిరాగ్లుటైడ్ తీసుకున్నవారిలో బరువు తగ్గడం గణనీయంగా ఎక్కువగా ఉంది. ఈ గ్రూపులో సగటున 7.9 కిలోల బరువు తగ్గగా, టెస్టోస్టెరాన్ చికిత్స పొందిన గ్రూపులో సుమారు 0.9 కిలోల బరువు మాత్రమే తగ్గింది.

## మార్కెట్‌లో అందుబాటులో ఉన్న బీట్‌రూట్ సప్లిమెంట్లు..

బీట్‌రూట్‌ను ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయల్లో ఒకటిగా పరిగణిస్తారు. రక్త ప్రసరణను మెరుగుపరచడం, గుండె ఆరోగ్యానికి తోడ్పడటం, వ్యాయామ సమయంలో శక్తి సామర్థ్యాలను పెంచడం వంటి ప్రయోజనాలు ఇందులో ఉన్నాయని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం బీట్‌రూట్‌లోని పోషకాలను అధిక సాంద్రతలో అందించే క్యాప్సూల్స్ కూడా సప్లిమెంట్లుగా అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని అవసరం లేకుండా లేదా వైద్యుల సలహా లేకుండా తీసుకోవడం సరైనది కాదని నిపుణులు సూచిస్తున్నారు. బీట్‌రూట్ క్యాప్సూల్స్‌లో బీట్‌రూట్ సారాన్ని అధిక సాంద్రతలో ఉపయోగిస్తారు. వీటిలో ప్రధానంగా నైట్రేట్లు ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను సడలించడంలో సహాయపడతాయి. తద్వారా రక్త ప్రసరణకు, గుండె పనితీరుకు కొంత మద్దతు లభిస్తుంది. శరీరంలోని కణజాలాలకు ఆక్సిజన్ సరఫరా మెరుగుపడటంలో కూడా ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. బీట్‌రూట్ క్యాప్సూల్స్ వ్యాయామ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. వ్యాయామ సమయంలో శరీరానికి అవసరమయ్యే ఆక్సిజన్ పరిమాణాన్ని తగ్గించడం ద్వారా ఎక్కువసేపు వ్యాయామం చేయడానికి, స్టామినాను పెంచడానికి ఇవి ఉపయోగపడే అవకాశం ఉంది. అయితే ఈ ప్రభావం తీసుకునే మోతాదు, వ్యక్తి ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ మందగించే రక్త ప్రసరణను మెరుగుపరచడంలో కూడా బీట్‌రూట్‌లోని నైట్రేట్లు కొంత ప్రయోజనం అందిస్తాయి. అంతేకాకుండా బీట్‌రూట్‌లో బీటలైన్స్ వంటి యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గించడంలో సహాయపడతాయని చెబుతున్నారు. అయితే బీట్‌రూట్ క్యాప్సూల్స్ కంటే తాజా బీట్‌రూట్‌ను ఆహారంలో భాగంగా తీసుకోవడం పోషకపరంగా మెరుగైన ఎంపికగా నిలుస్తుంది. తాజా బీట్‌రూట్‌లో ఫైబర్‌తోపాటు వివిధ విటమిన్లు, ఖనిజాలు కూడా లభిస్తాయి. క్యాప్సూల్స్‌లో మాత్రం బీట్‌రూట్ సారం మాత్రమే అధిక సాంద్రతలో ఉంటుంది. శరీరం దానిని ఎంతవరకు గ్రహించి, ఆశించిన ప్రయోజనాలను అందుకుంటుందనేది వ్యక్తి వ్యక్తికి మారే అవకాశం ఉంటుంది. బీట్‌రూట్ క్యాప్సూల్స్‌కు నిర్ణీతంగా ఒకే మోతాదు ఉండదు. క్యాప్సూల్‌లో ఉన్న బీట్‌రూట్ సారం పరిమాణం, నైట్రేట్ మోతాదు, తయారీదారు



సూచనలు, వ్యక్తి ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను బట్టి మోతాదు మారుతుంది. అందువల్ల ప్యాక్‌పై సూచించిన మోతాదును మించి తీసుకోకూడదు. ముఖ్యంగా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు లేదా మందులు వాడుతున్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాతే వీటిని ఉపయోగించడం మంచిది. బీట్‌రూట్ క్యాప్సూల్స్ కొందరిలో దుష్ప్రభావాలకు కూడా కారణమయ్యే అవకాశం ఉంటుంది. కడుపులో అసౌకర్యం, ఉబ్బరం, వికారం వంటి సమస్యలు తలెత్తుతాయి. బీట్‌రూట్‌లోని సహజ వర్ణద్రవ్యాల కారణంగా మూత్రం గులాబీ లేదా ఎరుపు రంగులోకి మారుతుంది. దీనిని బీట్యూరియా అంటారు. సాధారణంగా ఇది ప్రమాదకరం కాకపోయినా, ఇతర లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించడం మంచిది. కొన్ని మందులతో బీట్‌రూట్ క్యాప్సూల్స్ పరస్పర చర్యకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రక్తపోటును తగ్గించే మందులు, నైట్రేట్ కలిగిన కొన్ని మందులను వాడుతున్నవారు జాగ్రత్తగా ఉండాలి. బీట్‌రూట్‌లోని నైట్రేట్లు రక్తనాళాలను సడలించడంతో రక్తపోటు మరింత తగ్గే అవకాశం ఉంటుంది. తక్కువ రక్తపోటు ఉన్నవారు, మూత్రపిండాల వ్యాధి కారణంగా ఆహార నియంత్రణ పాటిస్తున్నవారు, గతంలో కిడ్నీలో రాళ్లు ఏర్పడినవారు, కొన్ని రకాల గుండె సమస్యలు ఉన్నవారు బీట్‌రూట్ క్యాప్సూల్స్ తీసుకునే ముందు వైద్యుల సలహా తీసుకోవాలి. ఒకేసారి పలు రక్తపోటు మందులు వాడుతున్నవారు కూడా స్వయంగా ఈ సప్లిమెంట్లను ప్రారంభించకూడదు. ఆహారం ద్వారా ఇప్పటికే తగినంత పోషకాలు అందుతున్న ఆరోగ్యకరమైన వ్యక్తులకు బీట్‌రూట్ క్యాప్సూల్స్ తప్పనిసరి కాదు. రోజువారీ ఆహారంలో కూరగాయలు, నైట్రేట్లు సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు తగినంతగా తీసుకుంటున్నవారికి అదనంగా సప్లిమెంట్ తీసు కునే అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యేకమైన వైద్య లేదా వ్యాయామ సంబంధిత అవసరం లేని వారు కూడా వీటిని అనవసరంగా తీసుకోవాల్సిన అవసరం లేదు. బీట్‌రూట్ క్యాప్సూల్స్ రక్త ప్రసరణ, గుండె ఆరోగ్యం, వ్యాయామ సామర్థ్యానికి కొన్ని ప్రయోజనాలు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరికీ ఇవి అవసరం అని చెప్పలేం. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, మందులు వాడుతున్నవారు వైద్యుల సలహా లేకుండా వీటిని తీసుకోకపోవడం మంచిది. సాధ్యమైనంత వరకు తాజా బీట్‌రూట్‌ను సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవడం ద్వారా సహజమైన పోషకాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## పోకో నుంచి 2 కొత్త ఫోన్లు..



షావోమీ అనుబంధ సంస్థ పోకో (Poco) దేశీయ మార్కెట్‌లోకి రెండు కొత్త స్మార్ట్‌ఫోన్లను తీసుకొచ్చింది. మిడ్‌రేంజ్‌లో ఎక్స్8 (Poco X8), ఎక్స్8 పవర్‌ను (Poco X8 power) విడుదల చేసింది. ఈ సిరీస్‌లో ఎక్స్8 ప్రో, ఎక్స్8 ప్రో మ్యాక్స్‌ను ఇది వరకే తీసుకొచ్చింది. ఇక, పోకో ఎక్స్8 పవర్ వేరియంట్‌ను 10,000 ఎంఏహెచ్ బ్యాటరీతో తీసుకురావడం విశేషం. స్టాండర్డ్ వేరియంట్ ఎక్స్8లో 9,000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇచ్చారు. రెండింట్లోనూ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే ఇవ్వడం విశేషం.




# కెన్యా యూనిట్‌లో సమస్య పరిష్కారానికి సిద్ధం: టాటా కెమికల్స్




కెన్యా లోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని ఆ దేశాధ్యక్షుడు చేసిన హెచ్చరికలపై టాటా గ్రూప్‌నకు చెందిన టాటా కెమికల్స్ స్పందించింది. ఆ యూనిట్‌లో సమస్యను చట్టబద్ధంగా పరిష్కరించుకోవడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపింది. ఈ విషయంపై ప్రభుత్వంతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించింది. 2005లో టాటా కెమికల్స్ మగాడి లిమిటెడ్ ప్లాంట్‌ను ప్రారంభించినప్పటి నుంచి తూర్పు ఆఫ్రికా దేశ ఆర్థిక వ్యవస్థలో తమ సంస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపింది. జులై 28, 2026న ఆ ప్రదేశంలో మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసినట్లు కంపెనీ వెల్లడించింది. వాటికి సంబంధించిన మైనింగ్ పత్రాలను సంబంధిత మంత్రిత్వ శాఖకు సమర్పించినట్లు తెలిపింది. మంత్రిత్వ శాఖ లేవనెత్తిన అన్ని అంశాలకు సంబంధించిన సమగ్ర నివేదికలు అందించినట్లు పేర్కొంది. తదుపరి ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్లు స్పష్టం చేసింది. ఉద్యోగులు, మగాడి కమ్యూనిటీ, కెన్యాలోని వాటాదారుల సంక్షేమంపై కట్టుబడి ఉన్నామంది. కెన్యా ఆర్థికాభివృద్ధే తమ ప్రధానప్రాధాన్యతగా కొనసాగుతుందని స్పష్టంచేసింది. కెన్యా అధ్యక్షుడు విలియం రూటో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లేక్ మగాడి ప్రాంతంలోని టాటా కెమికల్స్ కార్యకలాపాలు నిలిపేయాలని కంపెనీని ఆదేశించారు. తమ దేశంలోని వనరులను ఉపయోగించుకుంటున్నప్పటికీ.. ఆ కంపెనీ స్థానికులకు ఉద్యోగాలుఇవ్వట్లేదని ఆరోపించారు. టాటాకు సుమారు 100 ఏళ్ల కాంట్రాక్ట్ ఉన్నప్పటికీ తమ పౌరులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అందువల్ల కంపెనీని మూసివేయాలని ఆదేశించారు. కాగా, టాటా కెమికల్స్ మగాడి ఆఫ్రికాలోనే అతిపెద్ద సోడా యాష్ ఉత్పత్తి కేంద్రంగా పేరొందింది.

# నాలుగు రోజుల వరుస నష్టాలకు విరామం



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అమెరికాలో వడ్డీ రేట్ల భయాలు సన్నగిల్లడంతో అంతర్జాతీయ మార్కెట్లు సహా దేశీయ మార్కెట్ సూచీలు లాభపడ్డాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 76,657.02 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,152.86) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,883.14 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 362.57 పాయింట్ల లాభంతో 76,515.43 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24.25 పాయింట్ల లాభంతో 23,897.70 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.49గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 95.22 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,472 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## ఉద్యోగుల 'స్లాక్' ఖాతాలు మాయం..




భారీగా లేఆఫ్‌లకు సిద్ధమైన టెక్ దిగ్గజం ఒరాకిల్.. ఈసారి సైలెంట్‌గా ఉద్యోగులను తొలగిస్తోందని తెలుస్తోంది. గతంలో మాదిరిగా ఉదయం ఆరుగంటల సమయంలో ఉద్యోగులకు ఎలాంటి ఈ మెయిల్స్ రాలేదు. కానీ సిబ్బంది 'స్లాక్' ఖాతాలు మాత్రం మాయమవుతున్నాయట. ఈ మేరకు r/employeesOfOracle పేరుతో ఉన్న రెడిట్ ఖాతాలో 'లేఆఫ్స్ స్టార్టెడ్ ఇన్ యూఎస్' అనే ఒక థ్రెడ్ తాజాగా వైరల్ అవుతోంది. కంపెనీ అంతర్గత కమ్యూనికేషన్ యాప్ 'స్లాక్'లో లేఆఫ్‌లకు గురైన వారి ఖాతాలు క్రమక్రమంగా కనిపించకుండా పోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. వీరందరికీ ఒకేసారి సందేశాలు పంపకపోయినా.. తొలగింపులు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. లేఆఫ్ తర్వాత ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే.. సదరు ఉద్యోగుల స్లాక్ ఖాతాలు, కంపెనీ ఈ మెయిల్ యాక్సెస్‌ను నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కంపెనీ నుంచి ఎవరెవరిని తీసేస్తున్నారో అధికారికంగా తెలియకపోవడంతో, మిగిలిన ఉద్యోగులు స్లాక్ గ్రూప్‌లలోని సభ్యుల సంఖ్యను గమనిస్తున్నారట. ఎంతమంది తగ్గిపోయారో ట్రాక్ చేస్తున్నారు. ఒరాకిల్‌కు చెందిన అప్లికేషన్ ల్యాబ్స్ బృందంలోని వైస్ ప్రెసిడెంట్స్ (VP), గ్రూప్ వైస్ ప్రెసిడెంట్స్ (GVP) పదవులు పోయినట్లు సమాచారం. ఈ బృందాన్ని ఇటీవల ఒరాకిల్ క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (OCI)లో విలీనం చేశారు. తాజా కోతలతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7,000 నుంచి 10,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా. భారత్‌లో వివిధ విభాగాల మేనేజర్లు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది.ఈ ఏడాది మార్చి నెలలో ఒరాకిల్ 10వేల మంది సిబ్బందిని తగ్గించుకుంది. అప్పుడు ఒకటో తేదీ ఉదయం ఆరుగంటల సమయంలో యూఎస్, ఇండియా, కెనడాలోని సిబ్బందికి తొలగింపు మెయిల్స్ పంపింది (Oracle layoffs). ఇప్పుడు సెప్టెంబర్ ఒకటిన అలాంటి మెయిల్స్ వస్తాయని భావించినా.. కంపెనీ భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మీడియా దృష్టిలో పడకుండా, విమర్శలకు దూరంగా ఉండేందుకు ఇలా చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఉద్యోగులను తొలగిస్తున్నాం: ఫోక్స్‌వ్యాగన్ ప్రకటన

జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ భారీ సంఖ్యలో ఉద్యోగులను తగ్గించుకోనుంది. ఈ దశాబ్దం చివరినాటికి లక్ష ఉద్యోగాలకు కోత పెట్టనుంది. ఈ మేరకు యాజమాన్యం, కార్మిక సంఘాలు ఒక అంగీకారానికి వచ్చాయని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. తొలుత 50వేల మందిని తొలగించాలని నిర్ణయించిన సంస్థ.. అదనంగా మరో 50వేలమంది తొలగింపు ప్రణాళికను కూడా ఆమోదించినట్లు చెప్పింది.



''కంపెనీ ఆర్థికపరమైన అంశాలకు తగ్గట్టుగా శ్రామికశక్తి సర్దుబాటు చేయడం తప్పనిసరి'' అని పేర్కొంది. ఇదే జరిగితే.. ఇది ఆటో పరిశ్రమ చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ కానుంది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఈ లక్ష మంది దాదాపు 15 శాతానికి సమానం. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌లో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోనే 43 శాతం మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కోతలను కార్మికసంఘాలు వ్యతిరేకించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు కంపెనీ ప్రకటనలో కోతలకు ఆ సంఘాలు కూడా అంగీకరించినట్లు పేర్కొనడం గమనార్హం. అలాగే నాలుగు జర్మన్ ప్లాంట్లను మూసే ప్రణాళికను ప్రస్తావించింది.

# అడోబ్ సీఈఓగా మళ్లీ భారతీయుడే..




అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ నాయకత్వ పగ్గాలు మళ్లీ భారతీయుడికే దక్కాయి. ఇప్పటివరకు సీఈఓగా ఉన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి వైదొలుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కంపెనీ నూతన సీఈఓ గా అనిల్ చక్రవర్తి నియమితులయ్యారు. డిసెంబర్ 1న అనిల్ ఈ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఏఐ ప్రభావం నేపథ్యంలో డిజైన్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్‌లో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవడానికి అడోబ్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థలో నాయకత్వ మార్పు చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు దశాబ్దాలుగా సీఈఓగా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఈ పదవి నుంచి వైదొలుగుతున్నట్లు మార్చిలో కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం ఈయన ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఏఐ (AI) యుగంలో అడోబ్ వృద్ధికి నాయకత్వం వహించడానికి అనిల్ సరైన వ్యక్తి అని నమ్ముతున్నానని శంతను నారాయణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. భారత్‌కు చెందిన అనిల్ చక్రవర్తి ఐఐటీ వారణాసి నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ చదివారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్, పీహెచ్‌డీ పట్టాలు పొందారు. 2020లో ఆయన అడోబ్‌లో చేరారు. కొన్నేళ్లపాటు డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ వ్యాపారానికి నాయకత్వం వహించారు. అనంతరం కస్టమర్ సపోర్ట్ కార్యకలాపాలను పర్యవేక్షించే బాధ్యత చేపట్టారు. అదే సమయంలో సంస్థ గ్లోబల్ సేల్స్‌ను కూడా పర్యవేక్షించారు. అడోబ్‌లో చేరడానికి ముందు అనిల్ చక్రవర్తి క్లౌడ్ డేటా-మేనేజ్‌మెంట్ కంపెనీ ఇన్‌ఫర్మేటికాలో నాలుగేళ్ల పాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు.




## ప్రపంచ నం.11కు అనాహత్ షాక్



లండన్ స్క్వాష్ క్లాసిక్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయి అనాహత్ సింగ్ సంచలన విజయం సాధించింది. గురువారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్లో ఆమె 13-11, 4-11, 11-8తో ప్రపంచ 11వ ర్యాంకు ప్లేయర్ నీల్ గిల్స్ (బెల్జియం)కు షాకిచ్చి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రపంచ 5వ ర్యాంకు ప్లేయర్ శివసంగరి సుబ్రమణ్యం (మలేసియా), నర్దెన్ గ్రాస్ (ఈజిప్ట్) మధ్య పోరులో విజేతతో అనాహత్ క్వార్టర్స్‌లో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో రమిత్ టాండన్ ఇంటిముఖం పట్టాడు. రెండో రౌండ్లో రమిత్ 10-12, 9-11తో మహ్మద్ ఎల్‌షోర్‌బాగీ (బ్రిటన్) చేతిలో ఓడాడు.

# నేనెప్పుడూ అలా ఆలోచించలేదు: స్మృతి మంధాన




మహిళల క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా స్మృతి మంధాన రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు ఆ ఘనత మిథాలి రాజ్ (10,868) పేరిట ఉండేది. దీనిపై స్మృతి మంధాన స్పందించింది. తానెప్పుడూ మిథాలి రికార్డు గురించి ఆలోచించలేదని.. తనకు వ్యక్తిగత గణాంకాల కంటే భారత్ విజయాలే ముఖ్యమని బీసీసీఐ వీడియోలో స్పష్టం చేసింది. ''నేను బ్యాటింగ్ చేస్తున్నంత సేపూ రికార్డుల గురించి పట్టించుకోను. ఈ ఘనత సాధించాక మాత్రం చాలా ఆనందంగా అనిపించింది. మిథాలి రాజ్ లెజెండరీ క్రికెటర్. మాకు రోల్ మోడల్. ఆమె బ్యాటింగ్‌ను చూస్తూ పెరిగాం. పరుగుల విషయంలో ఆమెను దాటేస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఇక, ఈ లిస్ట్‌లో తొలి రెండు స్థానాల్లో భారత ప్లేయర్లే ఉండటం సంతోషంగా అనిపిస్తోంది. అయితే, నాకు గణాంకాల కంటే భారత్ విజయం సాధించడమే ముఖ్యం'' అని మంధాన తెలిపింది. ''ఆసియా కప్ జరుగుతోన్న దుబాయ్ పిచ్‌లపై ఆడటం తేలికగా అనిపించలేదు. మా మిడిలార్డర్ నుంచి ఎక్కువ పరుగులు రాలేదు. ప్రతి ఒక్కరూ అత్యున్నత ప్లేయర్లే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ, ఇక్కడి వాతావరణం ఇబ్బంది పెడుతోంది. స్టీమ్ బాక్స్‌లో ఉన్నట్లే ఉంది. ఉక్క, ఎండ వేడిమికి మ్యాచులు ఆడటం కాస్త కష్టమే. అయితే, తప్పకుండా ఈ పరిస్థితులను అలవాటు చేసుకొని పరుగులు రాబడతారనే నమ్మకం నాకుంది'' అని మంధాన తెలిపింది. ఇక, మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టాప్ స్కోరర్‌గా నిలవాలంటే మంధానకు మరో 78 పరుగులు అవసరం. ప్రస్తుతం ఆమె 4,681 పరుగులు చేయగా.. న్యూజి లాండ్ ప్లేయర్ బేట్స్ 4,758 పరుగులతో అగ్రస్థానంలో ఉంది. ఈ ఆసియా కప్‌లోనే స్మృతి ఆ రికార్డునూ కొట్టేసే అవకాశం లేకపోలేదు.

## లాయ్‌కి శ్రీకాంత్ షాక్

ఒకప్పటి ఫామ్‌ను అందుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్న సీనియర్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్.. చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సంచలన విజయం సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 35వ స్థానంలో ఉన్న శ్రీకాంత్.. తొమ్మిదో ర్యాంకు క్రీడాకారుడు విక్టర్ లాయ్‌ను ఓడించి పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో అడుగు పెట్టాడు. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో 33 ఏళ్ల శ్రీకాంత్ 21-18, 21-19తో విజయం సాధించాడు. ఒకప్పుడు ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న శ్రీకాంత్.. గత కొన్నేళ్లలో పేలవ ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో పతనం చవిచూశాడు. ఈ ఏడాది యుఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరడం ద్వారా మళ్లీ తన ఉనికిని చాటిన అతడు.. ఇప్పుడు చైనా మాస్టర్స్ టైటిల్‌పై కన్నేశాడు. ''నేను స్కోరు గురించి పట్టించుకోలేదు. మ్యాచ్‌లో బాగా ఆడుతున్నానా లేదా అన్నది మాత్రమే ఆలోచించా. ప్రత్యర్థి ఏడాదిగా చాలా బాగా ఆడుతున్నాడు. నేను నా ఉత్తమ ఆట ఆడితే గెలిచే అవకాశం ఉంటుందని తెలుసు. పూర్తిగా నా ఆట మీదే దృష్టి నిలిపి మ్యాచ్‌లో గెలిచా'' అని శ్రీకాంత్ తెలిపాడు. క్వార్టర్స్‌లో శ్రీకాంత్.. హాంకాంగ్ ఆటగాడు లీ చియక్‌తో తలపడతాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో స్టార్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. ప్రిక్వార్టర్స్‌లో భారత జోడీ 21-15, 22-24, 21-9తో క్రిస్టో-టోమా పొపోవ్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది. తొలి గేమ్‌ను కొంచెం సులువుగానే చేజిక్కించుకున్న సాత్విక్ జోడీ.. త్రుటిలో రెండో గేమ్ చేజార్చుకుంది. నిర్ణయాత్మక గేమ్‌లో భారత జంట చెలరేగి ఆడి మ్యాచ్‌ను సొంతం



చేసుకుంది. మహిళల సింగిల్స్‌లో తన్వి శర్మకు మాత్రం నిరాశ తప్పలేదు. ఆమె ప్రిక్వార్టర్స్‌లో 17-21, 21-18, 16-21తో టొమాకా మియాజకి (జపాన్) చేతిలో పోరాడి ఓడింది.

## రోహిత్ నుంచి ఇంకేం కావాలి?

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ రిటైర్మెంట్‌పై కొంత కాలంగా సాగుతున్న ఊహాగానాలకు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెరదించాడు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడని, అంతకంటే తన నుంచి ఏం ఆశిస్తామని సైకియా అన్నాడు. రెండేళ్ల




ముందు టీ20లకు, గత ఏడాది టెస్టులకు గుడ్‌బై చెప్పిన రోహిత్.. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు ఆడాలని అతను ఆశిస్తుండగా.. జులైలో ఇంగ్లాండ్‌తో సిరీస్ అవ్వగానే హిట్‌మ్యాన్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడని జోరుగా ప్రచారం జరిగింది. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఒత్తిడి మేరకే రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ సిరీస్ ముగిసినా అతను రిటైర్మెంట్ ఏమీ ప్రకటించలేదు. అయితే బీసీసీఐ జోక్యంతోనే రోహిత్ వెనక్కి తగ్గినట్లుగా అప్పుడు చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవలి టీమ్‌ఇండియా ప్రదర్శనపై గురువారం బీసీసీఐ సమీక్ష సమావేశం జరిగిన అనంతరం సైకియా మీడియాతో మాట్లాడుతూ.. ''అతను అన్ని మ్యాచ్‌ల్లో చాలా బాగా ఆడుతున్నాడు. అంతకంటే ఏం కావాలి? చివరగా ఇంగ్లాండ్‌పై 138 పరుగులు చేశాడు. అలాంటపుడు రోహిత్ రిటైర్మెంట్ గురించి ఊహాగానాలు ఎందుకు? వీటికి ఊతమివ్వాలని నేను అనుకోవడం లేదు'' అని పేర్కొన్నాడు. ఈ సమావేశంలో భారత టెస్టు-వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 సారథి శ్రేయస్ అయ్యర్, కోచ్ గౌతమ్ గంభీర్, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) క్రికెట్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు పలువురు బోర్డు అధికారులు పాల్గొన్నారు.

# రోహిత్ యాదవ్ ఒక్కడే కాదు.. మరో 61 మంది దొరికిపోయారు!

పశ్చిమ్ బెంగాల్ లెగ్ స్పిన్నర్ రోహిత్ యాదవ్‌పై భారత క్రికెట్ బోర్డు రెండేళ్ల పాటు నిషేధం విధించింది. తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు ఆరోపణలు రావడంతో బీసీసీఐ చర్యలు చేపట్టింది. రాబోయే ఆస్ట్రేలియా సిరీస్‌లో ఆడేందుకు ఇటీవలే రోహిత్ అండర్ -19 జట్టుకు ఎంపిక కావడం గమనార్హం. ఇప్పుడీ నిషేధంతో అతడిని టీమ్ నుంచి తప్పించడం ఖాయం. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన రోహిత్ యాదవ్ గత జులైలో అండర్ -19 జట్టుతో శ్రీలంక పర్యటనకు వెళ్లాడు. అనధికారిక టెస్టులో ఆరు వికెట్లు తీసి సత్తా చాటాడు. ఇప్పుడు ఆసీస్‌తో ఆడే టీమ్‌కూ ఎంపికయ్యాడు. శ్రీలంక పర్యటనకు వెళ్లినప్పుడే రోహిత్ యాదవ్ పత్రాలను పరిశీలించగా.. వయసులో వ్యత్యాసం వెలుగులోకి వచ్చింది. రోహిత్ వద్ద 2007, 2009, 2010 సంవత్సరాల్లో పుట్టినట్లుగా మూడు ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. దీంతో అతడు




అండర్ - 19 క్రికెట్‌ను ఆడేందుకు అనర్హుడైనట్లే. అతడి ఆధార్ కార్డులోని వయసు కూడా సరిగాలేదు. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) వద్ద తన పేరును నమోదు చేసుకున్నప్పుడు పుట్టిన సంవత్సరాన్ని 2007గా పేర్కొన్నాడు. కానీ, అతడు 2017, 2020లో అప్‌డేట్ చేసిన ఆధార్ కార్డులో మాత్రం పుట్టిన సంవత్సరం 2006గా ఉంది. ఇక 2021లో అయితే దాన్ని 2009గా మార్చుకున్నాడు. దీంతో రోహిత్ జూనియర్ జట్టుతో ఆడేందుకు అనర్హుడని, తప్పుడు పత్రాలు సమర్పించినట్లు బీసీసీఐకి (BCCI) సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలో బోర్డు రోహిత్‌పై రెండేళ్ల పాటు నిషేధం విధించినట్లు అన్ని రాష్ట్రాల బోర్డులకు తెలియజేసింది. 2026-27, 2027-28 సీజన్లలో ఆడేందుకు క్యాబ్ (Cricket Association of Bengal) వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రికెటర్లలో రోహిత్‌తోపాటు 62 మంది ప్లేయర్లు అనర్హతకు గురయ్యారు. ఇందులో అండర్ -19 వరల్డ్ కప్ విన్నర్ రవికుమార్, స్పిన్ ఆల్‌రౌండర్ విశాల్ భట్టి కూడా ఉన్నారు. తప్పుడు జనన ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు తేలింది. దీంతో వారిపై క్యాబ్ అనర్హత వేటు వేసింది.

# 7 నుంచి 'కాకా' హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్ ప్రారంభం

**వుదయం సినిమా:** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ కాకా. వెంకట్ కే నారాయణ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా కానుంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన వర్కింగ్ స్టిల్‌లో మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి షూటింగ్ లొకేషన్ లో డిస్కస్ చేస్తూ కనిపించారు. ఈ అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్, ఆంటోనీ ఎల్. రూబెన్ ఎడిటింగ్. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి అడిషినల్ స్క్రీన్ ప్లే రైటర్స్‌గా పనిచేస్తున్నారు. భాను-నందు డైలాగ్స్



రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో 'కాకా' నెక్స్ట్ భారీ షెడ్యూల్ ప్రారంభం బిహైండ్ ద సీన్ పిక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, రాస్తున్నారు. 2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, అనస్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను.

వుదయం సినిమా

# వైరల్ గా మారిన లుక్ టెస్ట్ గ్లింప్స్

**వుదయం సినిమా:** యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ కొత్త సినిమా ప్రకటించింది. ఈ చిత్రానికి ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని ఆర్‌కేఎఫ్ఐ (రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్), టర్మరిక్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మించనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా వరల్డ్‌పై ఆసక్తిని పెంచుతోంది.ఈ పోస్టర్‌లో కమల్ హాసన్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో, గడ్డంతో, బ్లాక్ షర్ట్, ఆలివ్ గ్రీన్ ట్రౌజర్స్‌లో కనిపిస్తున్నారు. పవర్‌ఫుల్‌గా కనిపించే లుక్‌కు చేతిలో పట్టుకున్నఆయుధం మరింత ఇంటెన్స్‌నెస్ తీసుకొచ్చింది. ఎంతో కూల్‌గా కనిపిస్తూనే, భారీ ఆయుధంతో నడుస్తున్న కమల్ హాసన్ లుక్.. ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే ఆసక్తిని కలిగిస్తోంది.కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా లుక్ టెస్ట్‌ను నిన్న నిర్వహించారు. ఈ లుక్ టెస్ట్‌కు సంబంధించిన కొన్ని గ్లింప్స్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'ఇరుముడి' ఓ మిరాకిల్

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ జెనరేషనల్ బ్లాక్‌బస్టర్ 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలై ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్, రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్స్‌తో ఘన విజయాన్ని అందుకుని సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ జెనరేషనల్ బ్లాక్‌బస్టర్ ప్రెస్‌మీట్ నిర్వహించారు.





**శివ నిర్వాణ.. ఇరుముడి సినిమా చాలా పెద్ద విజయం సాధించింది. అద్భుతమైన కలెక్షన్స్ వస్తున్నాయి. ప్రేక్షకుల్ని ఇంతలా కనెక్ట్ చేసిన అంశం ఏమిటని దర్శకుడుగా మీరు భావిస్తున్నారు?**

–ఎమోషన్, అలాగే రియలిస్టిక్ వరల్డ్. నేను తీసుకున్న మూడు లేయర్స్.. వాటి బ్లెండింగ్ సూపర్‌గా వర్కౌట్ అయింది. అలాగే ఎమోషనల్‌గా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రతి ఇంట్లో ఈ సినిమా చూసిన వాళ్లు.. ఇది మన కథ, మన ఇంట్లో ఒక ఆడపిల్ల కథ, మన అమ్మానాన్నల కథ అనే ఫీలింగ్ తీసుకొచ్చింది. అదే ఆడిటోరియంలో ఎక్స్‌ట్రార్డినరీగా వర్కౌట్ అయింది.

**రవి .. ఇరుముడి ఇంకా ఎంత పెద్ద రేంజ్‌కి వెళ్తుంది అనేది మీకు ఒక ఐడియా ఉందా?**

–మేము ఈ సినిమా రిలీజ్ చేసినప్పుడు మంచి ఫలితం వస్తుందని అనుకున్నాము. కాకపోతే మేము ఊహించిన దాని కంటే అద్భుతమైన ఫలితం వచ్చింది. ఈ సినిమా ఫుట్‌ఫాల్ సెన్సేషనల్‌గా ఉన్నాయి.

**నవీన్ .. 200 కోట్ల పోస్టర్ చూసిన తర్వాత హీరో రెస్పాన్స్ ఏమిటి?**

– మేము ప్రతిరోజు ఈ సినిమా కలెక్షన్స్ గురించి మాట్లాడుకుంటాం. ఇలాంటి సక్సెస్ కెరీర్‌లో ఎవరికైనా ఒకసారి లేదా రెండుసార్లు మాత్రమే వస్తుంది. ఈ సక్సెస్ విషయంలో రవితేజ, మేము చాలా హ్యాపీగా ఉన్నాం.

**శివ .. ఈ సినిమా విషయంలో మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?**

–ఈ సినిమాలో ఒక మంచి సందేశం ఉంటుందని నాకు తెలుసు. కాకపోతే అదేదో మేము ఒక మెసేజ్ ఇస్తున్నట్టుగా చెప్పలేదు. అది ఆడియన్స్ అర్థం చేసుకున్నారు.. ఈ సినిమా చూస్తున్నప్పుడు తండ్రి కూతుళ్లు చాలా ఎమోషనల్ అవ్వడం, అలాగే చాలా పెద్దవాళ్లు, అమ్మమ్మలు, బామ్మలు కూడా ఈ సినిమాకి రావడం చూస్తున్నప్పుడు మాకు చాలా సంతృప్తి కలిగింది.

**నవీన్ .. ఈ సినిమాకి షీల్డ్ ఫంక్షన్, విజయోత్సవ వేడుక ఎప్పుడు నిర్వహిస్తున్నారు?** –కచ్చితంగా ప్లాన్ చేస్తున్నాము. ఈ నెల 10న వేడుక ఉండవచ్చు. ఆ వేడుక చాలా గ్రాండ్‌గా చేస్తాం.–'ఇరుముడి' సినిమా ఒక మిరాకిల్. బ్యానర్‌లో ఎన్నో బిగ్గెస్ట్ హిట్ సినిమాలు ఉన్నాయి. కాకపోతే ఇది నెక్స్ట్ లెవెల్. అభినందనలు గానీ, కలెక్షన్స్ గానీ ఒక మూమెంట్‌లాగా వస్తున్నాయి.

**శివ .. సినిమాలో రామ్ చరణ్ కనిపిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయ్యప్ప స్వామి మాల చరణ్ వేస్తుంటారు. ఆయనతో ఇలాంటి సినిమా చేసే ఆలోచన ఉందా?**

–నిజంగా చరణ్ గారు ఈ సినిమాలో కనిపించి ఉంటే అదొక అద్భుతం. కాకపోతే మేము చాలా ఆర్గానిక్‌గా ఈ కథకి ఏం కావాలో అది చేసుకుంటూ వెళ్లాం. కానీ సోషల్ మీడియాలో అభిమానుల నుంచి చరణ్ గారు కనిపిస్తే చాలా బాగుంటుందని ఆలోచన వచ్చింది.

**రవి.. ఈ సినిమా విజయాన్ని దిల్ రాజు గారు కూడా సెలబ్రేట్ చేసుకుంటామన్నారు. మీ ప్రొడ్యూసర్స్ కమ్యూనిటీలో రెస్పాన్స్ ఎలా ఉంటుంది?** –ఒక సినిమా ఆడిందంటే నెక్స్ట్ సినిమాకి అడ్వాంటేజ్ ఉంటుంది. పరిశ్రమలో అందరూ హెల్తీగా ఉంటారు.

# కృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్న రామ్ చరణ్, ఉపాసన



**వుదయం సినిమా:** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామ్ చరణ్, ఉపాసన కొణిదెల తమ ముగ్గురు చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. శ్రీకృష్ణుడు, రాధారాణి వేషధారణలో తమ చిన్నారులను ముస్తాబు చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారి కృష్ణుడు, రాధారాణి కొణిదెల వారి ఇంట్లోకి అడుగుపెట్టినట్టుగా ఉన్న ఈ అందమైన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఆకట్టుకునే ఈ ఫోటోలపై సోషల్ మీడియాలో అభిమానులు స్పందిస్తూ.."చిరంజీవి గారి ఇంట్లోకి చిన్నారి కృష్ణుడు అడుగుపెట్టాడు అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31న రామ్ చరణ్, ఉపాసన రెండోసారి తల్లిదండ్రులయ్యారు. వారికి ఒక బాబు, ఒక పాప జన్మించారు. బాబుకి శివరామ్, పాపకి అన్వీరా అని పేరు పెట్టారు.

# "డెలులు" చిత్ర టీజర్ లాంచ్

**వుదయం సినిమా:** క్రియేటివ్ లాంచ్ పాడ్ బ్యానర్ పై ప్రీతం కస్తూరి దర్శకత్వంలో సంకీర్త్ కొండ నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం డెలులు.





విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ కీలక పాత్రలు పోషించారు. రేష్మిత్ ఎస్ కౌశిక రచించిన ఈ కథకు విజయ రాజ్ కుమార్ డైలాగులు అందించగా జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ చేశారు. ఆది చేబ్రోలు సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి హరికృష్ణ కూరపాటి ఎడిటర్ గా పనిచేశారు. నేటి జెన్ జి యువతకు దగ్గరగా ఉండే ఈ సినిమా జెన్ జి భాషలోనే డెలులు అని ఉపయోగించే ఒక పదంతో జెన్ జి ప్రేక్షకులను టార్గెట్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర టీజర్ విడుదల కావడం జరిగింది. ఈ సందర్భంగా సినిమాటోగ్రాఫర్ జై రాజ్ నాయుడు మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. నాకు అవకాశం ఇచ్చి సపోర్ట్ గా నిలిచిన మా డైరెక్టర్ గారికి థాంక్స్. ఈ సినిమా మొదలై రెండు సంవత్సరాలు అయింది కాని నేను మా నిర్మాతను ఇప్పటి వరకు కలవలేదు. నన్ను కలవకుండానే నా ప్రతిభను నమ్మి, నాకు ఈ చిత్రానికి పని చేసేందుకు అవకాశం ఇచ్చారు. సినిమా ఎక్కడ బోర్ కొట్టకుండా చాలా బాగుంటుంది" అన్నారు. ఎడిటర్ హరికృష్ణ మాట్లాడుతూ... "కొత్తవారు అందరూ కలిసి ఈ సినిమా చేశాం. సినిమాలో చాలా ఫన్ ఉంటుంది. సినిమాను అందరూ ఆశిస్తారని కోరుకుంటున్నాను" అన్నారు. సంగీత దర్శకుడు ఆది చేబ్రోలు మాట్లాడుతూ... "డెలులు అనే పదం జెన్ జి నుండి వచ్చింది. తొలి చిత్రంతో చాలా ప్రూవ్ చేసుకునేందుకు ప్రయత్నించాము. నిర్మాత సంకీర్త్ గారు మాకు చాలా సపోర్ట్ ఇచ్చి మమ్మల్ని ఎంకరేజ్ చేస్తూ ఒక అన్నలా చూసుకున్నారు. ఇలా ఒక స్టేజ్ పై మాట్లాడటం కొన్ని సంవత్సరాల కల.

# ఆ రెండు ప్యానెల్స్ చేయలేని పనులను నేను చేసి చూపిస్తా..లేకుంటే రాజీనామా చేస్తా..

**వుదయం సినిమా:** తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యుల సంక్షేమం, శ్రేయస్సు కోసం ఎనలేని కృషి చేస్తానని సీనియర్ ప్రొడ్యూసర్ నట్టి కుమార్ స్పష్టం చేశారు. కౌన్సిల్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏ ప్యానెల్ తో సంబంధం లేకుండా ఇండిపెండెంట్లుగా నట్టి కుమార్ ట్రెజరర్ పోస్ట్ కు పోటీ చేస్తుండగా...ఆయన తనయుడు నట్టి క్రాంతి ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ లోని తన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో నట్టి కుమార్ మాట్లాడుతూ, కౌన్సిల్ ఎన్నికల్లో మన ప్యానెల్, ప్రోగ్రెసివ్ ప్యానెల్ పోటీకి నిలబడ్డాయని, అయితే ఆ రెండు ప్యానెల్స్ చేయలేని పనులను తాను చేసి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మెడిక్లెయిమ్ హెల్త్ పాలసీకి సంబంధించి మన ప్యానెల్ కు చెందిన చదలవాడ శ్రీనివాసరావు ఇదివరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని, కోశాధికారి పోస్ట్ కు ఆయన తాజాగా పోటీ చేస్తుండటం విచిత్రంగా ఉందన్నారు. మన ప్యానెల్ వారికి భయంపట్టుకుని బండ్ల గణేష్‌ని బతిమలాడుకున్నారు. గిల్డ్ వారిని బండ్ల గణేష్ నమ్మించి మోసం చేశాడు. అలాగే ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి స్రవంతి రవికిషోర్ పోటీలో ఉన్నారని, చార్టర్డ్ అకౌంటెంట్ గా ఆయన సమర్థుడే అయినా సభ్యుల సంక్షేమ కోసం చేసే పథకాలకు ఆయన సపోర్ట్ చేయకపోగా, అడ్డుపడతారని నట్టి కుమార్ ఆరోపించారు. తనతో పాటు తన కుమారుడు పోటీ చేస్తున్నామని చెప్పారు. సభ్యుల సంక్షేమమే తమ అజెండా అని, అందుకోసం చిరంజీవి, బాలయ్య బాబు, పవన్ కళ్యాణ్ వంటి పలువురు పెద్దల కాళ్ళు పట్టుకుని అయినా అమలు చేసి తీరుతామని ఆయన చెప్పారు. తమకు చిరంజీవి ఆశీస్సులు ఉన్నాయని అన్నారు.



# 'జాతీయ అహింసా ధ్యాన మహాసభలు'

**వుదయం సినిమా:** అహింసా భావనను సమాజంలో విస్తృతంగా పెంపొందించడంతో పాటు జీవుల పట్ల కరుణ, దయ, శాకాహారం, ధ్యానం ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'జాతీయ అహింసా ధ్యాన మహాసభలు' నిర్వహిస్తున్నట్లు నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ ఫౌండర్ ఆచార్య శ్రీనివాస్ తెలిపారు. పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూవ్‌మెంట్, నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 1 నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఐదు రోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నాయి.ఈ మహాసభలకు సంబంధించిన ముందస్తు మీడియా సమావేశం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో నిర్వహించారు. ప్రముఖ సీనియర్ నటి రోజా రమణి, సినీ రంగానికి చెందిన ప్రముఖ ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ ఫౌండర్ ఆచార్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 'జాతీయ అహింసా ధ్యాన మహాసభలు' లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ నటుడు ఉపేంద్ర, బాబా రాందేవ్, మేనకా గాంధీ తదితర ప్రముఖులు ఇటీవల లోగో ఆవిష్కరించిన దృశ్యాలను ఈ సమావేశంలో ప్రదర్శించారు.'అహింసా కుంభమేళా'గా నిర్వహిస్తున్నాం



ఆచార్య శ్రీనివాస్ మాట్లాడుతూ.. హింస జరగకూడదనే, జంతువులను చంపకూడదనే భావనతో హైదరాబాద్‌లో 'అహింసా కుంభమేళా'ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాంసాహారం మానవ జాతికి పట్టిన పీడగా ఆయన అభివర్ణించారు. మానవాళిలో అహింస, శాకాహారంపై విస్తృత ప్రచారం చేయడంతో పాటు జీవుల పట్ల దయ, కరుణను పెంపొందించడం ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.